

వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



6 కిలోలు తగ్గిన సోనమ్ బరువు 07
మణిపూర్, ఒడిశాలో లక్షలాది మంది ఓటర్ల తొలగింపు
బోనాలకు చేతివృత్తుల సందడి 03



సంపుటి 09, సంచిక: 216 | సోమవారం | 06-07-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## రాజ్యాంగ బిల్లును వ్యతిరేకిస్తాం

ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ లభించబోదు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

7లో



## ఖమేనీకి రెండోరోజు లక్షల మంది నివాళి

మొజ్తాబా మినహా ముగ్గురు కుమారుల ప్రార్థనలు

8లో



## కన్నెపల్లి మోటార్లు ప్రారంభించాలి

లేకపోతే 50వేల మంది రైతులతో వచ్చి పంప్‌హౌస్ ఆన్ చేస్తాం

ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక

3లో

లైంగిక వేధింపుల ప్రకటనలు

## తక్షణమే తొలగించండి

'మెటా'కు కేంద్రం ఆదేశాలు




**న్యూఢిల్లీ :** చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించేలా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. చిన్నారుల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే పెయిడ్‌యాడ్స్‌తో పాటు సంబంధిత కంటెంట్‌ను వెంటనే తొలగించాలని మెటాను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటాకు నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై ఏడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా సరైన సమాధానం ఇవ్వకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి తరువాయి 12లో

# నిర్ణయాలు అమలు పర్చండి





### హైదరాబాద్ మెట్రో రైల్‌పై వెంటనే ప్రత్యేక చొరవ తీసుకోండి

- ఫేజ్-2 విస్తరణకు అనుమతులు, ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయండి
- కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, కిషన్ రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- ఎస్‌బిఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని లేఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్‌ఎంఆర్) ఫేజ్–2 విస్తరణకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్–1ని తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన మెట్రో ఫేజ్–2 తరువాయి 8లో

## కన్నెపల్లి నుంచి నీటి ఎత్తిపోత

# సాధ్యం కాదు

- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదుల నిర్మాణం, పటిష్టతపై ఎన్‌డిఎస్‌ఎ అనుమానాలు
- బిఆర్‌ఎస్ స్వార్థ ప్రయోజనాల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం
- రైతులకు ప్రయోజనం శూన్యం
- గత పదేళ్లలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేసింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ




ప్రజాపక్షం/హైదరాబాద్

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కాకుండా కేవలం తమ వ్యక్తిగత లాభాపేక్ష, స్వార్థ ప్రయోజనాల కోసమే ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత పదేళ్ల కాలంలో నీటిపారుదల శాఖను, ప్రాజెక్టులను బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా సర్వనాశనం చేసిందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నాయకులే ఇప్పుడు ప్రాజెక్టుల విషయంలో గోబెల్స్‌ను మించి అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు పరిషిత్ మెహ్రా, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఇంజనీరింగ్ చీఫ్ రమేష్ బాబు , జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, సిఈ రామగుండం, కాళేశ్వరం ప్రాజెక్ట్ శ్రీనివాస్ గుప్త, విత్తన కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, లోపాలు వల్లే ఉత్తర తెలంగాణకు ప్రస్తుత పరిస్థితి దాపురించిందన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను వారి స్వార్థం కోసం కాకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నిర్మించి తరువాయి 8లో




నల్లగొండ జిల్లాలో

## రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం

చిట్యాల, మిర్యాలగూడలో ఘటనలు

ప్రజాపక్షం/చిట్యాల/మిర్యాలగూడ

నల్లగొండ జిల్లాలో ఆదివారం రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ వేర్వేరు ఘటనల్లో మొత్తం ఐదుగురు దుర్మరణం చెందారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చెన్నై నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును ఓ ప్రైవేట్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించగా, మరొక వ్యక్తి నార్కట్‌పల్లి కామినేనిలో చికిత్స పొందుతున్నప్పటికీ అతని పరిస్థితి విషమంగానే తరువాయి 8లో

11న అమెరికా–ఇరాన్

## తదుపరి చర్చలు

**ఇస్లామాబాద్ :** అమెరికా–ఇరాన్ మధ్య తదుపరి సాంకేతిక పరమైన చర్చల ప్రక్రియ జులై 11వ తేదీ శనివారం ప్రారంభమవుతాయని అచనావేస్తున్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, స్తంభించిన ఇరాన్ ఆస్తులు, ఇరాన్‌పై ఆంక్షలు అనే అంశాల పైనే ఈసారి ప్రధానంగా చర్చలు జరుగుతాయని దౌత్యవర్గాలను ఉటంకిస్తూ పాకిస్థాన్ పత్రిక ఆదివారం ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో జల రవాణా మార్గం విషయంలో అస్థిరత ఏర్పడింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం కూడా చిక్కుల్లో పడింది. ఈ ప్రాంతీయ భద్రతాంశంపై కూడా చర్చలు జరుగుతాయి. ఎంఓయులో పేర్కొన్న అంశాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు కట్టుబడాలని, ఎంఓయును గౌరవించాలని ఇరాన్ ఇప్పటికే అనేకసార్లు హెచ్చరికలు చేసింది. ఇస్లామాబాద్ వేదికగా ఈసారి మళ్ళీ చర్చలు జరుగుతాయి. ప్రస్తుతం ఇరాన్‌లో అమరవీరుడైన సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ జులై తొమ్మిదో తేదీ వరకూ కొనసాగుతుంది. తర్వాత రెండు రోజులకు తిరిగి ఎంఓయుకు అనుగుణంగా సాంకేతిక చర్చలు ప్రారంభమవుతాయి. ఖమేనీ అంత్యక్రియల కారణంగా తానే వారం రోజులపాటు విరామం పాటించినట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. పశ్చిమాసియాలో శాంతిసాధన కోసం అమెరికా–ఇరాన్ మధ్య జూన్ 17,18 తేదీలలో తాత్కాలిక ఒప్పందం ఎంఓయుపై సంతకాలు చేసే ప్రక్రియ పూర్తయింది. ఆ తర్వాత స్విట్జర్లాండ్ వేదికగా తరువాయి 8లో



ఉక్రేన్‌లో శాంతిపై

### పుతిన్–ట్రంప్ ఫోన్ సంభాషణ

**మాస్కో :** అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ అభినందనలు తెలయజేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పుతిన్ 90 నిమిషాలసేపు ఫోన్ సంభాషణ చేశారు. ఐతే టాస్ వార్తాసంస్థ సమాచారం ప్రకారం, కేవలం అభినందనలు తెలియజేయడంకోసమే ఈ ఫోన్ సంభాషణ జరిగింది. అమెరికా చరిత్రలో ఈ వేడుకలు ఒక మైలురాయి ఘట్టం. ఈ సందర్భంగా ట్రంప్‌కు ఆ దేశ ప్రజలకు పుతిన్ అభినందనలు తెలియజేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇద్దరు నాయకులమధ్యా టెలిఫోన్ సంభాషణ జరగడం ఇది 14వ సారి అని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. ఐతే తరువాయి 8లో

### సిఆర్ ఫౌండేషన్‌కు

## రూ.10 లక్షలు ఎంపి నిధులు

- మాచిరెడ్డి దంపతుల దాతృత్వం మరువలేనిది
- ఎంపి మిథున్ రెడ్డి
- విద్యా ఫౌండేషన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళతాం : గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ



### జీవన వృద్ధాశ్రమం సిఆర్ ఫౌండేషన్‌కు అంకితం

**కడప :** సమాజ సేవకే తమ జీవితాన్ని అంకితమిస్తూ తాము సమాజానికి చేయగలిగినంత చేయాలనే పట్టుదలతో అహర్నిశలు కృషి చేస్తూ జీవని వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి దానిని చంద్రా రాజేశ్వరరావు ఫౌండేషన్‌కు అంకితం చేసిన మాచిరెడ్డి దంపతుల దాతృత్వం ఎనలేనిదని అలాంటి వారి పేరు మరణం తరువాత కూడా సమాజంలో పూర్తిగా నిలబడుతుందని రాజంపేట పార్లమెంటరీ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కొనియాడారు. సిఆర్ ఫౌండేషన్ కోసం తన ఎంపి నిధుల నుండి రూ.10లక్షలు కేటాయిస్తున్నానని ఇదే కాకుండా భవిష్యత్‌లో కూడా ఆశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆయన వివరించారు. ఆదివారం సిద్ధవటం మండలం నేకనాపురం గ్రామం వద్ద రెండేళ్ల క్రితం మాచిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న జీవని వృద్ధాశ్రమాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు బదలాయిస్తూ కార్యక్రమాన్ని సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధ్‌రెడ్డి, ఫౌండేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ, మాచిరెడ్డి దంపతులు తమ జీవితాన్ని పేద ప్రజలకే అంకితం చేసినట్లు భావిస్తున్నానని వారి ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌తో పాటు వారి సంపాదనను కూడా మూడు ఎకరాలలో కోట్ల రూపాయలు వెచ్చించి ఈ ఆశ్రమాన్ని నిర్మించి సీఆర్ ఫౌండేషన్ ద్వారా నడపడానికి ముందడుగు వేయడం ఆ దంపతుల ఆదర్శ భావాలకు నిదర్శనమన్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధ్‌రెడ్డి మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ రాష్ట్ర విభజన తరువాత ఏపీలో మొట్టమొదటి విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడిపే ఆశ్రమం తన నియోజకవర్గమైన రాజంపేటలో ఉండడం ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు. మాచిరెడ్డి దంపతుల ధాతృత్వం వారి విశ్వసనీయత, నిజాయితీ సమాజం పట్ల వారికి ఉండే అంకితభావం వందేళ్లయినా మరువలేనిదన్నారు. భవిష్యత్‌లో ఫౌండేషన్‌కు కావాల్సిన ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకైనా తరువాయి 8లో

## బడుల బాగుకు సోషల్ ఆడిట్




- కేంద్ర నిధుల వినియోగంపై ఆరా
- జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందాలు
- ఇప్పటికే మూడు మండలాల్లో పూర్తి
- త్వరలో అకాడమీకి బృందాల ఏర్పాటు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

బడులను బాగుచేసేందుకు కేంద్ర బృందాలు జిల్లా వ్యాప్తంగా సోషల్ ఆడిట్ మొదలు పెట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఇక్కడి విద్యకు 60 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాని వెచ్చిస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం ఇస్తున్న 60 శాతం వాట తెలంగాణ రాష్ట్రంలో సద్వినియోగం అవుతుందా లేదా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం సోషల్ ఆడిట్ నిర్వహిస్తోంది. ఇందు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర రాజధాని నుండి మూడు బృంధాలు సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నాయి.

**నిధుల వినియోగంపై పూర్తి ఆరా :** కేంద్రం వెచ్చిస్తున్న 60 శాతం వాటా నిధుల వినియోగంపై పూర్తి ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా పిల్లల తల్లిదండ్రులు, హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో విడివిడిగా సమావేశం నిర్వహించి వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా బడి పరిస్థితులు, చదువులు, ఉపాధ్యాయుల పని తీరుపై తల్లిదండ్రులను ఆడుగుతుండగా, టీటర్లను మాత్రం పాఠశాల పరిస్థితులు, ప్రధానోపాధ్యాయుని కలుపుగోలు తనం, బడిని సమన్వయం పరచడం వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. మరో ప్రక్క ప్రధానోపాధ్యాయున్ని సైతం పలు అంశాలు అడిగి తరువాయి 8లో

దోపిడీకి కారణం

## బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్సే

- రామమందిరం పేరుతో రూ.20 కోట్ల దోపిడీ
- రాజకీయ లబ్ధి కోసం మతాన్ని వాడుకుంటున్నారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే



**చిక్కబల్లాపూర్ :** అయోధ్యలోని రామమందిరం పేరుతో జరిగిన సుమారు రూ. 20,000 కోట్ల దోపిడీకి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్), నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను ఉపయోగించి అధికారాన్ని నిలబెట్టుకునే క్రమంలో, తరువాయి 12లో

## పుష్కరాల నాటికి ఆలయాలకు ప్రత్యేక శోభ

ముఖ్యమంత్రి ముందుచూపుతో పుష్కర పనులు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల

గోదావరి పుష్కరాలకు ముందే గోదావరి తీరంలోని ఆలయాలకు కొత్త శోభ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు చేయడానికి బడ్జెట్ లో నిధులు కేటాయించారని పేర్కొన్నారు.గోదావరి తీరం వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు మంత్రి తరువాయి 12లో

గ్రంథ సమీక్ష

# ఎగసిన ఉద్యమ తరంగం

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) 90 ఏళ్ల ఉజ్వల చరిత్రలో ఎన్నో మైలురాళ్లు, ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు, ఎన్నో విజయాలు. జాతీయోద్యమ కాలంలో బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో ఏకైక విద్యార్థి సంస్థగా ఏర్పడిన ఎఐఎస్ఎఫ్, స్వాతంత్ర్యం అనంతరకాలంలో వేర్వేరు రాజకీయ పార్టీల వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా చీలిపోయింది. ఆయా పార్టీలు తమ సొంత సంఘాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఎఐఎస్ఎఫ్ బ్రాండ్ నేమ్ కమ్యూనిస్టులకు దక్కింది. సిపిఐలో 1964లో చీలిక తదుపరి కూడా ఎఐఎస్ఎఫ్ సిపిఐ మార్గదర్శకంలో నడిచే ప్రజాసంఘంగా కొనసాగుతున్నది. సిపిఐ (ఎం) ఎస్ఎఫ్ఐ ఏర్పాటు చేసుకుంది. అనంతరకాలం లో నక్సలైట్ గ్రూపులు పిడిఎస్‌యు, ఆర్ఎస్‌యు, డిఎస్ఒ పేర్లతో విద్యార్థులను ఆర్గనైజ్ చేశాయి. కాంగ్రెస్‌కు ఉండనే ఉంది ఎన్ఎస్‌యుఐ. బిజెపి వారు ఎబివిపి ఏర్పరుచుకున్నారు. సోషలిస్టు పార్టీలకు విద్యార్థి సంఘాలున్నా అవి ఆ పార్టీలతోపాటు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇన్ని విద్యార్థి సంఘాల మధ్య కాలేజీలు, యూనివర్శిటీల్లో ఆధిక్యతకోసం పోటీ ఉండేది. విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు కోసం ఉద్యమాలు సాగిస్తూ విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో గెలిచి ఆధిక్యత నెలకొల్పుకునేందుకు ముమ్మరంగా పోటీ ఉండేది. అవే ఒక రకంగా విద్యార్థి సంఘాలకు ప్రాణం పోశాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1983 తదుపరి ఎన్‌టిఆర్ ప్రభుత్వం విద్యార్థి యూనియన్ ఎన్నికలు రద్దుచేసింది. 1991లో నూతన ఆర్థిక విధానాలతో విద్యార్థుల్లో చదువుల్లో పోటీతత్వం పెరిగి ఉద్యమాల ఆలోచనకు దూరమైనారు. కాని 50ఏళ్ల క్రితం పరిస్థితులు వేరు.

సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఎఐఎస్ఎఫ్ ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక దశాబ్దకాలం (1971–81) జిల్లా, రాష్ట్రస్థాయిలో నాయకత్వం వహించిన డైనమిక్ లీడర్ పాళ్యం (పి) శ్రీనివాసులు నాయుడు. అనంతపురం జిల్లా గుంతకల్‌లో విద్యార్థి ధిక్కారంలో ఓనమాలు దిద్దుకున్న కార్యశూరుడు. "ఎఐఎస్ఎఫ్‌కు ఎడారిలాంటి అనంతపురం విద్యాలయాల్లో ఒయాసిస్సులనబడే శాఖలు నిర్మించాం. అవి ఇప్పటికీ చల్లగా, పచ్చగా వర్థిల్లుతున్నాయి. ఒక్కోరాయిని మలిచి, దాన్ని పొందికగాపెట్టి కట్టడానికి పడిన ఆనాటి కష్టాలను మరిచిపోరాదు. అలా చేతికి అందిన విజయఫలాల యొక్క మాధుర్యాన్ని అనంతపురం జిల్లా ఉద్యమం ఇప్పటికీ మధురంగా ఆస్వాదిస్తున్నది" అని ఉద్యమనేతగా తొలిదినాలను నాయుడు స్మరించుకున్నాడు.

**ఎఐఎస్ఎఫ్**
**దశాబ్దకాల అనుభవాలు (1971–1981)**
**పి.శ్రీనివాసులు నాయుడు**







1975 జూన్‌లో ప్రధాని ఇందిరాగాంధి దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ విధించారు. మితవాద, మతవాద శక్తులనుంచి దేశానికి ప్రమాదాన్ని ఎదుర్కొనే పేరుతో సిపిఐ దాన్ని సమర్థించింది. మిగతా ప్రతిపక్ష పార్టీల నాయకులు జైళ్లలో పెట్టబడ్డారు. సిపిఐ నాయకులు మాత్రం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని సమర్థిస్తూ, ఆమె 20 అంశాల కార్యక్రమం అమలుకోసం పాదయాత్రలు చేబట్టారు. ఈ పంథా సిపిఐని ఏకాకిని చేసింది. ప్రజాస్వామిక శక్తులు చులకనభావంతో చూశాయి. పర్యవసానంగా ప్రజాసంఘాల కూ అది గడ్డుకాలం. ఈ నేపథ్యంలో 1976వ సంవత్సరంలో గుంటూరులో ఎఐఎస్ఎఫ్ 32వ రాష్ట్ర మహాసభ జరిగింది. వి.రామనరసింహారావును ప్రధాన కార్యదర్శిగా, శ్రీనివాసులు నాయుడును అధ్యక్షునిగా మహాసభ ఎన్నుకుంది. హైదరాబాద్‌లో ఏ వీధి ఎటు చేర్చుతుందో, ఏ విద్యాలయం ఎక్కడ ఉందో, అక్క డ పరిస్థితులేమిటో తెలియని అయోమయావస్థలో నగరంలో అడుగుపెట్టాడు ఈ నవ విద్యార్థి నాయకుడు. ఎమర్జెన్సీని బలపర్చినందుకు విద్యాలయాల్లో ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలపై ఇతర విద్యార్థి సంఘాల నాయకుల అవహేళనలు, అవమానాలు ఎన్నో. అప్పట్లో "హిమాయత్‌నగర్‌లో ఉన్న ఎఐఎస్ఎఫ్ ఆఫీసులో ఒంటరిగా కాలక్షేపం చేసిన, దిగులునిండిన రోజులు నాకు గుర్తున్నాయి" అన్నారు. అయితే దిగాలుపడలేదు. కొంతకాలం ఓపిగ్గా అవకాశం కోసం ఎదురు చూశారు. అత్యంత న్యాయమైన, సమంజసమైన సాంఘి క సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలపై పోరాటానికి ఎఐఎస్ఎఫ్ పావులు కదిపింది. అక్కడి నుండి ఐక్య ఉద్య మ నిర్మాణానికి చేసిన కృషి, అనంతరం చలో అసెంబ్లీ సాగిన ఉద్వి గ్న ప్రయాణాన్ని కళ్లకు కడుతుందీ పుస్తకం. ఆయనకాలం ఉద్యమ సమకాలీకులు పలువురు రాసిన సందేశ పూర్వక జ్ఞాపకాలు ఆనాటి జిల్లాల్లోని ఉద్యమాలను గుర్తు చేస్తాయి. ఆ రకంగా ఈ పుస్తకం చదువదగింది, ఈ తరం ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలకు 50 ఏళ్లనాటి ఉద్యమ స్మృతులు స్ఫూర్తిదాయకం కూడా.

10 సంవత్సరాలు ఎఐఎస్ఎఫ్, 10సంవత్సరాలు ఎఐవైఎఫ్ రాష్ట్ర బాధ్యతలు, ఆ తదుపరి మరో 10 సంవత్సరాలపాటు రంగారెడ్డి జిల్లా సిపిఐ ఆర్గనైజర్‌గా శ్రీనివాసులునాయుడు చేసిన కృషి అతనికి మిలిటెంట్ నాయకునిగా గుర్తింపుతెచ్చిపెట్టాయి. కారణాలేవైనా, ఎర్రజండా నీడన వెలుగొందాల్సిన నాయకుడు పార్టీకి దూరమై – ఈ తరం కమ్యూనిస్టులు ఎవరీ నాయుడు? అని ప్రశ్నించుకునే స్థితి కల్పించారు. అయితే ఆయన రచించిన పుస్తకం ఆవిష్కరణ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరగటం, పార్టీ జాతీయ నాయకుడు బినయ్ విశ్వం సహా ఎఐఎస్ఎఫ్ ఉద్యమ సహచరులు పలువురు పాల్గొనటం గతాన్ని గుర్తు చేస్తుంది. రంగారెడ్డిజిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి తాను చేసిన కృషిపై కూడా ఒక పుస్తకం రాయాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజలే చరిత్ర నిర్మాతలని మార్క్సిజం చెబుతుంది. అయితే నాయకుల పాత్రను అది విస్మరించలేదు.

**మక్కెన సుబ్బారావు**
**ఎడిటర్, ప్రజాపక్షం దినపత్రిక**
**హైదరాబాద్**

## చదవాల్సిన పుస్తకం

### వ్యంగ్యానికి చిరునామా 'హాస్యవల్లరి'

సాహిత్యంలో హాస్యం నవ్వులు పండిస్తుంది. అదే సమయంలోల ఒక గంభీరమైన సృజనాత్మక సాధనంగా ఉపయోగపడుతుంది. అందుకే, భమిడిపాటి కామేశ్వరరావు, పానుగంటి లక్ష్మీ నరసింహం వంటివారు ఎన్నో సామాజిక అంశాలకు హాస్య రసాన్ని అద్ది అందించారు. హాస్యం మనిషి జీవితంలోని విభిన్న కోణాలను సులభంగా అర్థం చేసుకునేలా చేస్తుంది. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే కష్టాలు, ఒత్తిడులు, విరుద్ధ పరిస్థితు వంటివన్నీ సాహిత్యం హాస్యంతో పరిచయం చేస్తే అవి మరింత స్పష్టంగా, అనుభూతికి దగ్గరగా కనిపిస్తాయి. హాస్యం ఒక శక్తివంతమైన భావ ప్రకటన సాధనం. గంభీర విషయాలను కూడా హాస్యంతో చెప్పగలిగితే పాఠకుడు వాటిని స్వీకరించే విధానం మారుతుంది. ఒక రచయిత నేరుగా విమర్శ చేస్తే పాఠకుడు ప్రతిఘటించవచ్చు. కానీ అదే విషయాన్ని హాస్యంతో చెప్పినప్పుడు, పాఠకుడు ఆలోచిస్తాడు, నవ్వుతాడు, ఆ నవ్వులోనే సందేశాన్ని గ్రహిస్తాడు. ఈ విధంగా హాస్యం ఒక సామాజిక విమర్శ సాధనంగా పనిచేస్తుంది. హాస్యం మనిషి మానసిక ఆరోగ్యానికి సంబంధించినది. సాహిత్యంలో హాస్యం ఉన్నప్పుడు పాఠకుడు ఒక రకమైన ఉపశమనం పొందుతాడు. జీవితంలోని ఒత్తిడిని కొంతసేపు మరచిపోతాడు. ఈ సందర్భంలో హాస్యం ఒక చికిత్స లాంటిది. నవ్వు మనసును తేలిక చేస్తుంది. అందువల్ల హాస్యభరిత సాహిత్యం




పాఠకుడి మనసుకు శాంతిని ఇస్తుంది. అంతేకాదు, హాస్యం మనుషుల మధ్య సంబంధాలను బలపరుస్తుంది. ఒకే హాస్యాన్ని పంచుకోవడం ద్వారా వ్యక్తుల మధ్య అనుబంధం పెరుగుతుంది. సాహిత్యంలో ఒక పాత్ర హాస్యంతో మాట్లాడితే, ఆ పాత్ర పాఠకుడికి దగ్గరవుతుంది. అతను ఆ పాత్రతో అనుసంధానాన్ని ఏర్పరుచుకుంటాడు. ఈ విధంగా హాస్యం పాత్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతమాత్రం చేత, హాసాన్ని అనేది ఎప్పుడూ తేలికపాటి విషయంగా భావించకూడదు. గురజాడ 'కన్యాశుల్కం' లేదా భమిడిపాటి కామేశ్వరరావు 'హాస్యవల్లరి'... ఇలాంటి రచనలు చాలా లోతైన అర్థాన్ని కలిగి ఉంటుంది. వ్యంగ్యం, పరం, చమత్కారం అన్నీ హాస్యంలోని విభిన్న రూపాలు. వ్యంగ్యం ద్వారా రచయిత సమాజంలోని లోపాలను బయటపెడతాడు.'హాస్యవల్లరి' మొదటి భాగంలో చిన్నచిన్న చమక్కులు ఉన్నాయి. ఇవి ఒకవైపు హాస్యాన్ని పండిస్తూనే, మరోవైపు దానిని అనుభవించే సమయంలో కలిగే ఆలోచనలకు పదునుపెడతాయి. ఇక రెండో భాగం 'గుసగుస పెళ్లి'లో ఆరు కథలు ఉన్నాయి. అన్నీ హాస్య గుళికలే. ఈ కథల ద్వారా రచయిత మనిషి స్వభావంలోని విచిత్రతలను చూపిస్తాడు. చమత్కారం ద్వారా భాషకు సొగసును ఇస్తాడు. ఒక రచయిత హాస్యాన్ని సృష్టించాలంటే, అతనికి లోతైన పరిశీలన అవసరం. సాధారణ విషయాల్లో అసాధారణాన్ని గుర్తించే సామర్థ్యం అవసరం. భమిడిపాటి కామేవ్వరరావులో ఈ గుణం ఉంది కాబట్టే, ఆయన ప్రతి రచనా పాఠకులను ఆనంద డోలికల్లో ముంచెత్తుతుంది. అదే సమయంలో ఆలోచింపచేస్తుంది. ఈ పుస్తకంలోని కాలక్షేప హాస్యవల్లరులు, కథానికలు ఆసక్తికరంగా సాగుతాయి. మన చుట్టూ ఉంటే పాత్రలే కనిపిస్తుంటాయి. అందుకే, పాఠకుడు ఈ పుస్తకంలోని ప్రతి కథలోనూ తనను తాను చూసుకుంటాడు. నవ్వుకుంటాడు. మార్పుకు సిద్ధమవుతాడు. భమిడిపాటి కామేశ్వరరావు కలంలో హాస్యం ఒక భావ ప్రకటనా విధానంగానేగాక, విమర్శ సాధనంగానూ, మానసిక ఉపశమన మంత్రంగానూ జాలువారింది. అందుకే 'హాస్యవల్లరి' చదవాల్సిన పుస్తకం జాబితాలో చేరుతుంది.

**పుస్తకం పేరు**

**హాస్యవల్లరి**

రచయిత : భమిడిపాటి కామేశ్వరరావు
వెల: రూ. 160/

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ప్రపంచ సాహిత్యంపై 'యువాన్' ముద్ర

ప్రపంచ సాహిత్య చరిత్రలో యువాన్ రాజవంశం (13–14వ శతాబ్దాలు) నుండి ప్రారంభ ఆధునిక కాలం (15–18వ శతాబ్దాలు) వరకు ఉన్న దశ ఒక కీలక మార్పుల కాలంగా నిలుస్తుంది. ఈ కాలంలో ఆసియా, ఆగ్నేయాసియా, మెసోఅమెరికా, యూరప్‌లలో సాహిత్యం కొత్త రూపాలు, భాషలు, ప్రేక్షకులను పొందింది. యువాన్ రాజవంశ సాహిత్యం (చైనా)లో నాటకం ప్రధాన సాహిత్య రూపంగా ఎదిగింది. ముఖ్యంగా వైవిధ్య నాటకాలు (జాజు) విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. ఖాన్‌బాలిక్ (నేటి బీజింగ్) ఈ నాటకాలకు సాంస్కృతిక కేంద్రంగా నిలిచింది. 14వ శతాబ్దంలో రచయితలు హాంగ్‌జౌకు మారినప్పటికీ జాజు నాటకాల ప్రాముఖ్యత క్రమంగా తగ్గింది. అదే సమయంలో నాన్సీ అనే కొత్త నాటక శైలి అభివృద్ధి చెందింది. ఇది యువాన్ కాలపు రాజకీయ జీవితం, పౌరసేవ, అవిశ్వాసం, అంతర్వంశ పోరాటాలను ప్రతిబింబించింది. గావో మింగ్ రచించిన 'టేల్ ఆఫ్ ది పిపా' ప్రముఖ నాన్స్కీ నాటకంగా గుర్తింపు పొందింది. ఈ కాలంలోనే 'క్యూ' అనే కవితా రూపం స్వతంత్రంగా, అలాగే నాటకాలలో భాగంగా వినియోగంలో ఉండేది. చైనీస్ సాహిత్య చరిత్రలో కీలకమైన రెండు నవలల్లో ఒకటి 'రొమాన్స్ ఆఫ్ ది త్రీ కింగ్‌డమ్స్' కాగా, రెండవది 'వాటర్ మార్జిన్'. ఈ రెండూ మొదట యువాన్ కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. కవిత్వం శాస్త్రీయ వర్గాల్లో ప్రధాన వ్యక్తీకరణగా కొనసాగినా, సాంగ్ కాలపు మేధోశైలికి బదులుగా బలమైన భావోద్వేగాలను వ్యక్తం చేసే ధోరణి ప్రాబల్యం పొందింది.



## తెలంగాణ సంస్కృతికి సజీవ దర్పణం 'యాది'

తెలంగాణ సాహిత్య లోకంలో సంస్కృతీ సంప్రదాయాలకు, భాషా సౌరభాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన మహోన్నత గ్రంథం సామల సదాశివ రాసిన 'యాది'. 'యాది' అంటే తెలంగాణ మాండలికంలో 'జ్ఞాపకం' అని అర్థం. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషా కోవిదుడైన సామల సదాశివ గారు తన జీవితకాలంలో చూసిన మనుషులను, అనుభవించిన క్షణాలను, విన్న సంగీతాన్ని, చవిచూసిన ఉర్దూతెలుగు భాషల అనుబంధాన్ని అత్యంత ఆర్ద్రతతో అక్షరబద్ధం చేసిన అపురూప జ్ఞాపకాల సంపుటి ఇది. సాహిత్యం అంటే కేవలం ఊహల్లో విహరించడం కాదు, గడిచిన కాలాన్ని, ఆ కాలపు మనుషుల ఉదాత్తతను భవిష్యత్ తరాలకు అందించడం అని నిరూపించిన గ్రంథం 'యాది'. ఈ వ్యాస సంకలనంలో సదాశివ గారు కేవలం తన వ్యక్తిగత జ్ఞాపకాలను మాత్రమే రాయలేదు. నిజాం పాలన కాలం నాటి సామాజిక వాతావరణాన్ని, తెలంగాణ మట్టి వాసనలను, హిందూముస్లింల సామరస్యపూర్వక జీవనాన్ని, నాటి ఉర్దూ కవుల (షాయిర్ల) గొప్పతనాన్ని కళ్లకు కట్టారు. తెలంగాణ అస్తిత్వాన్ని, భాషా వైభవాన్ని తెలుసుకోవడానికి 'యాది' ఒక తిరుగులేని చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుంది.

సామల సదాశివ గారికి తెలుగుతో పాటు ఉర్దూ, పారశీక, అరబిక్, మరాఠీ, హిందీ భాషల్లో అపారమైన ప్రవేశం ఉంది. 'యాది' గ్రంథంలో ఆయన ఉర్దూ భాషా సౌందర్యాన్ని, తెలుగు భాషా మాధుర్యాన్ని ఒకదానితో ఒకటి ముడిపెడుతూ సాగిన తీరు అద్భుతం. నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ అధికార భాషగా ఉన్నప్పటికీ, లౌకిక సంస్కృతి ఎలా వర్ధిల్లిందో ఆయన వివరించారు. ఉర్దూ కవులైన గాలిబ్, ఇక్బాల్, దాగ్ వంటి వారి కవిత్వాన్ని, వారి జీవితాల్లోని ఉదాత్తమైన ఘట్టాలను తెలుగు పాఠకులకు ఎంతో ఆత్మీయంగా పరిచయం చేశారు. సదాశివ గారి రచన శైలి ఒక ఆత్మీయ సంభాషణలా సాగుతుంది. క్లిష్టమైన గ్రాంథిక భాష జోలికి పోకుండా, పక్కన కూర్చొని తాతయ్య కథలు చెప్తున్నట్లుగా సరళమైన తెలంగాణ ఉర్దూ మిశ్రిత తెలుగులో 'యాది' సాగుతుంది. తెలంగాణ నుడికారం, సామెతలు, జాతీయాలను ఆయన ఎంతో సహజంగా వాడారు. పరభాషా పదాలను కూడా తెలుగీకరించి,భాషా భేదాలు లేకుండా అక్షర రూపం ఇచ్చారు. ఈ గ్రంథం చదువుతుంటే నాటి ఆదిలాబాద్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల భాషా జీవనం కళ్లముందు కదలాడుతుంది. 'యాది' లో సదాశివ గారు కేవలం పెద్ద పెద్ద ప్రముఖుల గురించే కాకుండా, సమాజంలో గుర్తింపుకు నోచుకోని ఎందరో ప్రతిభావంతులైన కళాకారులను, కవులను లోకానికి పరిచయం చేశారు. హిందుస్తానీ సంగీతంతో తనకున్న అనుబంధాన్ని, నాటి గజల్ గాయకుల ప్రతిభను ఆయన అద్భుతంగా వర్ణించారు. తన జీవితాన్ని ప్రభావితం చేసిన గురువులను, స్నేహితులను, అనామక కవులను కూడా ఈ గ్రంథంలో ఎంతో గౌరవంతో స్మరించుకున్నారు. వారిలోని మానవత్వాన్ని, కళా హృదయాన్ని ఆవిష్కరించడం ద్వారా నాటి సమాజపు విలువలను మనకు గుర్తుచేశారు.


రాజకీయ లబ్ధి కోసం మనుషుల మధ్య గోడలు కడుతున్న నేటి సమాజానికి 'యాది' ఒక గొప్ప మార్గదర్శి. నిజాం కాలంలో హిందువులు, ముస్లింలు ఒకరి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ, కలిసిమెలిసి జీవించిన లౌకిక వాతావరణాన్ని సదాశివ గారు ఎంతో ప్రామాణికంగా నమోదు చేశారు. మతం ఏదైనా మానవత్వం, కళలే పరమావధిగా బతికిన నాటి మనుషుల నిష్కల్మష హృదయాలను ఆయన ఆవిష్కరించారు. ఈ గ్రంథంలో సదాశివ గారు చిత్రించిన వ్యక్తులు కేవలం చారిత్రక పాత్రలు కారు, వారు మానవీయ విలువలకు నిలువెత్తు రూపాలు. సమాజంలో పెద్దగా పేరు ప్రఖ్యాతులు లేకపోయినా, తమ నిష్కల్మషమైన ప్రేమతో, ఇతరులకు సహాయం చేసే గుణంతో నలుగురి హృదయాల్లో నిలిచిపోయిన ఎందరో సామాన్యుల జీవితాలను ఆయన 'యాది' చేసుకున్నారు. కులమతాలకు అతీతంగా నాటి గ్రామీణ, పట్టణ జీవితాల్లో మనుషుల మధ్య వికసించిన ఆత్మీయ బంధాలను, కష్టసుఖాల్లో తోడుండే తత్వాన్ని ఆయన ఎంతో ఆర్ద్రతతో నిరూపించారు. యాంత్రికంగా మారిపోతున్న నేటి తరానికి ఆనాటి మనుషుల అంతరంగ సంస్కారం ఎంత గొప్పదో ఈ పాత్రల ద్వారా మనకు అర్థమవుతుంది.

సామల సదాశివ గారి 'యాది' కేవలం గత కాలపు జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు; అది ఒక సంస్కృతికి, ఒక భాషా వికాసానికి దర్పణం. మారుతున్న కాలంలో మనం కోల్పోతున్న ఆత్మీయతలను, మానవీయ విలువలను ఈ గ్రంథం మనకు తిరిగి గుర్తుచేస్తుంది (యాది చేస్తుంది). తెలంగాణ సాహిత్య చరిత్రలో సదాశివ గారు అందించిన ఈ 'యాది' నిలిచేంతవరకు, నాటి కాలపు మనుషుల ఉదాత్తత, ఉర్దూతెలుగుల సమ్మేళన సంస్కృతి పాఠకుల హృదయాల్లో సజీవంగానే ఉంటాయి.

**సుధాకర్. ఎవి**
**స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు**
**9000674747**


## సాహిత్యాన్ని ప్రభావితం చేసిన 'పునరుజ్జీవ ఉద్యమం'

సాహిత్యంలో ప్రారంభ ఆధునిక యుగంగా 15 నుంచి 18వ శతాబ్దాలను పేర్కోవచ్చు. ఈ కాలంలో యూరప్‌లో పునరుజ్జీవ ఉద్యమం సాహిత్యాన్ని లోతుగా ప్రభావితం చేసింది. ప్రాచీన గ్రీకు–రోమన్ రచనలపై ఆసక్తి పెరిగి, ముద్రణ యంత్రం ఆవిష్కరణతో పుస్తకాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా అక్షరాస్యత, సాహిత్య విమర్శ అభివృద్ధి చెందాయి. ఈ యుగంలోనే నవల ఆధునిక రూపాన్ని సంతరించుకుంది. పెట్రార్చ్ సొనెట్‌ను ప్రాచుర్యం పొందించగా, బోకాసియో (డెకామెరాన్), రాబెలైస్ (వ్యంగ్యం), మోంటైగ్నే (వ్యాసం) వంటి రచయితలు కొత్త సాహిత్య రూపాలను ఆవిష్కరించారు. కోపర్నికస్ రచన శాస్త్రంతో పాటు మానవ ఆలోచనా విధానాన్నే మార్చింది. నాటక రంగంలో షేక్స్పియర్ అగ్రగణ్యుడిగా నిలిచినా, మోలియెర్, రేసిన్, లోప్ డి వేగా వంటి రచయితలు కూడా ఆధునిక నాటకానికి దిశానిర్దేశం చేశారు. పురాతన కాలం నుంచి ఆధునిక కాలం వరకూ, సాహిత్యం సంప్రదాయ పరిమితులను దాటి, కొత్త రూపాలు, భాషలు, భావాలను స్వీకరించింది. ఈ పరిణామాలు ఆధునిక ప్రపంచ సాహిత్యానికి బలమైన పునాదిని వేశాయి.



## ఓవైపు క్లాసికల్.. మరోవైపు ఫ్యూడల్ !

జపనీస్ సాహిత్యం ఎనిమిదవ శతాబ్దంలో చైనీస్ ప్రభావం నుంచి స్వతంత్రంగా వికసించింది. ఫుడోకి వంటి చారిత్రక, పౌరాణిక గ్రంథాలు, జానపద బల్లాడ్‌లు ఈ దశలో ముఖ్యమైనవి. వాకా, ముఖ్యంగా టాంకా కవిత్వం హీయన్ కాలంలో కులీనుల సామాజిక జీవితంలో అవసరమైన నైపుణ్యంగా మారింది. మన్'యోషు (పురాతన కవితా సంకలనం), కోకిన్ వకాషు (సామ్రాజ్య సంకలనం), టేల్స్ ఆఫ్ ఇసే వంటి రచనలు జపనీస్ సాహిత్యానికి పునాదులు వేశాయి. 11వ శతాబ్దంలో మురసాకి శికిబు రచించిన టేల్ ఆఫ్ జెంజి జపాన్ సాహిత్యంలో తొలి మహానవలుగా గుర్తింపు పొందింది. తరువాత కాలంలో నోహ్, క్యోజెన్ నాటకాలు మరియు రెంగా కవిత్వం దేవాలయాలు, రాజసభల పోషణలో వికసించాయి. ఆగ్నేయాసియా విషయానికి వస్తే, జావా ప్రాంతంలో కావి భాషలో రాసిన కాకావిన్ కవిత్వం ప్రసిద్ధి చెందింది. సంస్కృత సంప్రదాయాలపై ఆధారపడిన ఈ కథనాత్మక కవితలు మతపరమైన ఇతివృత్తాలతో సాగాయి. కాకావిన్ రామాయణం (9వ శతాబ్దం) జావానీస్ సాహిత్యంలో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది.కాగా, మెసోఅమెరికన్ సాహిత్యం ప్రధానంగా కోడెక్స్‌లలో నమోదైంది. నాహుఅట్ల్ సాహిత్యంలో క్యూకాట్ల్ (పాటలు, కవిత్వం), ట్లాటోల్లి (గద్య— చరిత్ర, ఉపన్యాసాలు) ముఖ్యమైనవి. మాయన్ సాహిత్యం మౌఖిక సంప్రదాయంతో ముడిపడి, మతం, ప్రకృతి, రూపకాలతో సమృద్ధిగా ఉండేది. పోపోల్ వుహ్ వంటి గ్రంథాలు ఈ సంప్రదాయానికి ప్రతీకలు.



## ఈ వారం కవితలు

### విత్తనాన్ని

ఆనందం పూసిన నవ్వు
ఊహల్లో గీసుకున్న చిత్రం
గుండె సవ్వడిలో లయాత్మక రాగం
నిద్రలో కలల అలలు
ఓ పులకరింతల పలకరింత

అణువు అణువులో చిగురు చిగురులో
మనసుపూలమదువులు
తడిమి చూస్తేతగిలింది నేనే
తట్టి లేపితే లేచిందినేనే ..

నవ్వుల్లో పువ్వుల్లో 'చిత్రాల్లో విచిత్రాల్లో'
రాగాల్లో అనురాగాల్లో, బంధాల్లో అనుబంధాల్లో
అన్నింటిలో నేనే.. ఎక్కడికి పోగలను
మనసు పొరల్లో విత్తనాన్ని
ఊపిరి భావాలు చెమ్మగిల్లినది ఇప్పుడేగా!

**గడ్డం సులోచన, 7702891559**

### మాకు అన్న మొద్దు సారూ..!

రోజూ మేం తింటున్న అన్నమే
వంట పట్టక చస్తున్నాం...
ఇప్పుడు పిల్లలు తింటున్న అన్నం
మమ్మల్ని తినమని ఊళ్ళోళ్ళతో
తిట్లు తినిపించకండి..

మొన్నటికి మొన్న చదువుల కమిషన్
జీతాలు ఎక్కువైనయన్నందుకే తలకాయలు
లంచ్ బాక్స్‌లో పెట్టుకుని పోతున్నాం..
మళ్ళీ ఇప్పుడు పోరల బువ్వ కూడా
తింటున్నరని చెత్త కుండీలల్ల పిల్లలు
తినలేక విసిరేసిన బువ్వలా మమ్మల్ని
ఛీత్కారానికి గురి చేయకండి..

మాకెందుకు సారు డైలీ అన్నం,
మా బకాయిలు డిఎలు పిఆర్‌సిలు ఇస్తే ..
మా బువ్వ ఏదో మేం తిని,
మా చదువేదో మేము చెప్పుకుంటాం..
మీరిచ్చే ధరలకు మధ్యాహ్నం ఒంటోళ్లు

వారానికి మూడు గుడ్లు ఎట్లా పెట్టేదని
ఒక్కో రోజు ఎగ్గొడితే, మేమే తింటున్నామని
బదనాం చేస్తున్నరు..

పిల్లలు మా ముందే అన్నం ప్లేట్లు పెట్టి ,
ఈ బువ్వ మీరైతే తింటారా?
అని అడిగినప్పుడల్లా కడుపుల దేవినట్లయి
మేము తిన్న తిండి మాకు ఒంట పట్టక
ముఖం చాటేసుకుంటున్నమ్
ఆయన ఎవరో ప్రవచన కారుడు అన్నట్టు
పొద్దున వచ్చిన దగ్గరనించి ..
టిఫిన్లు, ఫేషియల్ అటెండెన్స్‌లు,
ఎఫ్ఆర్ఎస్‌లు, బియ్యం లెక్కలు,
అటెండెన్స్‌లు, పుస్తకాలు నోట్ బుక్కులు
పంచుడు, ఆన్లైన్లోనే నింపుడు




ఇదే మాకు నిత్య కృత్యమైందని,
సర్కారు బళ్లల్లో చదువే రావట్లేదని,
నివేదికలన్నీ మమ్మల్ని వేధిస్తూనే ఉన్నాయి.
సర్ ప్లస్ ,వర్క్ అడ్జస్ట్మెంట్‌ల పేర
మా గుండెల్లో గుణపాలు దించుతూనే
ఉన్నారు..
ఇప్పుడు ఇక మీ భోజనాలు ఎందుకు సార్..
వీలైతే మరో నాలుగు రూపాయలు పెంచి,
పిల్లలకు కడుపునిండా ఓ పూటైనా
మంచి భోజనం పెట్టండి..

వండి పెట్టేటోళ్ల ఆకలి తీర్చండి..
బంగారం తూచి నట్టు , బియ్యం ,పప్పు
కూరగాయలు, జోకకుండా పిల్లల కడుపు
నిండా
మంచి భోజనం పెట్టండి..
బడిలో భోజనం తినలేక ఇంటి నుండి
డబ్బాలు తెచ్చుకునే పిల్లలు తినేలాగా
మెనూ పెంచండి..
మాకెందుకు సారు డైలీ అన్నం..

ప్రభుత్వ బడులు మూయకుండా,
మాకు అన్నం పెట్టే బదులు
బడికి ఇంత సున్నం వేయండి..
పిల్లలకు మంచి నీళ్లు పోయండి..
మమ్మల్ని టిఫిన్లు, బియ్యం మధ్యాహ్న భోజన
లెక్కల చిక్కుల నుండి విముక్తం చేయండి..
మాకు ఇచ్చే జీతానికి న్యాయం చేయనీయండి

**సహచరి, 9440970454**

### ' చిందిన రకతము'

జీవన స్వేచ్ఛకు జరిగిన పోరులో
చిందిన రక్తం ఎవ్వరిది
ఆ రకతమే ఆకాశము నిండి
ఆకలి తీర్చే చినుకై నేలను తాకినది
చింతలు బాపగా చిగురు తొడిగిన
వెలుగు రేఖలు ఎవ్వరివి
ఎండిన గొంతుల నిండుగా తడిపిన
నీటి చెలిమెలు ఎవ్వరివి

ఆ కామ్రేడ్ కాక ఇంకెవ్వరు
నిప్పుతో సోపతి చేస్తడు
నిజముతో నిచ్చెనలు ఏస్తడు
నీతి నియమముల గొడుగుల కింద
నిన్ను నన్ను నిలుపుతడు
అందదు అతని ఆంతర్యం
అది అందరి మేలు కోరే కర్తవ్యం

**గుండెల్లి ఇస్తారి, 9849983874**

# వ్యవసాయంలో ఐటి, ఎఐ, శాటిలైట్ టెక్నాలజీ

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో వ్యవసాయం రంగంలో సాంకేతిక విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఐటీ, కృత్రిమ మేధస్సు (ఎఐ), శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలు వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. రైతులకు అన్ని సేవలను డిజిటల్ వేదికపై అందించి వ్యవసాయాన్ని మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు అన్ని సేవలను డిజిటల్ వేదికపై అందించి వ్యవసాయాన్ని మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలపై ప్రస్తుతం విస్తృత స్థాయిలో ప్రయోగాలు జరుగుతున్నాయని చెప్పారు. ఉపగ్రహ చిత్రాల ద్వారా లభించే సమాచారాన్ని ప్రయోగశాలల మట్టి పరీక్షలతో సరిపోల్చి ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తున్నామని తెలిపారు. ఈ విధానం విజయవంతమైతే రైతులకు తక్కువ సమయంలోనే భూసార వివరాలు, పోషక లోపాలు, అవసరమైన ఎరువులపై శాస్త్రీయ సూచనలు అందించగలమన్నారు. ఇటీవల వ్యవసాయశాఖ కార్యదర్శి జర్మనీలో పర్యటించి అంతర్జాతీయ సంస్థలతో ఈ సాంకేతికతపై చర్చలు జరిపినట్లు మంత్రి వెల్లడించారు.పంటల పర్యవేక్షణ, భూసార నిర్వహణ, ఎరువుల పంపిణీ, వాతావరణ సమాచారం, వ్యవసాయ సలహాలు తదితర సేవలను ఒకే డిజిటల్ వేదికపై రైతులకు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**ఫెర్టిలైజర్ యాప్‌కు రైతుల విశేష స్పందన: మంత్రి తుమ్మల**

రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్‌కు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉండగా, ఇప్పటి వరకు 2.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని చెప్పారు. ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 17.70 లక్షల మంది రైతులు 59.78 లక్షల యూరియా బ్యాగులు బుక్ చేసుకోగా, 52.86 లక్షల బ్యాగులను కొనుగోలు చేశారని వెల్లడించారు. భూమి ఆధారిత యూరియా పంపిణీ విధానం వల్ల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, ఒకే వ్యక్తి పలుమార్లు కొనుగోలు చేయడం వంటి అక్రమాలకు అడ్డుకట్ట పడిందన్నారు. రైతులకు యూరియా నిల్వలు, విక్రయాలపై ప్రతిరోజూ జిల్లాల వారీగా బులెటిన్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, సమాచారం, సాంకేతిక సేవలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని మంత్రి అన్నారు.

# కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/తొర్రూరు : సిద్ధాంత అవగాహనతోనే ప్రజా ఉద్యమాలు బలోపేతం అవుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో మూడు రోజులు జరిగే సిపిఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సిద్ధాంతపరమైన అవగాహన, క్రమశిక్షణతో కూడిన రాజకీయ చైతన్యం అవసరమన్నారు. పార్టీ నాయకులు సమాజంలో మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ అంశాలపై రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సిపిఐతోనే సాధ్యమవుతుందన్నారు. పోరాట పటిమ కలిగిన పార్టీ ఎర్రజెండా పార్టీ అని అన్నారు. ప్రజా సమస్యలే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. దేశంలో కమ్యూనిస్టులు లేకపోతే సమాజం ఏవైపు వెళ్లేదో అర్థం చేసుకోవాలన్నారు. కమ్యూనిస్టుల ఉద్యమాలతోనే చట్టాలు వచ్చాయన్నారు. కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు సాగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తూ పేదల కడుపుకొడుతుందన్నారు. కార్మికులు, ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సిపిఐ ఒక్కటేనన్నారు. మార్క్సిజం అనేది కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రతిపాదించిన ఒక సామాజిక, ఆర్థిక, రాజకీయ సిద్ధాంతమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కార్మిక పోరాటాలు, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు, సామాజిక న్యాయ పోరాటాలకు మార్క్సిస్ట్ భావజాలం నుండి సిద్ధాంతపరమైన బలం చేకూరుతుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ కమ్యూనిస్టులుగా ఎదగాలన్నారు. కమ్యూనిస్టులతోనే అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుడిసెలు లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు అందించాలన్నారు. మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత అంశంపై కామ్రేడ్ మధుకర్, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారతదేశం పర్యవసానాలు అంశంపై కామ్రేడ్ బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, మతం, మతోన్మాదం, లౌకికవాదం, కేంద్రంలో అమలవుతున్న హిందుత్వ ఎజెండా అంశంపై కామ్రేడ్ ఉమా మహేశ్ బోధనలు నిర్వహించి నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల ప్రారంభానికి ముందు సిపిఐ నాయకులు పార్టీ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారధి, నల్లు సుధాకర్, రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిండ్ల సాంబలక్ష్మి, పెరుగు కుమార్, వరిపెల్లి వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, పాండురంగాచారి, నెల్లూరి నాగేశ్వరరావు, తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శులు గణపురం లక్ష్మణ్, పెరబోయిన కిరణ్, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లింల ఇళ్లు కూల్చినా మజ్లిస్ మాట్లాడలేదు

● ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో ఆలస్యం ఎందుకు ? : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందని, సామాన్య ప్రజలపై కఠినంగా వ్యవహరిస్తూనే మజ్లిస్ పార్టీకి సంబంధించిన అంశాల్లో మాత్రం మౌనం పాటిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. సామాన్య ప్రజలకు సంబంధించిన భూముల వ్యవహారాల్లో హైడ్రా వేగంగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్), బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని ప్రభుత్వ జాప్యాన్ని ప్రశ్నించినప్పటికీ, ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించడం లేదన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖలు వివరాలు కోరినప్పటికీ చర్యలు ముందుకు సాగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీని మొత్తం ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తూ వ్యవహరిస్తోందని, ఇది సరైన విధానం కాదని కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా చర్యల వల్ల పేద ముస్లింల ఇళ్లు కూడా కూల్చివేయబడ్డాయని, ఆ సమయంలో మజ్లిస్ కానీ, కాంగ్రెస్ కానీ వారి తరఫున మాట్లాడలేదన్నారు. అయితే ఒవైసీ కుటుంబానికి సంబంధించిన ఆస్తుల విషయంలో మాత్రం రెండు పార్టీలు ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్‌కు నిజమైన చిత్తశుద్ధి లేదని, తమ రాజకీయ మిత్రుడైన మజ్లిస్‌కు ఇబ్బందులు కలగకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలను, మజ్లిస్ ద్వంద్వ వైఖరిని బయటపెట్టిందన్నారు. ప్రజల భూములు, చెరువులు, ప్రభుత్వ ఆస్తులు తెలంగాణ ప్రజల సొత్తేనని, రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తుల వ్యక్తిగత ఆస్తులు కాదన్నారు. ప్రభుత్వం మతపరమైన, ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి చెప్పి, అందరికీ ఒకే చట్టం, ఒకే న్యాయం అనే సూత్రాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా న్యాయం చేస్తున్నందున ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటుందని, ఈ పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రభుత్వానికి గట్టి సమాధానం ఇస్తారన్నారు.

# 884 రోజుల్లో బిసి సిఎం



● 59 నియోజకవర్గాల్లో బిసి ఎమ్మెల్యేలను చేస్తా

● 'రాజ్యాధికార సమరభేరి'లో తీన్మార్ మల్లన్న

ప్రజాపక్షం/భువనగిరి : 884 రోజుల 5 గంటల 2నిమిషాల 30 సెకన్లలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఒక బిసి బిడ్డ ఉంటాడని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాజ్యాధికార సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 59 నియోజకవర్గాలలో బిసి ఎమ్మెల్యేలను చేస్తా అన్నారు. రెడ్లు, వెలమల కోసమే సర్జికల్ స్ట్రైక్ 59 అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రెడ్లు, వెలమలు కౌంట్ డౌన్ టైమర్‌ను స్టార్ట్ చేసుకొని టిక్.... టిక్ అనే సౌండ్ వింటూ ఉండాలన్నారు. 60 సంవత్సరాలుగా నల్లగొండ భువనగిరి మునుగోడు తాండూరు, కొడంగల్, గద్వాల్, పాలకుర్తి వంటి నియోజకవర్గం రెడ్ల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఓట్లు మావి అయితే సీట్లు మీరు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రెడ్లను, వెలమలను భూస్థాపితం చేయడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య లక్ష్యం అన్నారు. నల్లగొండ రెడ్లను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వనన్నారు. దొరల వద్ద ఉన్న భూములను గుంజుకొని పేదలకు పంచడానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆవిర్భవించిందన్నారు. వచ్చే ఎన్నికలలో భువనగిరి నుండి ఒక బిసి బిడ్డను ఎమ్మెల్యేగా చేస్తామని, సూర్యాపేట నియోజకవర్గం నుండి వట్టే జానయ్య యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులకు అండగా ఉంటానని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంబిటి పార్టీ స్పోక్స్ పర్సన్ అజ్మతుల్లా ఖాన్, మాజీ డిజిపి పూర్ణ చంద్రరావు, వట్టే జానయ్య యాదవ్, కొమిరిశెట్టి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అలర్ట్ జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, తెలంగాణలో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కూడా ఇదే వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. జులై 6 నుంచి 7 వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముండగా, అన్ని జిల్లాల్లో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. మంగళ, బుధవారం వరకు ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని, మిగిలిన జిల్లాల్లో బలమైన గాలులు వీచే అవకాశముందని తెలిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందన్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కూడా రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, ప్రత్యేక హెచ్చరికలు ఏవీ లేవన్నారు. హైదరాబాద్‌లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. మరో రెండు రోజుల తర్వాత వర్షాల తీవ్రత మరింత తగ్గి, చాలా ప్రాంతాల్లో తాత్కాలిక విరామం లభించే అవకాశముందన్నారు. మొత్తం మీద ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు, ప్రజలు అధికారిక వాతావరణ బులెటిన్‌లను అనుసరిస్తూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు.

# బోనాలకు చేతివృత్తుల సందడి

● 16 నుంచి హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి వస్తు ప్రదర్శన

● బోనాల సామగ్రి అంతా ఒకేచోట.. కళాకారులను ఆదరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆషాఢ బోనాల మహోత్సవాలను పురస్కరించుకుని జులై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన) రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాలకు అవసరమైన అన్ని రకాల సంప్రదాయ వస్తువులను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నేత కళాకారులు, బంగారు పనివారు, రాతి శిల్పులు, బుట్టల తయారీదారులు, తోలు కళాకారులు తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. బోనాలకు అవసరమైన మట్టి కుండలు, దీపాలు, వెదురు బుట్టలు, గంపలు, జల్లెడలు, పిత్తళి, రాగి పాత్రలు, పూజా సామగ్రి, అలంకరణ వస్తువులు, గాజులు, పూసలు, పోతురాజు వినియోగించే కొరడాలు, గజ్జెలు, డప్పులు, డోలు, చెక్క పూజా పీటలు తదితర వస్తువులు మేళాలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. బోనాల పండుగతో వేలాది మంది సంప్రదాయ చేతివృత్తిదారులకు ఉపాధి లభిస్తుందని, ఈమేళా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. గత ఏడాదికంటే ఈసారి మరింత ఎక్కువ మంది కళాకారులకు అవకాశం కల్పిస్తూ అధిక సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా ద్వారా చేతివృత్తుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, కళాకారుల ఆదాయాన్ని పెంచడం, యువతను సంప్రదాయ వృత్తుల వైపు ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు. బోనాల సందర్భంగా నగరానికి వచ్చే భక్తులు మేళాను సందర్శించి చేతివృత్తుల ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారుల కుటుంబాలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. 'మనం కొనుగోలు చేసే ప్రతి చేతి ఉత్పత్తి ఒక కళాకారుడి కుటుంబానికి భరోసా, ఒక సంప్రదాయ వృత్తికి జీవం' అని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా ఈ మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కాళేశ్వరం కాస్తా.. కూలేశ్వరం అయ్యింది

● కన్నెపల్లి టూర్ పేరుతో కెటిఆర్ సరికొత్త నాటకం : మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/భూపాలపల్లి : లక్షా ఇరవైవేల కోట్ల రూపాయలను గోదావరిలో కలిపిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు సరికొత్త కుట్రలకు తెర లేపుతోందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎనభై వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే కేసిఆర్ తానే గొప్ప ఇంజనీర్ అని ఊహించుకుంటూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టాడు. కాళేశ్వరం ప్రాజెక్టు కాస్త కూలేశ్వరమాయె అని ఎద్దేవా చేసారు. మేడిగడ్డ కుప్పకూలింది, సుందిళ్లలో సీ పేజ్ వచ్చింది. ఏమాత్రం సిగ్గులేకుండా కెటిఆర్ కన్నెపల్లికి పోయి కుట్ర రాజకీయాలు మళ్లీ మొదలు పెట్టారని మండిపడ్డారు. మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలను పూర్తిగా కుప్పకూల్చి ఆ కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి తోయడమూ కెసిఆర్ కుటుంబ ఉద్దేశమని అన్నారు. బ్యారేజీలను పూర్తిగా గోదావరి పాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని కల్వకుంట కుటుంబం కుట్రలు చేస్తుందని అన్నారు. నీళ్ల ఆపితే మేడిగడ్డ బ్యారేజీ దాని క్రింద ఉన్న బ్యారేజీలు కొట్టుకపోవాలన్నదే కెసిఆర్, కెటిఆర్ కుట్ర అని అన్నారు. కింద ఉన్న ములుగు భద్రాచలంతో పాటు మిగిలిన ప్రాంతాలు కొట్టుకుపోయి జనాల ప్రాణాలు పోవాలన్నదే వీళ్ల ఆలోచన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసి రాజకీయంగా బ్రతకాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్ 7లో పిల్లర్ నంబర్ 20 కుంగిపోయింది. అన్నారం, సుందిళ్లలో వియరింగ్ కోట్ కాంక్రీట్ బ్లాకులు తెగడంతో లీకేజ్ పైపింగ్ వంటి లోపాలున్నాయని ఎన్‌డిఎస్‌ఎ తేల్చి చెప్పిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్యారేజి నిర్మాణం నాణ్యత లోపం వల్లనే కూలిందని కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తేల్చి చెప్పిందని అన్నారు. దాని రిపేర్లు సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాజేందర్, ఇస్లావత్ దేవన్ పాల్గొన్నారు.

## మేడిగడ్డపై 'రాజకీయ డ్రామా'లు వద్దు

● మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు: మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేయడం లేదని, ప్రజల ప్రాణాలను కాపాడడమే తమ లక్ష్యమని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) స్పష్టం చేశారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయొద్దని, కన్నెపల్లి పంప్‌హౌస్ నుండి నీటిని ఎత్తిపోసే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కేంద్ర నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించినప్పటికీ బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంగా కాకుండా బిఆర్‌ఎస్ అవినీతికి ప్రతీకంగా మారిందని ఆరోపించారు. మేడిగడ్డ కుంగిపోవడం, పంపులు మునిగిపోవడం, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కెటిఆర్, కెసిఆర్‌లు నిపుణుల ఎదుట తమ వాదనను నిరూపించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిపుణుల సూచనల మేరకే ముందుకు సాగుతుందని, మేడిగడ్డ భద్రత, కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంపై నిపుణులతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రేగా కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ దూకినా రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదు

● టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో మాజీ మంత్రి కెటిఆర్ దూకినా రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, వారి పాలన వల్ల ఇప్పటికే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారే ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించే నైతిక అర్హత బిఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు ఏ ముఖం పెట్టుకుని బిఆర్‌ఎస్ నాయకులు వెళ్తున్నారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన నిర్వాకాల వల్లే తెలంగాణ రూ.8 లక్షల కోట్ల అప్పుల భారంలో కూరుకుపోయిందని ఆరోపించారు. కెటిఆర్ ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకి మరోసారి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

# కన్నెపల్లి మోటార్లు ప్రారంభించాలి

● లేకపోతే 50 వేల మంది రైతులతో వచ్చి పంప్‌హౌస్ ఆన్ చేస్తాం

● రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కెటిఆర్ సవాల్



ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం/జనగామ : కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన కన్నెపెల్లి లక్ష్మీ పంప్ హౌస్ నుండి లక్ష క్యూసెక్కుల గోదావరి వరద నీరు దిగువకు వృధాగా పోతుందని కెసిఆర్‌పై రాజకీయ కక్షతో రైతులకు అన్యాయం చేయరాదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. తెలంగాణ బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఆనాడు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ సారథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామని కెటిఆర్ అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ కెటిఆర్ నేతృత్వంలో ఆదివారం బీఆర్‌ఎస్ బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి గోదావరి జలాల ప్రవాహాన్ని పరిశీలించి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా రేవంత్ ప్రభుత్వం మాత్రం వృధాగా పోతున్న గోదావరి నీటిని ఎత్తిపోయకుండా రైతులను నట్టేట ముంచుతుందని, కన్నెపల్లి పంప్ హౌస్ పంపులను ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోసే అవకాశాలు ఉన్నా బీఆర్‌ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని కెటిఆర్ మండిపడ్డారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కన్నెపెల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని అందించవచ్చని, వర్షాలు కురువకపోయినా కెసిఆర్‌కు వారం రోజులు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పగిస్తే తెలంగాణ ప్రాంతానికి గోదావరి నీటిని అందిస్తారని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కెటిఆర్ సవాల్ విసిరారు. కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయని పక్షంలో 60 వేల మంది రైతులతో పంప్‌హౌస్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు పెద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, జీవన్ రెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జనగామ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**కెటిఆర్ పర్యటన ఉద్రిక్తం**

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కన్నెపల్లి పర్యటన ఉద్రిక్తంగా మారింది. బిఆర్‌ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో జనగామలో టెన్షన్ వాతావరణం నెలకొంది. హైదరాబాద్–హన్మకొండ జాతీయ రహదారిపై జనగామ మండలంలోని పెంబర్తి, కోమల్లా టోల్‌ప్లాజా వద్ద కెటిఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. కెటిఆర్ కాన్వాయ్‌ను మాత్ర మే అనుమతిస్తామని, మిగతా వాహనాలను అనుమతించబోమని పోలీసులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పెంబర్తి వద్ద కెటిఆర్ తన వాహనంపైకి ఎక్కి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో సుమారు గంటకు పైగా పెంబర్తి వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొంది. బిఆర్‌ఎస్ శ్రేణులు వాహనం దిగకుండా ముందుకు సాగే ప్రయత్నం చేశారు. వాహనాల్ని జాతీయ రహదారికి అడ్డుపెట్టి రోడ్డుపైనే కూర్చుంటామని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు వదిలిపెట్టారు. ఆ తరువాత రఘునాథపల్లి మండలం కోమల్లా టోల్ ప్లాజా వద్ద మరోసారి అడ్డుకున్నారు. కెటిఆర్ వాహనాన్ని మాత్రమే అనుమతిస్తామని తేల్చి చెప్పారు. లారీలను అడ్డుపెట్టి కెటిఆర్ కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో కెటిఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పోలీసులతో గొడవకు దిగారు. చివరకు డిసిపి రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పంపించారు. రెండు చోట్ల జరిగిన సంఘటనలతో హై టెన్షన్ వాతావరణం నెలకొనగా పోలీసులు సైతం భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**జనగామలో అక్రమంగా అరెస్ట్**

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు జనగామలో పలువురు నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బాల్నె సిద్దిలింగం, సర్పంచ్‌లు సతీష్, సతన్న, వార్డు కౌన్సిలర్ సువార్త, మండల పార్టీ అధ్యక్షులు యాదగిరి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ భూష పర్వతాలు, తిరుమల్‌రెడ్డి, ఉల్లెంగుల సతీష్, తిప్పారపు విజయ్‌కుమార్, మల్లిగారి రాజు తదితరులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## భూ విస్తీర్ణాన్ని బట్టి యూరియా బుకింగ్



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని రైతులు యూరియా బుకింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలు చేస్తుందని ఎడపల్లి మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమకున్న భూమి విస్తీర్ణాన్ని బట్టి యూరియాను బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. రెండు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు తమకు కావాల్సిన మొత్తం యూరియాను ఒకేసారి బుక్ చేసుకొని పొందే అవకాశం ఉందన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు రెండు విడతలలో యూరియాను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న పెద్ద రైతులు, మూడు విడతలలో బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే ఒకసారి యూరియా బుక్ చేసిన తరువాత, తదుపరి బుకింగ్ చేసుకోవడానికి ఖచ్చితంగా 20రోజుల వ్యవధి ఉండాలని ఏవో స్పష్టం చేశారు. ఈ నిబంధనలను మండలంలోని రైతులందరూ గమనించి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా నిబంధనల ప్రకారం ఎరువులను బుక్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ కోరారు.

## హరిపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** నియోజకవర్గ ఇన్‌చార్జి పొదుద్దూరి వినయ్‌కుమార్‌రెడ్డి మాజీ మండల అధ్యక్షులు ఎస్‌కె.చిన్నారెడ్డిల ఆదేశాల మేరకు మండలంలోని పల్లె(హరిపూర్) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం ఆదివారం గ్రామసర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ చేతుల మీదుగా ప్రారంభించి గృహప్రవేశదారుల దంపతులకు సర్పంచ్ కానుకగా వస్త్రాలు అందజేసి మాట్లాడారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలని లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. పేదలకు స్వంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని అందించి కుటుంబ ఆర్థిక సామాజిక అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సుఖశాంతులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుంకపక రవి, వార్డు సభ్యులు ఎల్క శాంతి, బేర చంద్రశేఖర్, లావణ్య, మధుమిత, కవిత, సుధాకర్, భూమేష్ పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో బోథ్ ప్రాంతానికి చెందిన అనిల్‌కు రూ.1.75 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆపదలో ఉండి వైద్యం కోసం నిరుపేదలు పడే ఇబ్బందులను గమనించి, వారికి తక్షణ ఆర్థిక భరోసా కల్పించడంలో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. తమకు ఆర్తిక సహాయం అందేలా కృషి చేసినందుకు లబ్ధిదారుడు కదం అనిల్ కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి, నాయకులు అనుపట్ల సంజీవ్, మురళి గౌడ్, వినోద్ పాల్గొన్నారు.

## ఎడపల్లి గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షులుగా ఆకుల నర్సగౌడ్, ఉపాధ్యక్షుడిగా కేసరి రవిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కేసరి రమణాగౌడ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో ఈ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని వారు హామీనిచ్చారు. నూతన కార్యవర్గానికి సంఘ సభ్యులు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి గ్రామ గౌడ సంఘం సభ్యులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## సంగారెడి — రేగోడ్ బస్సును ప్రారంభించిన పర్వీన్

**ప్రజాపక్షం/రేగోడు:** సంగారెడ్డి నుండి రేగోడ్ కి రేగోడ్ సర్పంచల పోరం అద్యక్షులు పర్వీన్ సుల్తాన్ చోటుమియా ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు దీనిని సద్వినియోగం చేశాసుకోవాలని అన్నారు రేగోడ్ సంగారెడ్డి రెండు ట్రిప్పులు చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయుకులు పాల్గొన్నారు ఉన్నారు.



# వనదుర్గమ్మ క్షేత్రంలో భక్తుల కిటకిట



**ప్రజాపక్షం/పాపన్నపేట:** వనదుర్గమ్మ వనంలో ఎటు చూసినా జనమే జనం.. అందరిలో భక్తి భా వం..ఆధ్యాత్మిక వాతావరణం, ప్రతి నోట వనదుర్గమ్మ నామస్మరణ దేశంలోనే రెండో వనదుర్గామా త ఆలయంగా జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆ దివారం భక్తులతో జనసంద్రమైంది. భక్తులకు వా రాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహి ంచి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీపాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు.పలువురు భక్తులు అమ్మవారికి డప్పుచప్పుల్ల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. మరికొంద రు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లి ంచుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తిం ది. చల్లంగా చూడమ్మా.. వనదుర్గమ్మ తల్లి.. అం టూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అచ్చన పల్లి శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బ్రహ్మం, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, మహేష్, నరేష్, రవి, భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

## ఆధ్యాత్మికతతోనే సమాజ పురోగతి

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/ నేరడిగొండ:** యువత చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని సమాజ పురోగతికి పాటుపడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జా దవ్ పిలుపునిచ్చారు. నేరడిగొండ మండలంలోని చిన్న బుగ్గరాం గ్రా మంలో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన జగదంబ దేవి ఆలయ మండపాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలు, నియమనిష్టలు కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. అదేవిధంగా నియెజకవర్గ అభివృద్ధిలో భాగంగా త్వరలోనే రూ. 50 కోట్లతో బుగ్గరాం లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.

## మత్స్యకార సంఘాల ఖాతాల్లోనే నిధులు జమ చేయాలి

### మాజీ వైస్ ఎంపిపి సున్నం సతీష్

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిని నవంబర్, డిసెంబర్ నెలల్లో పంపిణీ చేయడం వల్ల ఆలస్యమవుతోందని, నాణ్యమైన చేప పిల్లలు కూడా అందడం లేదని కౌడిపల్లి మండలం ముత్రాజ్‌పల్లి ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ వైస్ ఎంపీపీ సున్నం సతీష్ అన్నారు. ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేయడం కంటే, వాటి విలువకు సమానమైన నిధులను నేరుగా మత్స్యకార సహకార సంఘాల ఖాతాల్లో జమ చేస్తే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని సూచించారు. దీంతో సంఘ సభ్యులే నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి, వర్షాలు ప్రారంభమైన వెంటనే చెరువుల్లో వదిలే అవకాశం ఉంటుందని తెలిపారు. చేపల దిగుబడి పెరిగి మత్స్యకారులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా సంబంధిత మత్స్యకార సంఘాల ఖాతాల్లో నిధులు జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.గ్రామ అధ్యక్షులు సున్నం రవీందర్ సభ్యులు ముత్యాలు సత్యనారాయణ కంచన్‌పల్లి పోచయ్య, మాజీ చైర్మన్ కిష్టయ్య, మత్స్యకార సహకార సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## అప్రోచ్ రోడ్డుకు రూ.22.50 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** కామారెడ్డి, మెదక్ జిల్లాలను కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 22.50 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. దీనితో పాపన్నపేట, గోపాల్ పేట మండలాల చిరకాల కల నెరవేరిందని పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, ఏడుపాయల ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెదక్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే డా।। మైనంపల్లి రోహిత్ రావు కృషి ఫలితంగా కామారెడ్డి జిల్లా, ధర్మారెడ్డి నుండి మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం ముద్దాపూర్ వరకు, వెంకంపల్లి మీదుగా పాపన్నపేట వైపు మంజీరా నదిపై బ్రిడ్జిలతో పాటు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22.50 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. మెదక్ ఎమ్మెల్యే కృషితో పాపన్నపేట మండలానికి సుమారు ఇప్పటివరకు 100 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి అన్నారు. వెంకంపల్లి, ముద్దాపూర్ గ్రామ ప్రజలు గత 20 సంవత్సరాలుగా మేము పడుతున్న బాధను అర్థం చేసుకుని మాకు రోడ్డు సౌకర్యం తెప్పించిన మా ఎమ్మెల్యే డా।। మైనంపల్లి రోహిత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన డైనమిక్ లీడర్ రోహిత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఎల్.మల్లప్ప, సర్పంచ్ లు శ్రీధర్, సిద్ధప్ప బాలయ్య, మండల నాయకులు పంతులు భూమయ్య, బాపిరెడ్డి, గౌస్, ఫిరంగి నారా గౌడ్, కలీం, కిష్టయ్య, సంగమేశ్వర్, విఠల్, శివయ్య, బాలరాజ్, రఘు, రాజు, గణేష్ పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం


### సిఎండి వరుణ్ రెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. బోధన్ డివిజన్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌ను సందర్శించారు. జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సబ్ స్టేషన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.సీఎండీ వరుణ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి, సాధారణ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సంస్థ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సబ్ స్టేషన్ల ఆధునీకీకరణ, మౌళిక వసతుల కల్పన పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సీఎండీతో పాటు ఎస్‌ఈ రాజేశ్వర్, డీఈ ముక్తార్ అలీ, ఏడీ ప్రభాకర్, ఎఈ లు కిషోర్ రెడ్డి, నాయిని కృష్ణ, మారుతి, ఎడీఈ తోట రాజశేఖర్, కన్స్ట్రక్షన్ ఏఈ సునీత, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధు వరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు దుర్గయ్య కుమార్తె నిఖిత వివాహం ఆనంద్ తో మండలంలోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి, మండల నాయకులకు కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి, జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్లు లింగారెడ్డి, నరసింహ గౌడ్, నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, రఘు, మన్నె వెంకటేశం, దుర్గా దాస్, మధు తదితరులు ఉన్నారు.



## వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేకాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఆదివారం రెండోసారి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. వర్షాల్లేక పంటలు వేయలేని పరిస్థితుల్లో వనదేవుడి కరుణ కోసం రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, పాలక వర్గం, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు మిన్నంటాయి. ఊరుమ్మడిగా తరలివచ్చిన జనం చెరువులు జలకళ సంతరించుకోవాలని, పిల్లాపాపలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్ మాట్లాడుతూ.. వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళేశ్వరం పంఫ్‌హౌస్‌లు ఆన్ చేసి రైతుకు సాగు నీరివ్వాలి

### ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**ప్రజాపక్షం/మోర్తాడ్:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపి రైతులకు సాగునీరు ఇవ్వాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేశాయని, రైతులు ఆకాశం వైపు ఎదురుచూసే దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేక ఇప్పటికీ 30శాతానికి పైగా పంటలు వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎస్ఆర్ఎస్‌పి లో కేవలం 15టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని, ప్రస్తుతం కేవలం 1100క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తుందని ఆయన వివరించారు. ఎస్సారెస్పీ, కాకతీయ కెనాల్, వరద కాలువ, ప్యాకేజీ 21, గుత్ప అలీసాగర్ లిఫ్ట్ ఇతర ఐడిసి లిఫ్ట్‌లపైన ఆధారపడిన నిజామాబాద్, బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గ రైతులు సాగు నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మేడగడ్డ బ్యారేజీ వద్ద కేవలం రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే, ప్రాజెక్టు మొత్తం పనికి రాకుండా పోయిందనే భ్రమలు కల్పిస్తూ రెండున్నరేళ్లుగా రేవంత్ రెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టారనిఆయన మండిపడ్డారు. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ కింద ఎల్ అండ్ టీ (ఎల్ అండ్ టి) సంస్థ దాదాపు రూ. 400కోట్ల సొంత ఖర్చుతో ఉచితంగా మరమ్మతులు చేయడానికి ముందుకొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించకపోవడం వారి కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. కాళేశ్వరం ద్వారా నీళ్లిస్తే ఆ ఘనత కేసీఆర్‌కు దక్కుతుందనే ఏకైక దురుద్దేశ్యంతోనే రేవంత్ రెడ్డి నీటిని లిఫ్ట్ చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణ రైతులను ఎండబెడుతూ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును సంతోష పెట్టేందుకు పోలవరం ప్రాజెక్టుకు నీళ్లు పంపుతున్నారని విమర్శించారు. మేడగడ్డ బ్యారేజీతో ఎలాంటి సంబంధం లేకుండానే నీటిని ఎత్తిపోసే అద్భుతమైన ఇంజనీరింగ్ వ్యవస్థను కేసీఆర్ అప్పుడే సిద్ధం చేసి ఉంచారని ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.వరద కాలువల ద్వారా నీటిని రివర్స్ పంపింగ్ చేయడం వల్ల బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ మండలాల్లో ఎస్ఆర్ఎస్‌పి కాకతీయ కాలువ ద్వారా మెండోరా, ఎర్గట్ల మండలాలు, కాళేశ్వరంలో భాగమైన ప్యాకేజీ 21ద్వారా మోర్తాడ్, భీంగల్, వేల్పూర్ మండలాల్లో సుమారు 70శాతం గ్రామాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే వివరించారు.

## కెసిఆర్‌ను విమర్శించడం తప్ప.. అభివృద్ధి ఎక్కడ?

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇంకా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ను విమర్శించడం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ జరగలేదు అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లో ఉప్పు లింగాపూర్ గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రామయపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన కొత్తపల్లి గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు 420 హామీలు ఇచ్చారని, ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ ఒక్కహామీ నెరవేర్చలేదని యూరియా యాప్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కెసిఆర్ ఉన్నప్పుడు రైతుల దగ్గరికి ఎరువు బస్తాలు వచ్చేవని, రాష్ట్ర ప్రజలందరూ మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని ఆమె అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని కొత్తగా వచ్చిన సర్పంచులు అయోమయంలో ఉన్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, రామాయపల్లి సర్పంచ్ పావని మహేందర్,వెల్దుర్తి ఉప సర్పంచ్ కమ్మరి శ్రావణ్ కుమార్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

## టిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం టీఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు. మండల కన్వీనర్ బానోతు వసంతరావు ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో స్టేట్ అబ్జర్వర్, బోథ్ టీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో హనుమాన్లు, పెద్ద లస్మన్న, శివలింగు, ధర్మరాజు, లక్ష్మి నర్సయ్య, దయాకర్, మల్లేష్, చిన్న రాజన్న, అడిగం రాకేష్ తదితరులు ఉన్నారు.



## కెటిఆర్ పర్యటనకు సంఘీభావం



ప్రజాపక్షం/ముత్తారం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపు హౌస్ సందర్శన పర్యటన సందర్భంగా ముత్తారం మండల బీఆర్ ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కాటారం మండల కేంద్రంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వ ర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డితో కలిసి ముత్తారం నాయకులు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు.ఈ స్వాగతం పలికిన వారిలో సర్పంచ్,మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ,ముత్తారం సర్పంచ్ సుదాటి రవీందర్ రావు,మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,మాజీ సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య, మాజీ డైరెక్టర్ కూరాకుల ఓదెలు తదితర ముఖ్య నాయకులు ఉన్నారు. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు ముత్తారం నుంచి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

## అధికారుల హెచ్చరికలు బేఖాతరు

### ఆదర్శ పాఠశాలలో మళ్లీ భద్రతా నిర్లక్ష్యం

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో భద్రతా వ్యవస్థ మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల అధ్యాపకులు, ఎంఈఓ ఆదేశాలు ఉన్నప్పటికీ రాత్రి విధులు నిర్వహించాల్సిన నైట్ వాచ్‌మన్ రాత్రి వేళల్లో విధులకు హాజరుకాకుండా, ఉదయం వచ్చి సాయంత్రానికి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో పాఠశాల పూర్తిగా భద్రత లేకుండా ఉండిపోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విలువైన కంప్యూటర్లు, ప్యానెల్ బోర్డులు, ఇతర సామగ్రి ఉండటంతో పాటు అటవీ ప్రాంతంలో ఉండడం వల్ల విషసర్పాలు, వన్యప్రాణులు ప్రాంగణంలోకి వచ్చే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే తరహా నిర్లక్ష్యం చోటుచేసుకోవడంతో అధికారులు నైట్ వాచ్‌మన్‌కు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా పాఠశాల అధికారుల అండదండలతో మళ్లీ అదే విధంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ పరిస్థితి కొనసాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మల్లాపూర్ ఎస్ఐపై చర్యలు తీసుకోండి

ప్రజాపక్షం/మల్లాపూర్ : రత్నాపూర్ గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తున్న దళిత కులానికి చెందిన చిత్తరి నరసయ్యను, విచారణ పేరిట పోలీస్ స్టేషన్కు పిలిచి చిత్రహింసలకు గురిచేసిన మల్లాపూర్ ఎస్సై పై చర్యలు తీసుకోవాలని బాధితుడు నరసయ్య దళిత సంఘాల నాయకులతో కలిసి మెట్పల్లి డిఎస్పికి ఫిర్యాదు చేశాడు.బాధితుడు నరసయ్య తెలిపిన ప్రకారం రాఘవపేట గ్రామానికి చెందిన వ్యక్తి గొర్రెపోతు దొంగతనానికి గురైందని,తనను పోలీస్ స్టేషన్కు పిలిచి నువ్వే దొంగతనం చేశావు అంటూ బూతులతో దుర్భాషలాడుతూ నానా ఇబ్బందులు గురి చేశాడని,తనపై అకారణంగా దాడి చేసి దుర్భాషలాడిన మల్లాపూర్ ఎస్సై పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలంటూ డిఎస్పి కి ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు. కాగా బాధితుడు నరసయ్యకు దళిత సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం పట్టణంలోని 7వ, 8వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 7వ వార్డులో మురికి కాలువలను ఆక్రమించి స్లాబ్‌లు వేయడం వల్ల మురుగు నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది స్లాబ్‌ల క్రిందకు వెళ్లి మురుగును తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే ఆక్రమణలకు కారణమైన స్లాబ్‌లను తొలగిస్తామని, మురికి కాలువలు, నాలాలను ఆక్రమించిన వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే 3వ వార్డులో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండటాన్ని పరిశీలించి, నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 8వ వార్డులో జేసీబీ సహాయంతో మురికి కాలువల శుభ్రపరిచే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నునుగొండ నరేష్, బత్తుల నరేష్,నాయకులు ధర్మపురి వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, ముజీబ్,తదితరులు పాల్గొన్నారు.

## బడుగువర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : పేదప్రజల బడుగువర్గాల ఆశాజ్యోతి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కృషి చేస్తున్నారని జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు కానపురం లక్ష్మ ణ్ మాదిగ ఎల్లారెడ్డిపేటలో అన్నారు.ఆదివారం ఆయన కోరుట్లపేట గ్రామంలో కమిటి 32 ఆవిర్భవ దినోత్సవం,అదే విధంగా జూలై 7న జెండా పండుగ ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లాలోని అన్ని మండలాలతో పాటుగా గ్రామాలలో మందకృష్ణమాదిగ జన్మదిన కార్యక్రమం జరపాలని కోరారు.రాజకీయంగా కాకుండా సామాజికంగా,విద్య,ఉద్యోగపరంగా ఆర్థికంగా హక్కుల సాధనకై కృషి చేసిన ఘనత ఆయనదని అన్నారు.అందుకే ప్రతి గ్రామగ్రామాన జెండాపండుగ మంగళవారం జరపాలని ఎమ్మార్పీఎస్ పిలుపుమేరకు ఆదేశాలు ఉన్నాయని ప్రజాపక్షం జాతీయదిన పత్రికతో మాట్లాడారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాపక్షం/పెగడపల్లి: మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ 2026) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని తహసీల్దార్ సయ్యద్ నిజామొద్దీన్ ఆదేశించారు. ఇందులో భాగంగా వెంగళాయిపేట, నంచర్ల, దేవికొండ, రాములపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎలక్టోరల్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని బీఎల్వోలను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జమున, షఫీ, జిపిఓలు, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్లు, మురికి కాలువలు లేక ప్రమాదాల బాటలో జాతీయ రహదారి



### మౌలిక వసతులకు నోచని అయ్యప్ప దేవాలయం, వెంకట్రావుపేట జాతీయ రహదారి

### రెండు దశాబ్దాలు గడిచినా శివారు ప్రాంతాల అభివృద్ధి ఏది?

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మున్సిపాలిటీలో విలీనమైన వెంకట్రావుపేట, ఆరపేట గ్రామాలకు దాదాపు రెండు దశాబ్దాలు పూర్తయినా ఆశించిన స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 11వ వార్డు పరిధిలోని అయ్యప్ప దేవాలయం నుంచి వెంకట్రావుపేట వరకు ఉన్న జాతీయ రహదారి అభివృద్ధి కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. మెట్‌పల్లి పట్టణం మూడు మండలాలకు వాణిజ్య, విద్యా, వైద్య కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఈ జాతీయ రహదారి వెంట ప్రైవేటు ఆసుపత్రులు, బ్యాంకులు, విద్యాసంస్థలు, సూపర్ మార్కెట్లు, వాణిజ్య సముదాయాలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. అయితే పెరిగిన అవసరాలకు అనుగుణంగా డివైడర్లు, మురికి కాలువలు, ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లు, పార్కింగ్ వంటి మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**డివైడర్లు లేక ప్రమాదాల ముప్పు :** జాతీయ రహదారిపై రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతున్నప్పటికీ మధ్యలో డివైడర్లు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షాకాలంలో ప్రమాదాల ముప్పు మరింత అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం వస్తే రహదారే చెరువు :** రహదారికి ఇరువైపులా పక్కా మురికి కాలువలు లేకపోవడంతో స్వల్ప వర్షానికే వర్షపు నీరు, మురుగు నీరు రహదారిపై నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు రోడ్డు దెబ్బతినడం, దోమల వ్యాప్తి వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి.

**రోడ్డుపైనే పార్కింగ్... ట్రాఫిక్‌కు అడ్డంకి :** ప్రైవేటు ఆసుపత్రులు, బ్యాంకులు, ప్రైవేటు విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాల వద్ద తగిన పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో వాహనాలను జాతీయ రహదారిపైనే నిలిపివేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు అంబులెన్సులు అత్యవసర సేవల



వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోంది.

**సమగ్ర అభివృద్ధితోనే శాశ్వత పరిష్కారం:** అయ్యప్ప దేవాలయం నుంచి వెంకట్రావుపేట వరకు డివైడర్లు, పక్కా మురికి కాలువలు, ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా చేస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

**నూతన పాలకవర్గంపై ప్రజల ఆశలు :** మెట్‌పల్లి మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, అయ్యప్ప దేవాలయం–వెంకట్రావుపేట జాతీయ రహదారిని కూడా ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి సారథ్యంలో నీ నూతన పాలకవర్గం డివైడర్లు, మురికి కాలువలు, ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ వంటి మౌలిక వసతులు కల్పించి శివారు ప్రాంతాల అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావాలని కోరుతున్నారు. పట్టణ కేంద్రంతో పాటు శివారు ప్రాంతాలు కూడా సమానంగా అభివృద్ధి చెందినప్పుడే మెట్‌పల్లి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## జనగామ డివిజన్‌ను వన్‌టౌన్‌లో విలీనం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రమేశ్ కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ జనగామ తో పాటు మరికొన్ని ప్రాంతాలను గోదావరిఖని రెండో టౌన్ నుంచి వన్ టౌన్ లో విలీనం చేసేందుకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, అందుకు కృషి చేసిన రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత కొన్ని సంవత్సరాలుగా సిపిఐ పక్షాన జనగామ ను వన్ టౌన్ లో కలపాలని గత మరియు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగిందని పేర్కొన్నారు.జనగామ డివిజన్ ప్రజలకు ఈ విలీనం వల్ల పరిపాలన పరంగా, పోలీసు స్టేషన్ పరిధిలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి నందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ స్వాగతిస్తుందని ఆయన తెలిపారు.

## కార్పొరేటర్‌ల 'ఫోన్' టెండర్లను రద్దు చేయాలి

### సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : కరీంనగర్ నగర పాలక సంస్థలోని కార్పొరేటర్ల ఫోన్ కొనుగుళ్లో కోసం టెండర్లు నిర్వహించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెంటనే టెండర్లను రద్దు చేయాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. ఆదివారం సురేందర్ రెడ్డితోపాటు సిపిఐ నాయకులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు మీడియాతో మాట్లాడుతూ నగరంలో ప్రజల దగ్గర ఇంటి పన్ను, నల్ల బిల్లు, చివరికి చెత్త తీసుకుపోవడానికి కూడా ప్రజల వద్ద వందల రాపాయలు దోచుకెళ్తున్న అధికారులు, కార్పోరేటర్లు, కోఆప్షన్ సభ్యుల సెల్ ఫోన్ల కొనుగోలు కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటని అన్నారు. నగరంలో వీధి దీపాలు, డ్రైనేజీలు, వర్షం కురిస్తే నీటి నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోలేని చేతగాని దుస్థితిలో ఉన్న మున్సిపల్ అధికారులకు లక్షల రూపాయలు కార్పోరేటర్ల ఫోన్లు కొనడానికి మాత్రం ఏ విధంగా డబ్బులు వస్తున్నాయని ప్రశ్నించారు. వెంటనే మున్సిపల్ అధికారులు ప్రజాధనం వృధా చేయకుండా కార్పోరేటర్ల సెల్ ఫోన్ల కోసం కేటాయించిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ప్రజలకు ఈ అవినీతిని బటయపెడతామని హెచ్చరించారు.

## ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డా.శ్రీవాణి



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : శాతవాహన విశ్వ విద్యాలయం అర్థశాస్త్ర విభాగపు అధిపతిగా, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డా.శ్రీవాణిని తెలంగాణ రాష్ట్రం నుంచి కార్యనిర్వాహక మండలి సభ్యురాలుగా నియమించడం జరిగింది. డిసెంబర్ 2025 చెన్నైలో జరిగిన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఈఏ) 108వ వార్షిక జాతీయ సమావేశాలలో జరిగిన ఎలక్షన్స్‌లో శ్రీవాణి వ్యక్తిగత బయోడెటా, అసోసియేషన్‌లోని మిగతా సభ్యుల ప్రతిపాదన ఆధారంగా జరిగిన ఓటింగ్లో తెలంగాణ రాష్ట్రం నుంచి డా.శ్రీవాణి ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ న్యూస్ లెటర్స్‌లో తెలిపారు. డా.శ్రీవాణి కార్యనిర్వాహక మండలి సభ్యురాలుగా రాబోవు మూడు సంవత్సరాల కాలానికి అసోసియేషన్ తరపున సదస్సులు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. ఇండియన్ ఎకానమిక్ అసోసియేషన్ అనేది 1917లో స్థాపించడం జరిగింది. ఇది భారతదేశంలో అతి ప్రముఖ పురాతన అసోసియేషన్. ఈ అసోసియేషన్‌కు భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్, ఆర్బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అధ్యక్షులుగా పని చేసినారు. శ్రీవాణి నియామకం పట్ల విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విశ్వ విద్యాలయం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు శ్రీవాణి కి శుభాకాంక్షలు తెలిపారు.

## చౌడాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే మేడిపల్లి



ప్రజాపక్షం/కొడిమ్యాల : కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్ గ్రామంలో చౌడాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్న చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యంఇట్టి కార్యక్రమానికి హాజరైన ఏం.ఎల్.ఏ. మేడిపెల్లి సత్యం కి ఘన స్వాగతం పలికి శాలువ కప్పిన ముదిరాజ్, కురుమ, యాదవ, రజక సంఘం సభ్యులుఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ నేరెళ్ల మహేష్ , సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం జీవన్, మండల అధ్యక్షులు నాగభూషన్ రెడ్డి, వార్డు సభ్యులు రమణ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రాఘవ రెడ్డి , ముత్యం శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు అర్షణపెల్లి సాయి, సాగర్ రెడ్డి, నరేష్ రెడ్డి, నాంపెల్లి అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెంకుటిల్లు లేని నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమే కాంగ్రెస్ లక్ష్యం

### నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇంటిని మంజూరి చేస్తుండగా, పెంకుటిల్లు లేని నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం వర్గల్ మండలం నెంటూరులో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, మాజీ సర్పంచ్ స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ అజీజ్ ఉర్ రెహమాన్ తో కలసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయించిన సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3500 ఇండ్లు మంజూరీ చేయగా, ఖాళీ స్థలం ఉన్న ప్రతి పేదకు రూ 5 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వగా, ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి లక్ష్యంగా రూ.2 లక్షల పంట రుణమాఫీ, రైతు భరోసా, పంటల కొనుగోలు పథకం తదితర పథకాలు అమలు చేస్తుండగా, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ 500 కే వంట గ్యాస్ సిలిండర్, గృహాలకు 200 లోపు ఉచిత విద్యుత్ తదితర వాటిని అమలు చేస్తున్నట్లు వివరించారు.

## గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 6న స్పాట్ కౌన్సెలింగ్



ప్రజాపక్షం/పెద్దపల్లి : సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఈనెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పెద్దపెల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మంథని,పెద్దపల్లి (బాలురు)లో, రామగుండం, మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి (బాలికలు) కళాశాలలో మిగిలిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (బైపిసి,ఎంపీసీ,సిఇసి,హెచ్ఈసి) సీట్లకు ఆరో తేదీన (సోమవారం) స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలో ప్రతిభ ద్వారా రెండు విడతల్లో సీట్ల భర్తీ చేయడం జరిగిందని వివరించారు. మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) మంథనిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందని ఆ తర్వాత స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు. స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరయ్యే అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ( పదవ తరగతి ఉత్తీర్ణత పత్రం), కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం,నివాస ధ్రువీకరణ పత్రం, ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ పత్రాలు రెండు సెట్లు,విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్,తల్లి దండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్,విద్యార్థి నాలుగు ఫోటోలు తీసుకొని కౌన్సిలింగ్ సెంటర్ కు రాగలరని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రంగులు



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తం గా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు సరి కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నూతన రంగులు వేసే పనులను అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచేలా, పాఠశాల వాతావరణం ప్రశాంతంగా ఉండేలా ఈ రంగులను ఎంపిక చేశారు. క్లాస్ రూములు, భవనాల వెలుపల ఆకర్షణీయమైన డిజైన్లతో పెయింటింగ్స్ వేయిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల పట్ల స్థానికులు, విద్యాకమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్డు కాదు.. నరకం

### బురదమయంగా మారిన ఓడేడు - కాల్వపల్లి రోడ్డు



ప్రజాపక్షం/ముత్తారం: ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామం నుండి ఎస్సీ కాలనీ మీదుగా కాల్వపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. రహదారి పొడవునా భారీగా నీరు నిలిచిపోవడంతో ఈ దారి కుంటలను తలపిస్తూ, ప్రయాణికులకు, రైతులకు తీవ్ర నరకప్రాయంగా మారింది. రోడ్డంతా బురద కుంటలో పేరుకుపోవడంతో కనీసం కాలినడకన కూడా నడిచే పరిస్థితి లేదు. పంట పొలాలకు వెళ్లేందుకు ప్రధాన దారి ఇదే కావడంతో, రైతులు తమ వ్యవసాయ పనులకు వెళ్లలేక, ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు బురదలో కూరుకుపోతున్నాయి. నిత్యం వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు.ఈ రహదారి దుస్థితిపై స్థానిక ప్రజలు,రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి,ఈ బురదగుంటలపై నాణ్యమైన మట్టి లేదా గ్రావెల్ పోయించి తాత్కాలికంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అలాగే భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఇక్కడ శాశ్వత సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుడి బాధ్యత

### మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



ప్రజాపక్షం/జమ్మికుంట : పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుని బాధ్యత అని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగాంగా మున్సిపల్ పరిధిలో చైర్మన్ ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోని ప్రజా ప్రతినిధులతో పాటు మహిళలు, పౌరులు తప్పనిసరిగా తమ నివాసాల వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. తల్లి జన్మనిస్తే మొక్కలు పునర్జన్మనిస్తాయి అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఖాళీ స్థలాలు, గృహాల ఆవరణల్లో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేశ్, చందా రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేశ్ ఎన్విరానమెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది బోళ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో నేడు జాబ్ మేళా




**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఐటీసీ, ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 6న గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. 18 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులకు సోలార్ ఎలక్ట్రిషియన్‌గా 30 రోజుల ఉచిత శిక్షణ కల్పించి, 30 మందిని ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్, ఫోటోలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ లాకావత్ లక్ష్మీ, ఉప సర్పంచ్ మారగాని అశోక్, పంచాయితీ కార్యదర్శులు సహకరించారు.

## హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

మద్దోజు శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రెండు పూర్తిగా విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) సత్తుపల్లి నియోజకవర్గ మహాసభ ఎస్.కె. పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భారత, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ యువతకు ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టకుండా మతం, కులం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ సత్తుపల్లి నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా ఎస్.కె. పాషాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సిపిఐ రూరల్ మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, గాదె రవి, కంచ శ్రీను, వల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాల కోసం మంత్రికి వినతి




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులో మున్సిపాలిటీ కార్మికులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆదివారం మున్సిపాలిటీ అభివృద్ధికి శంకుస్థాపనల కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీ కార్మికులకు గత 9 నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని వేతనాలు అందించి మా ఆకలి మంటలను తీర్చాలని కోరుతూ మంత్రిని ప్రాధేయపడ్డారు. కుటుంబ భారంతో జీవనం ముందుకు సాగటం కష్టంగా ఉందని నిత్యవసరాలు తీర్చేందుకు అప్పుల భారంతో పిల్లలు చదువులు స్కూల్ ఫీజులు నిత్యవసరాలతో పాటు అనేక అవసరాలను తీర్చుకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నామని మంత్రికి మొరపెట్టుకున్నారు. త్వరలో మీ వేతనాలను అందిస్తామని ఆందోళన చెందవద్దని వారికి మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మున్సిపాలిటీ సంఘం నాయకులు ప్రకాష్ చిన్న, అంజలి తో పాటు మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన నారుమడితో అధిక దిగుబడులు: బాబురావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వరి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు ఆరోగ్య కరమైన నారు మడులే ప్రధానమని ఇందు కోసం రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు సూచించారు. నాణ్యమైన నారుమడి దిగుబడితో పాటు లాభాలు వస్తాయన్నారు. ఎకరాకు నాట్లు వేసేందుకు సుమారు 4 సెంట్ల భూమిని నారుమడిగా సిద్ధం చేయాలని, భూమిని మెత్తగా దుక్కి చేసి సమతలంగా తయారు చేయాలని సూచించారు. దమ్ము నారుమడి పద్ధతిలో సాగుచేసే రైతులు 10 నుండి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి పొలాన్ని సిద్ధం చేయాలన్నారు. విత్తనాలను ముందుగా 24 గంటల పాటు నీటిలో నానబెట్టి అనంతరం 36 గంటల పాటు మూట కట్టాలని, ఇలా చేయడం వల్ల విత్తనాలు త్వరగా సమానంగా మొలకెత్తుతాయని పేర్కొన్నారు. మొలకవచ్చిన విత్తనాలను సెంటుకు 5 కిలోల చొప్పున నారుమడి సమానంగా చల్లాలని సూచించారు. నారుమడిలో పల్చగా నీరు నిల్వ ఉండేలా నిర్వహిస్తే నారుఆరోగ్యంగా పెరిగి సరైన సమయంలో నాటేందుకు అనుకూలంగా తయారవుతుందని తెలిపారు. నారు దశలో సరైన సంరక్షణ చేపడితే పంట ప్రాఅంబ నుంచే మంచి ఎదుగుదల ఉండటంతో పాటు దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అలాగే పంట ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సాంకేతిక సలహాలను వినియోగించుకోవాలని సూచించారు.

## కుర్నవల్లిలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సేవ్ యవర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్నవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఖమ్మంకు చెందిన ప్రముఖ వైద్యులు సునీల్ కుమార్ జంగాల నేతృత్వంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శేషమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యంపై అవగాహన కలిగించడంతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గ్రామ ప్రముఖులు వెంకటకోటిరెడ్డి, శివారెడ్డి, ఉప సర్పంచ్ సుహాసిని, శ్రీనివాసరెడ్డి, వెంకటాచారి, పోతురాజు వెంకటయ్య, గోపికృష్ణ, వంశీ ఉన్నారు.

# యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా

ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట
పట్టుబడుతున్న గంజాయి
పల్లెలకు పాకుతున్న గంజాయి మత్తు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అక్రమమా, సక్రమమా అన్నది పక్కనపెట్టి ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న వ్యాపారం లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడుతుందని తెలిసినా అదే పద్ధతిని కొనసాగించడం శోచనీయం. లక్షల విలువైన వాహనాలు సీజ్ అవుతున్నా వివిధ సెక్షన్ల కింద బలమైన కేసులు నమోదవుతున్నా అక్రమ పద్ధతులను మాత్రం వదలడం లేదు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పోలీసుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు పన్నుతూ గంజాయిని రవాణా చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచిన ఏదో ఒక మార్గం ద్వారా గంజాయిని రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలో గంజాయిని ఒక పంటగా సాగు చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరుతో పాటు దేశంలోని మెట్రో పాలిటన్ నగరాలకు ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రం మీదుగా ఎగుమతి అవుతుంది. ఇందులో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఈ రవాణా సాగుతుండటం గమనార్హం. ఎవరికి అనుమానం రాని రీతిలో అతి ఖరీదైన వాహనాలను కూడా గంజాయి అక్రమ రవాణా దారులు వినియోగిస్తున్నారు. మరి కొందరైతే లారీలు, మినీ వ్యాన్లు, ట్రాక్టర్లలో గంజాయిని రవాణా చేసేందుకు ఎవరికి అంతు పట్టని రీతిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి రవాణా చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కడ దొరికినా క్వింటాకు పైగానే





గంజాయి దొరుకుతుండటం విశేషం. హైదరాబాద్ నగరం కేంద్రంగా గంజాయి వ్యాపారులు పని చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని నిర్దేశిత ప్రాంతాలకు చేరవేసేందుకు డబ్బు ఎరవేసి యువకులను ప్రయోగిస్తున్నారు. నిరుద్యోగులుగా ఉండి దారి తప్పిన వారిని, డబ్బు అవసరం ఉన్న వారిని గు ర్తించి రవాణా కోసం వాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఆధార్ ద్వారా కొందరు కార్లు తదితర వాహనాలను అద్దెలకు ఇస్తున్నారు. ఆ వాహనాలను ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు తీసుకెళ్లి అందులో గంజాయిని చేర్చుకుని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. కొంత మేర పట్టుబడకుండా రవాణా కూడా అవుతున్నది పెద్ద మొత్తంలోనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ గంజాయి వ్యాపారం కారణంగా తాగే వారితో పాటు డబ్బులను ఆశించి రవాణాకు ఒప్పుకుంటున్న యువకుల జీవితాలు కూడా ఛిద్రమవుతున్నాయి. హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పెద్ద మొత్తం ఎరవేసి గంజాయి రవాణాకు ఒప్పించారు. డబ్బు ఆశతో గంజాయి రవాణాకు అంగీకరించిన ఆ యువకుడు ఊసలు లెక్కపెడుతూ జీవితాన్ని అంధకారం చేసుకున్నాడు. గంజాయి లాభసాటి వ్యాపారంగా మారింది. పట్టణాలు, నగరాల్లో ఇప్పుడు గంజాయికి బాగా డిమాండ్ పెరిగింది. ఒకసారి గంజాయి మత్తుకు అలవాటు పడితే దానిని పీల్చకుండా జీవించడం కష్టమేనన్న ప్రచార నేపథ్యంలో రవాణా పెరుగుతుంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో చౌకగా కొనుగోలు చేసి మెట్రో పాలిటన్ నగరాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. గంజాయితో సిగరెట్లను తయారు చేయడమే కాకుండా ఒక గ్రాము, రెండు గ్రాముల ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. రకరకాల మానసిక ఇబ్బందులతో గంజాయి పీల్చడం ద్వారా ఉపశమనం పొందవచ్చునన్న ఆలోచన గంజాయి రవాణా విక్రయాలు పెరిగేందుకు కారణమవుతుంది. హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ఈ గంజాయి క్రయ, విక్రయ సిండికేట్ కోట్ల రూపాయలను ఆర్జిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. గంజాయి రవాణా దారులతో పాటు గంజాయి అక్రమ వ్యాపారాలపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. పోలీసులు ఇప్పు డు ఏర్పాటు చేస్తున్న నిఘా బృందాలను మరింత విస్తరిస్తే గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు మా ర్గం సులభమవుతుంది.

### పల్లెలకు పాకిన గంజాయి..

ఖమ్మం జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న ఓ ఘటన ఆలోచింపజేస్తుంది. మారుమూల పల్లెటూరులో రోడ్ల వెంట గంజాయి సేవిస్తూ కొందరు యువకులు పట్టుబడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి మత్తుకు బానిసలైతే పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారుతుంది. పోలీసులు, రాజకీయ పార్టీలు ఈ గంజాయి మత్తుకు యువతను దూరం చేసేందుకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. లేకపోతే ఈ మత్తు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒక గ్రాము గంజాయి ప్యాకెట్లు, సిగరెట్లు యువతను బాగా ఆకర్షిస్తున్నాయని దీనిపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారో అడ్డాలను గుర్తించి మెరుపు దాడులు చేయడం ద్వారా కొంత మేర అరికట్టే అవకాశం ఉంది. ఆ దిశగా పోలీస్, నిఘా వ ర్గాల ఆలోచనలు ఉండాల్సి ఉంది.

# రైతుబంధు దుర్వినియోగంపై చర్యలు తప్పవు

బోగస్ పాస్ బుక్కులతో లబ్ధి పొందిన వారిని వదిలేది లేదు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
సత్తుపల్లిలో రూ.2 కోట్ల అవుట్‌డోర్ స్టేడియానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గత ప్రభుత్వ హయాంలో బోగస్ పట్టాదార్ పాస్ బుక్కుల ఆధారంగా రైతుబంధు నిధులను అక్రమంగా పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ప్రతి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి, వాస్తవంగా భూమి సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రైతుబంధు అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అవుట్‌డోర్ స్టేడియం పనులకు స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా కోసం మరో రూ.9,200 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యా రంగంలో కూడా పలు సంస్కరణలు చేపట్టామని, గత ప్రభుత్వంలో సంవత్సరాల తరబడి బదిలీలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులకు పారదర్శకంగా బదిలీలు నిర్వహించడంతో పాటు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. హాస్టల్ విద్యార్థుల డైట్, మెస్ చార్జీలను పెంచడంతో పాటు



బాలికలకు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచినట్లు తెలిపారు.గతంలో అద్దె భవనాల్లో నడిచిన రెసిడెన్షియల్ పాఠశాలలకు ప్రస్తుతం శాశ్వత భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా రూ.20 వేల కోట్లతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. రైతుబంధు దుర్వినియోగంపై స్పందిస్తూ, కొన్ని గ్రామాల్లో వేల ఎకరాలకు బోగస్ పాస్‌బుక్కులు సృష్టించి అక్రమంగా రైతుబంధు పొందినట్లు గుర్తించామని అన్నారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి, వాస్తవ భూస్వాములకు పాస్ బుక్కులు అందజేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్ , మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

ఒకరు అరెస్ట్: రిమాండ్‌కు తరలింపు



**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయి తరలిస్తున్న ఒకరిని పట్టుకొని 29 కిలోల గంజాయిని పాల్వంచ పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. టి. నాగరాజు తన సిబ్బందితో కలిసి సంజయ్‌నగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం రోడ్ నుండి కొత్తగూడెం వైపునకు వెళుతున్న ఓ ఆటో అనుమానాస్పదంగా అతి వేగంగా రావడం గమనించి, టోను ఆపి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గమనించారు. వెంటనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిశా రాష్ట్రం కలిమెల నుండి మహబూబాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుండి రూ. 34వేలు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. గంజాయిని, ఆటోను స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 28. 900 గ్రాములని దీని విలువ రూ.14.45 లక్షలు ఉంటుందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని కష్టపడి చదువుకొని సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా తగు సమాచారాన్ని నేరుగా తనకు ఇవ్వాలని కోరారు.

## తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిద్దాం: రోషన్ కుమార్



**ప్రజాపక్షం/బోనకల్:** పేద, దళిత ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ మండల సమితి సభ్యుడు తూము ప్రకాశరావు కోరారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్ 80వ ప్రత్యేక క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా తూము రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత మధిర తాలూకాలోని పల్లెలు అభివృద్ధి చెందాయంటే ఆనాడు కమ్యూనిస్టు నాయకులు చేసిన త్యాగాల ఫలితాలేనని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం, ముఖ్యంగా దళితులఅభివృద్ధి కోసం ఎందరో కమ్యూనిస్టు నాయకులు పోరాటాలు చేశారని, ఆ పోరాటాల కోసం తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. నాటి నేటి నుండి వరకు ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తూ, మా కుటుంబమంతా ఆయన బాటలోనే నడుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యూఎటిఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల నాయకులు పవన్, పూర్ణచంద్, టిడిపి నాయకులు భద్రయ్య, క్యాంపు సహాయకులు గిరి, గోపి పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ఎన్‌ఎఫ్‌ఎఇ 8వ అఖిల భారత మహాసభ

స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం
ఎంపి బలరాం నాయక్
నిర్వాసితులకు న్యాయం చేయాలి
ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలో హెవీ వాటర్ ప్లాంట్ గౌతమినగర్ కాలనీలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎంప్లాయీస్(ఎన్‌ఎఫ్‌ఎఇ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ అఖిల భారత మహాసభ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ అణుశక్తి సంస్థల ఉద్యోగ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షత వహించగా, హెవీ వాటర్ ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ డిసి ఓజా మహాసభను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద హెవీ వాటర్ ప్లాంట్‌గా గుర్తింపు పొందిన ఈ కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం వల్ల స్థానిక యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెవీ వాటర్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించలేదని పేర్కొన్నారు. వారి సమస్యలను ఈ జాతీయ మహాసభలో ప్రధాన అంశంగా చర్చించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఉపాధి, ఉద్యోగుల సంక్షేమం, మెరుగైన వైద్య సదుపాయాలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ హెవీ వాటర్ ప్లాంట్‌లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే సంబంధిత కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలిసి స్థానికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల ఆసుపత్రిలో వైద్య సేవల మెరుగుదల పెన్షన్ సమస్యల పరిష్కారం, రైల్వే సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై కూడా కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తానని తెలిపారు. ఈసందర్భంగా అశ్వాపురం సర్పంచ్ బానోత్ సదర్‌లాల్ మాట్లాడుతూ అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు నిలుపుదల కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిని కోరారు. అనంతరం ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, చీఫ్ జనరల్ మేనేజర్ డిసి ఓజా సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ మహాసభలో ప్రస్తావించిన ఉద్యోగుల సంక్షేమం, స్థానిక ఉపాధి, భద్రతా ప్రమాణాలు, వైద్య సేవలు, పెన్షన్, నిర్వాసితుల సమస్యలు తదితర అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు, ప్రతినిధులు హాజరయ్యారు.

## పంట విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా బుకింగ్

కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పంట విస్తీర్ణానికి అనుగుణంగా రైతులు యూరియా బుక్ చేసుకోవాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా బుక్ యాప్‌లో సవరించిన మార్గదర్శకాలు నేటి నుండి అమల్లోకి వస్తాయని, రై తులు దశలవారీగా బుక్ విధానాన్ని అనుసరించాలని తెలిపారు. రైతులకు యూరియా, ఎరువులు పారదర్శకంగా అందించేందుకు యాప్‌లో పలుమార్పులు చేసినట్లు తె లిపారు. రెండు ఎకరాల వరకు సాగుచేసే రైతులు తమ పంటకు అవసరమైన మొత్తం యూరియా ఒకేసారి బుక్ చేసుకుని పొందవచ్చన్నారు. ఐదు ఎకరాల వరకు సాగుచేసే రైతు లు యూరియాను మూడు విడతలుగా బుక్ చేసుకోవాలని చెప్పారు. రెండు బుకింగ్‌ల మధ్య కనీ సం 20 రోజుల వ్యవధి ఉండాలనే నిబంధన లు అమలవుతున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి అ పోహలకు లోను కాకుండా ప్రభు త్వం సవరించిన మార్గదర్శకాల ప్రకారం యూరియా బుక్ చేసుకోవాలని, అవసరానికి మించి బుక్ చేసుకునేందుకు ప్ర యత్నించవద్దని సూచించారు. జిల్లాలో యూరియా, ఎరువుల కొరత లేదని, రైతులందరికీ అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బుక్ యా ప్ విధి విధానాలను రైతులు తప్పని సరిగా అనుసరించాలన్నారు.

## పైలేరియా నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** పైలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వేను 6వ తేదీ నుండి 18వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. ఈ సర్వే జిల్లాలో గంగారం, లంక సాగర్, వేంసూర్, తల్లాడ, ఏన్కూర్, కల్లూరు, చెన్నూరు, బోనకల్, బనిగండ్లపాడు, మాటూరిపేట, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గుర్తించిన 31 గ్రామాలలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాలలోని గుర్తించిన గృహాలను సందర్శించి, 20సంవత్సరాలు నిండిన వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో సుమారు 105 మంది అర్హులైన వ్యక్తులకు పరీక్షలు చేసి పైలేరియా వ్యాధి సోకిందా లేదా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. సర్వే సందర్భంగా ఎంపిక చేసిన ఇంటిలోని అర్హులైన కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించబడతాయి.

## ‘రియల్’ ఉపాధ్యాయులకు మొదలైన కౌంట్ డౌన్

‘ప్రజాపక్షం’ కథనాలపై కలెక్టర్ ఆరా!
తెర వెనక వ్యాపారాలకు చెక్ పడేనా?

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ తదితర ప్రైవేట్ వ్యాపారాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై ‘ప్రజాపక్షం’ వరుసగా ప్రచురిస్తున్న కథనాలు అధికార యంత్రాంగంలో ప్రకంపనలు రేపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే నిఘా వర్గాలు వివరాలు సేకరించాయని ప్రచారం కొనసాగుతుండగా, తాజాగా జిల్లా కలెక్టర్ సైతం ఈ వ్యవహారంపై ఆరా తీసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల జాబితా, వారి కార్యకలాపాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఇప్పటివరకు నిర్భయంగా వ్యవహరించిన కొందరు ఉపాధ్యాయుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొన్నట్లు సమాచారం. ఇంతకాలం తెర వెనుక సాగినట్టు చెబుతున్న రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ తదితర వ్యాపారాలపై ‘ప్రజాపక్షం’ వరుస కథనాలు వెలుగులోకి తేవడంతో వ్యవహారం జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు చేరిందని స్థానికంగా చర్చ సాగుతోంది. త్వరలోనే అధికారిక విచారణకు రంగం సిద్ధమవుతుందనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ప్రభుత్వ సేవలో ఉంటూ ఇతర వ్యాపారాల్లో పాల్గొనడం ఉద్యోగ నియమావళికి విరుద్ధమవడంతో సంబంధిత వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఇక ఎవరి పేర్లు బయటకు వస్తాయో? ఎవరిపై చర్యలు మొదలవుతాయో? అన్న ఉత్కంఠ సంబంధిత వర్గాల్లో నెలకొంది. మరోవైపు వాస్తవ పరిస్థులను వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజాపక్షం కథనాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, సంబంధిత వర్గాల్లో మాత్రం తీవ్ర కలకలం రేగుతున్నట్లు తెలిసింది.

## 15న సింగరేణి మెడికల్ బోర్డు నిర్వహణ

వాసిరెడ్డి సీతారామయ్య వెల్లడి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల వైద్య సంబంధిత పెండిగ్ కేసుల పరిష్కారానికి ఈనెల 15వ తేదీన సింగరేణి మెడికల్ బోర్డును నిర్వహించనున్నట్లు గుర్తింపు సంఘం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. వారు మాట్లాడుతూ యూనియన్ ప్రతినిధులు పలు సందర్భాల్లో యాజమాన్యంతో పలు దశల్లో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్ని ఇవ్వడంతో మెడికల్ బోర్డు నిర్వహణకు యాజమాన్యం అంగీకరించినట్లు వారు వెల్లడించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) అనునిత్యం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మెడికల్ బోర్డు నిర్వహణకు ముందుకు వచ్చిన సింగరేణి సంస్థ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభావితమైన రాజ్యాంగ సంస్థలు..

# ప్రజాస్వామ్యానికి సవాళ్లు విసురుతున్నాయ్

ఆర్‌జెడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ ఆందోళన



**పాట్నా :** కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఆర్‌జెడి అధినేత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత దెబ్బతినడం, దూకుడుగా విస్తరిస్తున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, మితవాద రాజకీయాల పెరుగుదల వంటి అంశాలు మన ప్రజాస్వామ్య పునాదులకే తీవ్ర సవాళ్లు విసిరాయని ఆయన పేర్కొన్నారు. ఆర్‌జెడి 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన ఒక సందేశం పంపారు. 'నేడు దేశవ్యాప్తంగా అనేక ప్రజాస్వామ్య, ప్రగతిశీల, సోషలిస్ట్, రాజ్యాంగబద్ధ శక్తులు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. రాజ్యాంగ సంస్థల విశ్వసనీయత దెబ్బతినడం, దూకుడుగా సాగుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, ఓటర్లను ప్రభావితం చేయడానికే కాకుండా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడానికి కూడా డబ్బును విచ్చలవిడిగా ఉపయోగించడం, అలాగే మితవాద రాజకీయాల పెరుగుదల వంటివి మన ప్రజాస్వామ్య పునాదులకు తీవ్ర సవాళ్లుగా మారాయి. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం, విద్య, ఉపాధిలో సమాన అవకాశాలు, మైనారిటీల హక్కులు, భద్రత, అలాగే ప్రభుత్వ వైఫల్యాలు వంటి అంశాలన్నీ హిందుత్వ అనే ముసుగులో కప్పివేయబడుతున్నాయి' అని ప్రసాద్ పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, అట్టడుగున ఉన్నవారు, మైనారిటీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడేందుకు తాము ఆర్‌జెడిని స్థాపించామని, ఆ రోజు సాధారణమైనది కాదన్నారు. అది బిహార్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రాజకీయాల గమనాన్ని, స్వభావాన్ని మార్చిన ఒక కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు. మారుతున్న కాలంలోనూ, సామాజిక, ఆర్థిక అసమానతలు, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటమే తమ రాజకీయాల ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోందని ప్రసాద్ అన్నారు. సమాజంలో అత్యంత పేద వ్యక్తికి, చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అభివృద్ధిలో సమాన వాటా, అర్థవంతమైన భాగస్వామ్యం లభించేలా చూడటానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు.

# పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

ముంబయి అతలాకుతలం,
గుజరాత్‌లో ముంచెత్తిన వరదలు
కేరళ, ఒడిశాకు రెడ్ అలర్ట్
జారీచేసిన ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, కేరళలో వరదలు ముంచెత్తుతున్నాయి. ఒడిశాకు కూడా భారత వాతావరణశాఖ భారీ వర్ష హెచ్చరిక చేసింది. ముంబయి మహానగరాన్ని కుండపోత వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండి) ముంబయి, రాయ్‌గఢ్ జిల్లాలకు రానున్న మూడు గంటల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో గత 23 గంటల్లోనే 250 నుంచి 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ముంబయిలోని కుర్లా ప్రాంతంలో భారీ వర్షం కారణంగా ఒక దుకాణంపై చెట్టు కూలడంతో 63 ఏళ్ల వ్యక్తి మరణించారని, వారం రోజుల వ్యవధిలో నగరంలో చెట్టు కూలి సంభవించిన రెండవ మరణం ఇదేనని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఐఎండి వివరాల ప్రకారం, శనివారం ఒక్కరోజే ముంబయిలోని పలు ప్రాంతాల్లో కేవలం 12 గంటల వ్యవధిలోనే 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సముద్రంలో నీటి మట్టం ఎక్కువగా ఉన్న సమయంలోనూ భారీ వర్షం కురవడంతో నీటి నిల్వలు మరింత పెరిగాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. రహదారులపై భారీగా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల ధాటికి ముంబయిలోని బేలాపుర్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఓ భవనం బాల్కనీ కూలిపోయింది. ప్రస్తుతం ఆ భవనం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, రోడ్లు కుంగిపోవడం, కొన్ని పాత ఇళ్లకు నష్టం కలగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. పరిస్థితి విషమించడంతో రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేశారు. సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందిని సహాయక చర్యల కోసం మోహరించినట్లు అధికారులు తెలిపారు. నగరంలో నీటి నిల్వలను తొలగించేందుకు 448 డీవాటరింగ్ పంపులు, 19 మినీ పంపింగ్ స్టేషన్లు నిరంతరం పనిచేస్తున్నాయని వెల్లడించారు. ముంబయితో పాటు థానే, పాల్ఘర్ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశాయి. పాల్ఘర్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోయి ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. మరోవైపు వరదల్లో చిక్కుకున్న 180 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.



**గుజరాత్‌లో కొట్టుకుపోయిన కారు**

గుజరాత్‌లోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భావనగర్ జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచింది. వరద ఉద్ధృతిలో ఓ కారు కొట్టుకుపోయింది. భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ పలు జిల్లాలకు రెడ్ ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది.

**కేరళలో పలు ప్రాంతాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్**

కేరళలోని ఉత్తర జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేయడంతో పాటు, రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను జారీ చేసింది. దీంతో ఆదివారం కేరళలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఆదివారం త్రిస్సూర్, మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయబడింది. దీని ప్రకారం 24 గంటల్లో 64.5 మిల్లీమీటర్ల నుంచి 115.5 మిల్లీమీటర్ల వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ జూలై 6న కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు, 7న కోజికోడ్ కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దీని ప్రకారం 24 గంటల్లో 115.6 మిల్లీమీటర్ల నుంచి 204.4 మిల్లీమీటర్ల వరకు అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. వాతావరణ హెచ్చరికల దృష్ట్యా, కొండచరియలు విరిగిపడే, బురద ప్రవాహాలు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, అధికారుల ఆదేశాల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ కోరింది. నదీ తీరాలలో, డ్యామ్‌ల దిగువన నివసిస్తున్న నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఆదేశిస్తే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది.

**ఒడిశాలో తీవ్ర అల్పపీడనం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రతరం చెందింది. దీనివల్ల రాబోయే రోజుల్లో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దృష్ట్యా ఒడిశాలోని అన్ని జిల్లాలకు హై అలర్ట్ ప్రకటించారు. వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లోని అల్పపీడన ప్రాంతం కేంద్రీకృతమై తీవ్ర అల్పపీడనంగా మారిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది ప్రస్తుతం బాలాసోర్‌కు దక్షిణ–ఆగ్నేయంగాష దీఘాకు దక్షిణనైరుతిగా 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వ్యవస్థ రాబోయే రోజులో చంద్‌బలి, దీఘా మధ్య ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. సంబల్‌పూర్, అంగుల్, బౌధ్, సోనేపూర్, కంధమాల్ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఐఎండి 'రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 19 జిల్లాల్లో ఏదైనా విపత్తు సంభవించినప్పుడు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచిస్తూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మరో ఆరు జిల్లాలకు ఎల్లో' వార్నింగ్ జారీ చేశారు. ఈ అల్పపీడన ప్రభావంతో జూలై 5 నుండి జూలై 7 వరకు సముద్రం అల్లకల్లోలంగా లేదా అత్యంత అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉంది, కాబట్టి ఈ సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.

**ఢిల్లీలో ఉక్కపోత నుంచి ఉపశమనం**

ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసి, ఉక్కపోత వాతావరణం నుండి ఎంతో అవసరమైన ఉపశమనాన్ని కలిగించింది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఛతర్‌పూర్‌లో అత్యధికంగా 49 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత గురుగ్రామ్ (35 మిల్లీమీటర్లు), మెహ్రౌలీ (18 మిల్లీమీటర్లు), గ్రేటర్ నోయిడా (17 మిల్లీమీటర్లు), నజాఫ్‌గఢ్ (8 మిల్లీమీటర్లు), జనక్‌పురి (7 మిల్లీమీటర్లు)లలో కూడా వర్షపాతం నమోదైంది. పగటిపూట ఆకాశం సాధారణంగా మేఘావృతమై మోస్తరు వర్షం కురుస్తుందని, గరిష్ట ఉష్ణోగ్రత సుమారు 36 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జార్ఖండ్‌లో, ఈనెల 6 నుండి 9 వరకు రాష్ట్రంలోని 24 జిల్లాలంతటా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల కోసం ఐఎండి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. గర్వా, పాలము, చత్ర, హజారీబాగ్, లతేహర్, లోహర్దగా, గుమ్లా మరియు రాంచీలలో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

మంత్రుల తొలగింపునకు ఉద్దేశించిన

# రాజ్యాంగ బిల్లును వ్యతిరేకిస్తాం

ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల
మెజారిటీ లభించబోదు
కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్రమైన నేరాలకు సంబంధించి 30 రోజుల పాటు కస్టడీలో ఉన్న మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో గట్టిగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ ఆదివారం స్పష్టం చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందడానికి ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ లభించబోదని ఆ పార్టీ విశ్వాసం వ్యక్తం చేసింది. నేరారోపణలపై అరెస్టు అయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులను తొలగించే బిల్లులను పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ, ప్రతిపాదిత చట్టాలపై తన నివేదికను ఈనెల 17న ఆమోదించి, వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభకు సమర్పించే అవకాశం ఉందని వర్గాలు తెలిపిన కొద్ది రోజులకే ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే ముందే ఈ ముసాయిదా చట్టాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించే అవకాశం ఉంది. ప్రతిపాదిత చట్టం ప్రత్యర్థులను రాజకీయంగా వేధించడం కోసమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల కోసం నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి హోం మంత్రి అమిత్ షా మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించలేరని రమేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. 'వారు 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నిస్తారు, దానిని మేము వ్యతిరేకించబోతున్నాము. ఇది ఒక ప్రమాదకరమైన బిల్లు. దీనిని 2025 ఆగస్టులో ప్రవేశపెట్టారు, ఆ తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపారు, దానిని చాలా ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించాయి' అని రమేస్ పిటిఐకి చెప్పారు. ఐదేళ్లకు పైగా శిక్షార్హమైన నేరానికి గాను ఒక మంత్రి వరుసగా 30 రోజులు జైలులో ఉంటే, 31వ రోజున వారిని పదవి నుండి తొలగిస్తారని ఈ బిల్లులో ఉందని కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. 'ఇది అసాధారణం. అంటే, కోర్టు విచారణలు ఇంకా కొనసాగుతున్నాయి. భారతదేశంలో, నేరం రుజువయ్యే వరకు నిర్దోషిగా భావిస్తారు. మోదీ–హోం మంత్రి అమిత్ షా ప్రభుత్వంలో దర్యాప్తు సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో మనందరికీ తెలుసు అని రమేశ్ అన్నారు. ఆ బిల్లును ప్రస్తావిస్తూ, ఇది 'రాజకీయ కక్ష', 'రాజకీయ ప్రతీకారం' తప్ప మరేమీ కాదని ఆయన అన్నారు. ప్రత్యర్థులను రాజకీయంగా వేధించడానికే ఇది ఉద్దేశించబడిందన్నారు. ఏప్రిల్ 16న జరిగిన ప్రత్యేక సమావేశంలో వచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తాము వ్యతిరేకించామని, ఆ సమయంలో రాజ్యాంగ సవరణ కోసం 352 ఓట్లు అవసరం కాగా, కేవలం 298 మంది ఎంపిల మద్దతు మాత్రమే లభించడంతో హోం మంత్రి తీవ్ర అవమానానికి గురయ్యారన్నారు. అయితే ఈ అవమానాన్ని తట్టుకోలేక ఏప్రిల్ 17 నుండి షా వివిధ రాజకీయ పార్టీలను చీల్చడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. టిఎంసి, శివసేన (యుబిటి)లను చీల్చారని చెప్పారు. అయినా తమ ఐక్యత, సంఘీభావం కొనసాగుతూనే ఉన్నాన్నారు.

# దోచుకునే హిందువులే... 'అధికారం'లో ఉన్నారు

శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే ధ్వజం
దాదర్‌లో తన 'రామ రక్ష' ఉద్యమ ర్యాలీని
ప్రారంభించి, బిజెపిపై విమర్శనాస్త్రాలు

**ముంబయి :** శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే ఆదివారం తన 'రామ రక్ష' ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అధికారంలో ఉన్న బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించారు. 'దోచుకునే హిందువులే అధికారంలో ఉన్నారు' ఆయన ధ్వజమెత్తారు. సెంట్రల్ ముంబయిలోని దాదర్‌లో ఉన్న హనుమాన్ ఆలయం వెలుపల జరిగిన ర్యాలీలో ఆయన ఉద్ధవ్ థాకరే 'హనుమాన్ స్తోత్రం', 'హనుమాన్ చాలీసా'ను పఠిస్తూ, ఈ విషయంపై నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హిందుత్వను దుర్వినియోగం చేసి ఎవరైనా ఆలయాన్ని దోచుకుంటే, హిందువులు వారిని వదిలి పెట్టరని ఆయన గట్టిగా హెచ్చరించారు. కాషాయ కుర్తా ధరించిన ఆయన ఇలా అన్నారు. 'దోపిడీకి పాల్పడే హిందువులు అధికారంలో ఉండటం దురదృష్టకరం. దొంగను తన దోపిడీ గురించి విచారించమని అడగలేం. విచారణ నిష్పక్షపాతంగా జరగాలి. 'అయోధ్య తో ఝూంకీ హై', 'కాశీ, మథుర అభీ బాకీ హై' (అయోధ్య ట్రైలర్, కాశీ, మథుర ఇంకా రావాలి) అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ, కాశీ, మథురలో ఏమి జరుగుతోందోనని నేను ఆందోళన చెందుతున్నాను' అని శివసేన (యుబిటి) చీఫ్ పేర్కొన్నారు. 'ఉగ్రమైన, అమాయకమైన, దేశభక్తిగల హిందువులమే కానీ మేం మూర్ఖులం మాత్రం కాదు' అని ఉద్ధవ్ థాకరే అన్నారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే హిందువులను మేల్కొల్పారని, కానీ ఈ రోజు వారు హిప్నటైజ్ చేయబడుతున్నారని ఉద్ధవ్ పేర్కొన్నారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం వార్తలు జులై 7న వెలుగులోకి వచ్చాయని, తర్వాత ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసిందని ఆరోపించారు. ఆలయ విరాళాల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన 8మందిని ఈ కేసులో అరెస్ట్ చేయగా...ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# 6 కిలోలు తగ్గిన సోనమ్ బరువు


8వ రోజూ కొనసాగిన నిరాహారదీక్ష
16 రోజులకు చేరిన సిజెపి నిరసన



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన ఆదివారంతో 16వ రోజుకు చేరింది. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఎనిమిదవ రోజుకు చేరింది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి ఆయన సుమారు ఆరు కిలోల బరువు తగ్గారు. వైద్యులు విడుదల చేసిన ఆరోగ్య నివేదిక ప్రకారం, పడుకుని ఉన్న స్థితిలో వాంగ్‌చుక్ రక్తపోటు 112/70 ఎంఎం హెచ్‌జి, గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 72 సార్లు, రక్తంలో చక్కెర స్థాయి 67 ఎంజి/డిల్‌గా నమోదయ్యాయి. ఆయన శరీరంలో నీటి శాతం సరిగానే ఉందని, మానసికంగా చురుకుగా ఉన్నారని, అలాగే ఆయన బరువు 60.95 కిలోలకు తగ్గిందని (అంటే ఏడు రోజుల్లో సుమారు ఆరు కిలోల తగ్గుదల) ఆ నివేదిక పేర్కొంది. పరీక్షల నిర్వహణలో అక్రమాలపై ప్రభుత్వ బాధ్యతను డిమాండ్ చేస్తూ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ సిజెపి నిరసనను కొనసాగిస్తోంది. పదేపదే జరుగుతున్న పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు విద్యార్థులు, వారి కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేశాయని ఆరోపించింది. నీట్ ఆశావహ అభ్యర్థి రియా కుమారి థాపా తల్లిదండ్రులు ఆదివారం నిరసన స్థలాన్ని సందర్శించారని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో తెలిపారు. ప్రశ్నపత్రం లీక్ కారణంగా తన కలలు కల్లలవడంతో థాపా మరణించారని ఆయన చెప్పారు. థాపా తండ్రి, మాజీ ఆర్మీ ఉద్యోగి అని, తమ కుటుంబం అనుభవించిన బాధను మరే ఇతర కుటుంబం అనుభవించకూడదనే విజ్ఞప్తితో ఆయన నిరసనలో పాల్గొన్నారని దిప్కే చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కేంద్రాన్ని కోరారు. మరొక పోస్ట్‌లో తమ కుమార్తె విషయంలో విఫలమైన అవినీతిమయ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలోనూ, ఆ బాధలోనూ థాపా తల్లిదండ్రులకు అండగా నిలుస్తామని సిజెపి ప్రకటించింది. సిజెపి ఆందోళనకు మద్దతు ప్రకటించిన 'సంయుక్త కిసాన్ మోర్చా' (ఎస్‌కెఎం) సోమవారం జంతర్ మంతర్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని నిర్ణయించింది. ఆదివారమే నిరసన స్థలాన్ని సందర్శిస్తామని ఆ రైతు సంఘం మొదట సిజెపి రాసిన లేఖలో పేర్కొన్నప్పటికీ, ఆ పర్యటన తేదీ మారింది. ఆందోళనలో పాల్గొంటున్న విద్యార్థులకు, యువతకు ఎస్.కె.ఎం. సంఘీభావం తెలిపింది. ప్రతి విద్యార్థికి పారదర్శకమైన, నిష్పక్షపాతమైన, విశ్వసనీయమైన పరీక్షా విధానం పొందే హక్కు ఉందని, జవాబుదారీతనాన్ని నిర్ధారించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంది. వామపక్ష అనుబంధ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా)కు చెందిన పలువురు సభ్యులు కూడా నిరసన ప్రదేశంలోని మరో వేదికపై తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు. నిరాహార దీక్ష ఏడవ రోజున రక్తంలో చక్కెర స్థాయి 46 ఎంజి/ డిఎల్‌కు పడిపోవడంతో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) సంయుక్త కార్యదర్శి డానిష్ అలీ శనివారం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరారు. నేహా, మనీష్, హృషికేష్, దీపక్ కుమార్ వర్మ, అమీన్ నిరసన ప్రదేశంలో తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు. దేశ పరీక్షా విధానంలో జరిగిన అవకతవకలపై జూన్ 20న ప్రారంభమైన సిజెపి నిరసనకు పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, పౌర సమాజ సభ్యుల నుంచి మద్దతు లభించింది.

# రామాలయ విరాళాల చోరీ విచారకరం..

కఠిన శిక్ష పడాల్సిందే: మోహన్ భాగవత్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్‌మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన 'సన్మార్గ్ మైండ్ వెల్నెస్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోహన్ భాగవత్.. ఆర్‌ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే శనివారమే దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, అసాధారణమైనదిగా పరిగణించాలని ఆర్‌ఎస్ఎస్ సూచించింది. ఆలయ ఆర్థిక నిర్వహణలో, పరిపాలనా వ్యవస్థలో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్దాలని కోరింది. భక్తుల నమ్మకం వమ్ము కాకుండా ఉండేందుకు భవిష్యత్తులో పారదర్శకమైన ఆర్థిక విధానాలను, కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది.

నేడు, రేపు జెనీవాలో

# 'ఎఐ' గవర్నెన్స్‌పై యుఎన్ గ్లోబల్ డైలాగ్ సదస్సు

హాజరుకానున్న విదేశీ వ్యవహారాల
శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్
ప్రతినిధి బృందం
ఎంఇఎ ప్రకటన వెల్లడి



**న్యూఢిల్లీ :** జెనీవాలో జులై 6, 7 తేదీలలో జరుగనున్న ఆర్టిఫీషియెల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గవర్నెన్స్‌పై ఐక్యరాజ్యసమితి ప్రారంభ గ్లోబల్ డైలాగ్ సదస్సులో పాల్గొనే భారత ప్రతినిధి బృందానికి విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ నాయకత్వం వహిస్తారని ఆదివారం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) తెలిపింది. అంతర్జాతీయ, ప్రాంతీయ, జాతీయ, బహుళ భాగస్వాముల ప్రయత్నాలకు పూరకంగా ఉండే మార్గాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ (ఎఐ) అంతర్జాతీయ పాలనను ముందుకు తీసుకెళ్లడానికి గ్లోబల్ డైలాగ్ ఒక విశిష్టమైన అవకాశం అని అది పేర్కొంది. విదేశీ వ్యవహారాలు పర్యావరణ శాఖ సహాయమంత్రి, అటవీ, వాతావరణ మార్పు శాఖ మంత్రి సింగ్ జెనీవా, స్విట్జర్లాండ్‌కు వెళ్లనున్న భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించనున్నారు. గ్లోబల్ డైలాగ్ ఆన్ ఎఐ గవర్నెన్స్ అనేది, 2024 సెప్టెంబర్‌లో ఫ్యాక్ట్స్ ఆఫ్ ది ఫ్యూచర్‌లో భాగంగా ఆమోదించబడిన గ్లోబల్ డిజిటల్ కాంపాక్ట్‌ను అనుసరించి, జనరల్ అసెంబ్లీ తీర్మానం 79/325 కింద స్థాపించబడిన ఒక సార్వత్రిక బహుళ వాటాదారుల ఐక్యరాజ్యసమితి వేదిక. 'శాస్త్రీయ అవగాహన, పారదర్శకత, జవాబుదారీతనం, పటిష్టమైన మానవ పర్యవేక్షణను ప్రోత్సహించే స్వతంత్ర అంతర్జాతీయ శాస్త్రీయ వేదికతో కలిసి ఈ సంభాషణ జరుపనున్నారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామర్థ్యాలను పెంపొందించడానికి తద్వారా వ్యవస్థలను సుస్థిర అభివృద్ధి సాధన దిశగా నడిపించడానికి సహాయపడుతుంది' అని విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. 'ఆగస్టు 2025లో ఆమోదించబడిన విధివిధానాలు, పద్ధతులకు అనుగుణంగా, సహ అధ్యక్షులు 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా వ్యక్తిగతంగా జరిపిన ఒక సంప్రదింపుతో సహా అనేక వాటాదారుల సంప్రదింపులను కూడా నిర్వహించారు' అని ఎంఇఎ పేర్కొంది. డైలాగ్ ఆన్ ఎఐ, ఎఐ సామర్థ్యాలు, అభివృద్ధి చెందుతున్న అవకాశాలు, నష్టాలపై మొదటి స్వతంత్ర శాస్త్రీయ అంచనాను అందించే స్వతంత్ర అంతర్జాతీయ శాస్త్రీయ ప్యానెల్ ఆన్ ఎఐ (ఐఐఎస్‌పిఎ) వార్షిక నివేదికను అందుకుంటుందని ఎంఇఎ తెలిపింది. ఈ చర్చా కార్యక్రమంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సామాజిక, ఆర్థిక ప్రభావాలు ఎఐ వినియోగంలో అంతరాలను తగ్గించడం, సురక్షితమైన,విశ్వసనీయమైన ఎఐ, అలాగే ఎఐ నేపథ్యంలో మానవ హక్కుల వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు ఉంటాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎఐ డైలాగ్‌పై మొదటి సదస్సు జులై 6,7 తేదీలలో జెనీవాలో జరుగనుండగా, 2027 మేలో న్యూయార్క్‌లో జరుగుతుందని ఎంఇఎ వెల్లడించింది.

# మణిపూర్, ఒడిశాలో లక్షలాది మంది ఓటర్ల తొలగింపు

ఓటరు ముసాయిదా జాబితా
విడుదల చేసిన సిఇఒలు



**ఇంఫాల్/ భువనేశ్వర్ :** ఎన్నికల కమిషన్ చేపట్టిన 'సర్' ప్రక్రియతో ఓటర్ల తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా ఏ మాత్రం ఖతారు చేయకుండా ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో లక్షలాది ఓటర్లను తొలగిస్తున్నారు. అందులో భాగంగా మణిపూర్, ఒడిశాలో ఆదివారం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. మణిపూర్‌లో లక్షకుపైగా ఓట్లు, ఒడిశాలో 20 లక్షలకుపైగా ఓటర్లను తొలిగించారు. మణిపూర్ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) అరుణ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా గణన దశ పూర్తయిందన్నారు. ఆదివారం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో రాష్ట్రంలో 19.34 లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జూన్ 28 నాటికి, మొత్తం 20,93,076 మంది ఓటర్లలో 19,34,399 మంది (అంటే 92.42 శాతం మంది) సర్ ప్రక్రియలో తమ గణన వివరాల ఫారమ్‌లను సమర్పించారని వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం, మణిపూర్‌లో మొత్తం 19,34,399 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 9,40,466 మంది పురుషులు, 9,93,660 మంది మహిళలు, 294 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని సిఇఒ తెలిపారు. బహుళ ప్రదేశాలలో నమోదైన 7,394 మంది ఓటర్లను, మరణించిన 43,000 మంది ఓటర్లను బిఎల్‌ఓలు గుర్తించారని ఆయన తెలిపారు. 1,08,283 మంది ఓటర్లు నివాసం మారడం, బిఎల్‌ఓలకు (బూత్ స్థాయి అధికారులు) అందుబాటులో లేకపోవడం లేదా జూన్ 28 నాటికి వారి వివరాలతో కూడిన నమోదు ఫారమ్‌లు తిరిగి అందకపోవడం వంటి కారణాల వల్ల జాబితా నుండి తొలగించబడ్డారని సిఇఒ తెలిపారు. ఈనెల 5 నుండి ఆగస్టు 4 వరకు జరిగే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల' ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా ఈ ఏడాది సెప్టెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

**ఒడిశా ఓటర్లు 3.13 కోట్లు**

ఒడిశాలో ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే అనంతరం, ఆదివారం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుండి సుమారు 20.14 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఈ ఏడాది మే 30 నుండి జూన్ 28 వరకు జరిగిన ఈ ప్రక్రియ ఫలితంగా, సవరణకు ముందున్న జాబితాలోని 3,33,99,591 మంది ఓటర్ల సంఖ్య, ముసాయిదా జాబితాలో 3,13,87,034కు తగ్గింది. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,60,19,176 మంది పురుషులు, 1,53,65,083 మంది మహిళలు, 2,775 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) ఆర్‌ఎస్ గోపాలన్ తెలిపారు. మొత్తం ఓటర్లలో 93.97 శాతానికి సమానమైన సుమారు 3.13 కోట్ల మంది ఓటర్ల నుండి వివరాల సేకరణ పత్రాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. సవరణ ప్రక్రియలో 8.32 లక్షల మంది (2.49%) ఓటర్లు మరణించినట్లు గుర్తించగా, 10.07 లక్షల మంది (3.02%) నివాసం మారినట్లు లేదా అందుబాటులో లేనట్లు తేలింది. అలాగే, 1.58 లక్షల మంది (0.47%) ఓటర్ల పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఇవి కాకుండా, జూన్ 28 గడువులోగా వివరాల సేకరణ పత్రాలను సమర్పించని 14,000 మంది ఓటర్ల పేర్లు కూడా జాబితా నుండి తొలగించారు. ఈ ఓటర్లు ఇతర రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్లుగా నమోదు కావడం, అక్కడ ఉనికిలో లేకపోవడం, నిర్ణీత సమయంలో పత్రాలు సమర్పించకపోవడం లేదా వివిధ కారణాల వల్ల నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒ) వారిని గుర్తించలేకపోయారని లేదా వారి నుండి పత్రాలను పొందలేకపోయారని గోపాలన్ వివరించారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన సెప్టెంబర్ 2 వరకు కొనసాగుతుందని, తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 6న విడుదల చేయబడుతుందని ఆయన చెప్పారు.

# ఖమేనీకి రెండోరోజు లక్షలమంది నివాళి

## మొజ్తాబా మినహా ముగ్గురు కుమారుల ప్రార్థనలు



**టెహ్రాన్:** ఈ ఏడాది ఆరంభంలో అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో హతుడైన ఇరాన్ అమర నాయకుడు ఆయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ,ఇతర ప్రముఖుల అంత్యక్రియలకు ముందుగా పార్థివ దేహాలవద్ద వరుసగా రెండో రోజు కూడా లక్షలాదిమంది ప్రజలు ప్రార్థనలు నిర్వహించారు. వారికి నివాళులు అర్పించారు. రాజధాని నగరం టెహ్రాన్‌లోని ఇమామ్ ఖమేనీ గ్రాండ్ మొసల్లా హాలులో వారి మృతదేహాలను కూడా సందర్శకులకోసం అక్కడే ఉంచారు. ఖమేనీస్థానంలో దేశ సర్వోన్నత నాయకుడుగా బాధ్యతలు తీసుకున్న మొజ్తాబా ఖమేనీ మినహా ఆయన ముగ్గురు కుమారులు మొస్తాఫా,మసూద్, మైసామ్‌లు టెహ్రాన్‌లో అంతిమ సందర్శనకు సిద్ధం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ముందువరుసలో నిలబడి భౌతిక కాయం వద్ద ప్రార్థనలు చేశారు. యుద్ధం మొదలైన తర్వాత ఈ కుమారులంతా బాహ్య ప్రపంచానికి కనిపించడం ఇదే మొదటి సారి. వారితోపాటు దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,సర్వోన్నత న్యాయాధిపతి ఘోలంహోస్సేన్ మొహ్సేనీ,పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ కూడా ముందువరుసలో ఉండి ప్రార్థనలు చేశారు. ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తుందనే భయాల మధ్య మొజ్తాబా ఖమేనీ తన కన్నతండ్రి అత్యక్రియలకు హాజరుకాలేదు. మొజ్తాబా ఖమేనీని వదిలేదిలేదని, ఆయనను కూడా చంపేస్తామని ఇజ్రాయెల్ సైన్యం యుద్ధ సమయంలో ప్రతిజ్ఞ చేసింది. సోమవారం ఉదయం టెహ్రాన్‌లో అంతిమయాత్రలు ప్రారంభమవుతాయి. మంగళవారంనాడు పవిత్రమైన క్యామ్ నగరంలో ఖమేనీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. బుధవారంనాడు ప్రత్యేకంగా అంతిమ వీడ్కోలు కార్యక్రమం చేపడతారు. గురువారంనాడు ఖమేనీ జన్మస్థలం మస్సాద్‌లో ఖనన ప్రక్రియ పూర్తిచేస్తారు.మూడు దశల్లో ప్రజలు ప్రార్థనలు నిర్వహించారు. మొదట ఖమేనీకోసం, ఆ తర్వాత ఆయన కుమార్తె సయ్యదే బోష్రా ఖమేనీ, అల్లుడు మెస్బా–అల్ హోదా బఖేరీ,మూడేళ్ళ వయసుగల మనుమరాలుతో పాటు కోడలు జహ్రా హద్దాద్ ఆదెల్‌కోసం ప్రార్థనలు నిర్వహించారు.ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో ఖమేనీ సహా ఆయన రెండోభార్యమొజ్తాబా ఖమేనీ తల్లిపాటు ఖమేనీ అల్లుడు, కుమార్తె, మూడు సంవత్సరాలు వయసుగల మనుమరాలు, మొజ్తాబా ఖమేనీ భార్య కూడా మరణించారు. పార్థివదేహాలను ఉంచారు. మొత్తం వారం రోజుల పాటు ఇరాన్‌లో ఈ అంత్యక్రియల కార్యక్రమాలు జులై తొమ్మిదో తేదీ వరకూ కొనసాగుతాయి. ఇరాన్–ఇరాక్‌లలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రాలలో కూడా ఖమేనీ భౌతికదేహాన్ని ఊరేగింపు చేస్తారు.

### సముద్ర భద్రతాముప్పును ఉమ్మడి ప్రతిఘటనకు

# ఉమ్మడి నౌకా విన్యాసాలకు చైనా–రష్యా సన్నద్ధం



**క్వింగ్‌డావో:**అగ్రదేశాలు చైనా–రష్యా ఈ జులై నెలలోనే సంయుక్తంగా నౌకా విన్యాసాలు నిర్వహిస్తాయి. చైనాలోని షాన్‌డాంగ్ రాష్ట్రం క్వింగ్‌డావో సమీపంలో ఉన్న సముద్ర జలాలలో ఈ ఉమ్మడి విన్యాసాలకు ఏర్పాటు చేస్తున్నారు. జాయింట్ సీ–2026 ఉమ్మడి విన్యాసాలు ఈ నెలలోనే జరుగుతాయని చైనా జాతీయ రక్షణమంత్రిత్వశాఖ ఆదివారం ఒక ప్రకటన చేసింది. 'సముద్ర భద్రత ముప్పులకు ఉమ్మడి ప్రతిస్పందన'' అనే పేరుతో మూడు దశల్లో ఈ విన్యాసాలు జరుగుతాయి. సముద్ర భద్రత ముప్పును ఉమ్మడిగా ప్రతిఘటించడం, ప్రాంతీయ,అంతర్జాతీయ శాంతి స్థిరత్వాల పరిరక్షణ,నూతనశకంకోసం చైనా–రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతంగా అమలు చేయడం, ఇరు దేశాల నౌకాబలగాల సామర్థ్యాన్ని, సంకల్పాన్ని ప్రదర్శించడమే లక్ష్యాలుగా ఈ నౌకా విన్యాసాలు నిర్వహిస్తారు.చైనా–రష్యా ఉమ్మడి నౌకా గస్తీ,వాయు రక్షణ విన్యాసాలు, సమన్వయ గస్తీ ఇటీవలికాలంలో సాధారణంగా మారాయి. ఈ విన్యాసాల తర్వాత రెండు దేశాల నౌకాబలగాలు పసిఫిక్ మహాసముద్రంలో సంబంధిత ప్రాంతాలలో ఉమ్మడి గస్తీ కార్యక్రమాలు కూడా చేపడతాయి. భద్రతాపరమైన సవాళ్ళు ఎదుర్కోవడం,ప్రాంతీయ స్థిరత్వం, శాంతి సాధనకు ఇరుదేశాలసైన్యాలమధ్యా కుదిరిన వార్షిక సహకార ప్రణాళికలో భాగంగానే ఈ ఉమ్మడి విన్యాసాలు జరుగుతాయని చైనా మంత్రిత్వశాఖ ప్రకటించింది. రష్యా నౌకల రాకతో క్వింగ్‌డావోలో ఇరు దేశాల నౌకాదళాధికారులు ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా చైనా జలాలలో రష్యా నౌకలకు స్వాగత కార్యక్రమాన్ని కూడా చైనా దళాలు నిర్వహించాయి. రష్యా నౌకా దళానికి చెందిన గైడెడ్ మిస్సైల్ క్రూయిజర్ ఆదివారం ఉదయం పది గంటలకు వరియాగ్ నౌకా రేవుకు చేరుకున్న తర్వాత చైనా దళాలు రష్యా సైనికాధికారులకు స్వాగతం పలికాయి.

# శత్రువును తుత్తునియలు చేస్తాం: ఇరాన్ ఆర్మీ



**టెహ్రాన్:**ఇరాన్ విషయంలో తప్పుడు అంచనాలు వేసి దాడులు చేసే ఎలాంటి శత్రువునైనా యుద్ధంలో తుత్తునియలు చేస్తామని ఇస్లామిక్ రిపబ్లిక్ సైన్యాధిపతి బ్రిగేడియర్ జనరల్ మొహమ్మద్ అక్రమినియా హెచ్చరిక చేశారు. ఒక వైపు దేశంలో ఖమేనీతోపాటు మరణించిన ఆయన కుటుంబ సభ్యులు,ఇతర ప్రముఖులకు అంత్యక్రియల ప్రక్రియ జరుగుతున్న సమయంలో వారం రోజులపాటు విరామం పాటించామని ట్రంప్ చేసిన ప్రకటనకు ప్రతిగా అక్రమినియా పైవిధంగా స్పందించారు. ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినాగానీ,ఇరాన్ సైన్యం నుండి అత్యంత బలమైన,నిర్ణయాత్మకమైన ప్రతిఘటన ఉంటుందని అన్నారు.టెహ్రాన్‌లోని మొసల్లాలో ఖమేనీ,ఆయన కుటుంబ సభ్యులకు నివాళులు అర్పించిన తర్వాత అక్రమినియా మాట్లాడుతూ ఈ యుద్ధ విరామ సమయంలో ఇరాన్ తన సైనిక బలగాలను బలోపేతం చేసే ప్రక్రియను నిరంతరంగా కొనసాగిస్తోందని చెప్పారు.

# ప్రజలు ఖమేనీని ద్వేషిస్తారనుకున్నా: ట్రంప్



**వాషింగ్టన్:**ఇరాన్ ప్రజలు అమరుడైన పాలకుడు అలీ ఖమేనీని ద్వేషిస్తారని తాను భావించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల పార్థివ దేహాలకు నివాళులు,అంతిమ యాత్ర కార్యక్రమాలు వారం రోజులపాటు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో ట్రంప్ ఆక్సియోస్ న్యూస్ వెబ్‌సైట్ ప్రతినిధితో ఆదివారం మాట్లాడుతూ, ''ఒక్కదెబ్బతో ఇరాన్ నాయకత్వాన్ని నిర్మూలించగల శక్తిసామర్థ్యాలు అమెరికాకు ఉన్నాయి,వారందరూ ఇప్పుడు అక్కడే ఉన్నారు,ఒకేసారి వారందరినీ ఏరివేయగలం,కానీ మేం అలా చేయబోము.ఎందుకంటే చర్చలు జరపడానికి ఆ దేశంలో ఇక నాయకుడంటూ ఎవరూ మిగలరు,అందుకే అలా చేయడంలేదు,చర్చలు జరుపుతామని వారు అమెరికాను వేడుకుంటున్నారు, ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తయ్యేవరకూ ఇరుపక్షాలు ఈ కార్యక్రమాల నిమిత్తం వారం రోజులపాటు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు.ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్‌లో పతాకస్థాయికి చేరిన ప్రజల తిరుగుబాటు సమయంలో, ఆ దేశంలో కొత్త ప్రభుత్వం రెజా పహ్లావీ నాయకత్వంలో ఏర్పడుతుందని, ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ కుప్పకూలిపోతుందని ట్రంప్‌తోపాటు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా చాలా గట్టిగా ఒక నిర్ణయానికి వచ్చేశారు. కానీ వారి ఊహలన్నీ తలక్రిందులయ్యాయి. ఇప్పుడు యుద్ధం తర్వాత ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాన్ని పరిశీలిస్తే మొజ్తాబాఖమేనీ వెనుకే ప్రజలు చేరినట్లు స్పష్టంగా కనిపిస్తున్న పూర్వరంగంలో ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. ఫిబ్రవరిలో అమెరికా–ఇజ్రాయెల్ చేసిన ఉమ్మడి దాడిలో ఖమేనీ సహా ఆయన కుటుంబ సభ్యులు మరణించారు. ఇస్లామిక్ న్యాయశాస్త్రం ప్రకారం 24 గంటల్లో మరణించిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించాలి. కానీ యుద్ధ పరిస్థితుల కారణంగా అంత్యక్రియలను నాలుగు నెలల తర్వాత నిర్వహిస్తున్నారు. అమెరికాలో 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలోనే ఈ అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ భావించింది. ఈ ప్రక్రియ తర్వాత వచ్చేగురువారం ఖమేనీ ఖననం క్రియ పూర్తవుతుంది.

# ఇరాన్ ప్రజలు ఖమేనీ కోసం దుఃఖించడంలేదు

## ప్రవాస యువరాజు రెజాపహ్లావీ



**వాషింగ్టన్:**ఇరాన్ ప్రజలు లక్షలాదిమంది ఒక వైపు ఖమేనీకి నివాళులు అర్పిస్తూ దుఃఖిస్తుంటే, తమ ప్రజలు హత్యకు గురైన ఖమేనీకోసం దుఃఖించడంలేదని, ఆయన అణచివేతకు గురై ప్రాణాలు కోల్పోయిన వేలాదిమంది తమ కుమారులు,కుమార్తెలకోసం దుఃఖిస్తోందని అమెరికాలో ప్రవాసజీవితం గడుపుతున్న మాజీ యువరాజు రెజా పహ్లావీ వ్యాఖ్యానించారు. వారం రోజులపాటు ఇరాన్‌లో అంత్యక్రియల ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఆదివారం ఎక్స్‌వేదికగా ఆయన స్పందిస్తూ, అలీ ఖమేనీ గడచిన జనవరినెలలో హక్కులకోసం ఆందోళన చేస్తున్న వేలాదిమంది దేశ ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ఆదేశాలు జారీ చేశారని, ఈ కారణంగా వేలాదిమంది మరణించారని, ప్రజలు ఇప్పుడు వారికోసమే దుఃఖిస్తున్నారని పేర్కొన్నారు.ఘాలిబాఫ్, ఆయన యంత్రాంగం గడచిన జనవరిలో అణచివేత చర్యలకు పాల్పడ్డారని, ఈ అణచివేత కాల్పుల్లో 40,000 మంది మరణించారని, ఇరాన్ ప్రజలు వారికోసం దుఃఖిస్తున్నారని రెజా పహ్లావీ వ్యాఖ్యానించారు. ఇది జాతీయ దుఃఖం కాదని, ధర్మబద్ధమైన ఆగ్రహమని అన్నారు.దీనికోసం పాలకులు ప్రజా ధనాన్ని ఖర్చుచేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశాల నుండి ఒక్క ప్రజా నాయకుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదని పేర్కొన్నారు. వారి నేరపూరిత పాలను ప్రజల ధర్మాగ్రహం కూల్చివేస్తుందన్నారు. తమ ప్రజలను గూఢచారి వర్గాల ద్వారా రెచ్చగొట్టారని అమెరికా–ఇజ్రాయెల్‌పై ఇరాన్ పాలకులు తీవ్ర విమర్శలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ బాహాటంగానే ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని ప్రకటించారు. ప్రజల తిరుగుబాటుకోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఇస్లామిక్ రాజ్యాన్ని ప్రజా తిరుగుబాటు ద్వారా కూల్చివేసి రెజా పహ్లావీకి దేశాధికారం కట్టబెట్టాలని అమెరికా–ఇరాన్‌లు బాహాటంగానే ప్రకటనలు చేశాయి. కానీ ఇరాన్ పాలకులు సమర్థవంతంగా తిరుగుబాటును అణచివేశారు. ఆ తర్వాత యుద్ధం మొదలైంది.

### ప్రధానమంత్రి రాజీనామా కోరుతూ 35వ రోజూ..

# ఆల్బేనియాలో వేలాదిమంది భారీ ర్యాలీ



**తిరానా:**యూరప్ ఆగ్నేయప్రాంత దేశం ఆల్బేనియాలో వరుసగా 35వ రోజు రాత్రి కూడా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. వేలాదిమంది ప్రజలు సముద్రాన్ని తలించే విధంగా వీధుల్లోకి వచ్చి ప్రధానమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ''ఆల్బేనియా అమ్మకానికి లేదు'' అని నినాదాలు చేశారు. ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు ''పింక్ ఫ్లెమింగో విప్లవం'' అని పేరు పెట్టారు. ప్రధానమంత్రి ఎ.డి.రామాకు వ్యతిరేకంగా నీలంరంగు బెలూన్లు ప్రదర్శించారు. సిమ్మెంటుతో తయారు చేసిన కేసులు తెచ్చి హ్యాపీ బర్త్ డే రామా అని వ్యంగ్యంగా నినాదాలు చేశారు. 1991ఫిబ్రవరిలో నియంత ఎనవ్ హోక్సా విగ్రహాన్ని ప్రదర్శకులు ఆనాడు కూల్చివేసిన విధంగానే ఒక నిలువెత్తు ప్రధానమంత్రి రామా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రదర్శకులు ఆ తర్వాత దానిని తాళ్ళతో కట్టి నేలకూల్చివేశారు. పోలీస్ స్టేషన్ కిటికీలను ప్రదర్శకులు ధ్వంసం చేశారు.ఆల్బేనియా సముద్రతీర ప్రాంతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబానికి సంబంధించిన ఒక విలాసవంతమైన రిసార్టు ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. ఆల్బేనియా దేశ ప్రధానమంత్రి ఎ.డి.రామా తన పదవికి రాజీనామా చేయాలని, ఆయన స్థానంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తూ ఈ నిరసన కొనసాగిస్తున్నారు. దేశ రాజ్యాంగంలో సంస్కరణలు తీసుకురావాలని, అవినీతిని అంతం చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి కూడా ప్రదర్శనలు కొనసాగించారు. డోనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్‌కు ఆల్బేరియా సముద్రతీరంలో నిర్మించే విలాసవంతమైన రిజార్టుతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని, ఈ కేటాయింపులలో అవినీతి చోటుచేసుకుందని ప్రదర్శకులు విమర్శిస్తున్నారు.తిరానా ప్రధాన రహదారిలో స్కాందర్‌బేగ్ స్క్వేర్ దిశగా 10,000 మంది ప్రదర్శకులు భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రంప్ అల్లుడు కుష్నెర్ ప్రమేయం ఉండటంతో ఈ వార్తకు అంతర్జాతీయ ప్రాధాన్యత ఏర్పడింది.




# సాధ్యం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే ప్రస్తుతం ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీరు, తాగు నీరుకు ఎంతో ఉపయోగపడి ఉండేవన్నారు. ఇప్పుడు ఆ వ్యక్తులు కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి నీటిని ఎత్తి పోయాలనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపు హౌస్ నుండి అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని స్పష్టం చేశారు. మెడిగడ్డతోపాటు ఈ రెండు బ్యారేజీలు పునాదుల నిర్మాణం, వాటి పట్టిష్టత పైనే ఎన్‌డిఎస్‌ఎతో పాటు నీటిపారుదల రంగ నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఒక వేళ మరమ్మతులు చేపట్టకుండా ప్రాజెక్టులను నింపితే అవి తెగిపోయి దిగువ ఉన్న 44 గ్రామాలతోపాటు భద్రాచలం పట్టణం, రాముడి ఆలయం కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇదే బిఆర్‌ఎస్ నాయకులు కోరుకుంటున్నారా అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు.

**2027 అగస్టు నాటికి అందుబాటులోకి కాళేశ్వరం**

లక్ష కోట్ల ఖర్చుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తేచ్చేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఎన్‌డిఎస్‌ఎ సలహాలు, సూచనల మేరకు అన్ని రకాల పరీక్షలను పూర్తి చేశామని తెలిపారు. వర్షాకాలంలో వరదలు తగ్గుముఖం పట్టి వెంటనే మూడు బ్యారేజీల పునర్ నిర్మాణం పనులను పూర్తి చేసి 2027 ఆగస్టు నాటికి నీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. నిపుణుల అంచనా ప్రకారం మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఈ చివర నుండి ఆ చివర వరకు సరికొత్తగా దయాఫ్రమ్ వాల్ నిర్మాణంతో పాటు బ్యారేజీల దిగువన నీటి ఉధృతిని తట్టుకునేలా స్టిల్లింగ్ బేసిన్‌ను విస్తరించి, మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి సంబంధించి డిపిఆర్ సిద్ధం అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంతర్ రాష్ట్ర జల ఒప్పందంలో భాగంగా త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లనున్నామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల రంగ సలహాదారు పరిషిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్‌లు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునర్ నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న టెస్టింగ్ పనులు, పరీక్షలకు సంబంధించి వివరాలను పవర్ పాయింట్ ప్రంజెటేషన్ ద్వారా వివరించారు.

# రోడ్డు ప్రమాదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలీవిధంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు చెందిన బివివి ప్రసాద్ (45) కుటుంబ సభ్యులతో కలిసి చెన్నై నుండి హైదరాబాద్‌కు వెలుతున్నారు. పెద్దకాపర్తి గ్రామ శివారులోని చెరువు కట్ట సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపే వెలుతున్న ఒక ప్రైవేట్ బస్సు అతి వేగంగా వెనుక నుండి ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న బివివి ప్రసాద్ భార్య విజయలక్ష్మి(42), కూతురు శ్రీయ(17), ప్రభవ్ (11)లతో పాటు వీరితో ప్రయాణిస్తున్న కుటుంబ మిత్రుడు శ్రీకర ప్రసాద్(62)లు అక్కడికక్కడే మృతి చెందారు. బివివి ప్రసాద్‌ను నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటికి తీసేందుకు జెసిబి, గ్యాస్ కట్టర్‌లను ఉపయోగించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టు మార్టం కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సందర్శించి సంఘటనా వివరాలను సిఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

కాగామిర్యాలగూడ పట్టణ పరిధిలోని నందిపాడు చౌరస్తా వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను ఒక కంటైనర్ లారీ బలంగా ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వాటర్ ట్యాంక్ తండాకు చెందిన కమ్లి, సక్రు అనే దంపతులు ద్విచక్ర వాహనంపై నందిపాడు చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన ఒక కంటైనర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు భార్య కమ్లి(55) రోడ్డుపై పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భర్త సక్రును స్థానికులు తక్షణమే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘోర ప్రమాదంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితురాలి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, బంధువులు అద్దంకినార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై మృతదేహంతో ధర్నాకు దిగారు. ఆందోళన కారణంగా రహదారికి ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళన కారులతో చర్చలు జరిపి జోక్యం చేసుకోవడంతో స్థానికులు ఆందోళనను విరమించారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా ఈ ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో కమ్లి మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, అనంతరం ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న ఆమె భర్త సక్రును పరామర్శించారు. బాధితుడికి మెరుగైన, అత్యున్నత వైద్య సహాయం అందించాలని అక్కడి వైద్యులను ఆదేశించారు.

# రూ.10 లక్షలు ఎంపి నిధులు

(మొదటి పేజీ తరువాయి)

తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఆయన వివరించారు. సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం హైదరాబాద్‌లో సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ్రమం నడుస్తుందని రాష్ట్ర విభజన తరువాత ఎపిలో మొదటగా కడప జిల్లాలో ఈ సిఆర్ ఫౌండేషన్ అందుబాటులోకి వచ్చిందని దీనికి మూలం మాచిరెడ్డి దంపతుల ధాతృత్వమే అన్నారు. సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాచిరెడ్డి దంపతుల ధాతృత్వం ఎపిలో సిఆర్ ఫౌండేషన్‌కు పునాది లాంటిదని దీని ఆధారం చేసుకొని రాష్ట్రంలో గూడురు, గుంటూరు కేంద్రాలలో సిఆర్ ఫౌండేషన్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని త్వరలో దాని కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గుంటూరులో ఒక దాత ఎకరం తన సొంత భూమిని ఫౌండేషన్‌కు ఇవ్వగా గుంటూరులో నాగేశ్వరరావు అనే వ్యక్తి నాలుగు ఎకరాలు సీఆర్ ఫౌండేషన్‌కు ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు ఆయన వివరించారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మంచి వాతావరణంలో జీవని వృద్ధాశ్రమాన్ని 2022లో ప్రారంభించడం జరిగిందని లెక్చరర్‌గా పనిచేస్తున్న మాచిరెడ్డి సంజీవమ్మ, ఆమె భర్త టక్కోలి మాచిరెడ్డి ఆలిండియా రేడియోలో విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ చేసి వారికి వచ్చిన బెనిఫిట్స్‌తో ఇంతపెద్ద సామ్రాజ్యం లాంటి శరణాలయాన్ని ఏర్పాటు చేసి ఫౌండేషన్‌కు ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ మాచిరెడ్డి దంపతులు నా చిన్నతనం నుంచి కూడా వారిని ఆదర్శ భావాలతోనే చూశానని వారి దగ్గర జీవితానికి సంబంధించిన విలువలను నేర్చుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు, సిపిఐ కడప జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కార్యదర్శులు మురళి, మహేష్, జనార్ధన్, శివారెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.వలరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి, సిపిఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, బాదుల్లా, గుంటి వేణుగోపాల్‌తో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోన్ సంభాషణ

(మొదటి పేజీ తరువాయి)

అదేసమయంలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ట్రంప్‌తో ఫోన్ సంభాషణ చేశారు. పుతిన్ కూడా తన సంభాషణల్లో ఉక్రేన్‌లో పరిస్థితుల గురించి చర్చించారని ఇతర వార్తాసంస్థలు తెలియజేశాయి. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చొరవ చూపించారు. త్వరలో సమావేశం కూడా నిర్వహించాలనే అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి.

# తదుపరి చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 21న సాంకేతిక చర్చలు జరిగాయి. హోర్ముజ్ జలసంధిని తెరిచే విషయంలో, కొత్త జలమార్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరగడంతో ఇరాన్ ఆగ్రహించింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు రెండు దేశాలమధ్యా పరస్పర దాడులు జరిగాయి. ఆ తర్వాత మళ్ళీ ఒక ఒప్పందానికి వచ్చి దాడులు విరమించుకుని దోహాలో ఒకరోజు ఖతార్ మధ్యవర్తిగా పరోక్ష చర్చలు జరిపాయి. ఖమేనీ అంత్యక్రియలు పూర్తయ్యేవరకూ విరామం ఇవ్వాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఈ చర్చలు జరపడానికి స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్టు కూడా అందుబాటులో ఉంది. కానీ ఈసారి ఇస్లామాబాద్‌లోనే చర్చలు జరగడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పాకిస్థాన్ పత్రిక తెలియజేసింది. సంభాషణలు ఎక్కడ జరుగుతాయన్న విషయంపై ఇంకా ఒక స్పష్టత రాలేదు.

# సోషల్ ఆడిట్

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోవడం తోపాటు ఉపాధ్యాయుల సహకారం, విధి నిర్వహణ వంటి అంశాల్లో కూపీ లాగుతున్నారు. ఇక పిల్లలతో కూలంకుషంగా మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ బృందాలు పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయులు చదువులు చెప్పే విషయం, నేర్పించే తీరు, మధ్యాహ్న భోజన పథకం, పరిసరా పరిశుభ్రత, డ్రిల్, మౌళికసదుపాయాలు, మంచి నీటి వసతి వంటి అంశాలను అడిగి తెలుసుకుని రికార్డు చేసుకుంటున్నారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేస్తుందా, లేక దుర్వినియోగం చేస్తుందా అనే అంశాలను ప్రత్యేకంగా రికార్డు చేస్తున్నారు. గ్రాంట్‌లు, ఫండ్స్, క్యాష్‌బుక్ తదితర అంశాలను నిశితంగా చూస్తున్నారు.

కేంద్ర సోషల్ ఆడిట్ బృందాలు ఇప్పటికే ఇల్లాలో మూడు మండలాల్లో పర్యటించింది. అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందు, సుజాతనగర్ మండలాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. ప్రతీ అంశాన్ని ఖచ్చితత్వంతో చూస్తున్న బృంధాలు నివేదికలు తయారు చేసి కేంద్రానికి పంపించనున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోని బడుల్లో ఈ సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏ రోజు ఏ బడి వెళతారో చెప్పరు కానీ ఆకస్మికంగా పర్యటించి అప్పటి ప్రస్తుత పరిస్థితులను కూడా పరిగణలోనికి **తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.**

**త్వరలో అకడిమిక బృందాలు :** విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు విద్యాశాక మరోసారి అకడమిక్ బృందాల ఏర్పాటను కొనసాగించనుంది. ఈ అకడమిక్ బృందాలు త్వరలో జిలాల్లో పర్యటించనున్నాయి. ఇప్పటికే కేంద్ర సోషల్ ఆడిట్ బృందాల పర్యటన సాగుతుండగా మరో సారి అకడమికి తనిఖీ బృందాలు రానుండటంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రైమరీ స్కూళ్లకు 8 బృందాలు, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు 2, హైస్కూళ్లకు 2 కలిపి మొత్తం 12 బృందాలు జిల్లాలో పర్యటించనున్నాయి. ఇప్పటికే దాదాపుగా బృందాల ఏర్పాటు పూర్తయినట్లు తెలుస్తోంది. ఇందులోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిత్యం తనిఖీల్లోనే ఉండాల్సి ఉంటుంది. ఇలాంటి క్రమంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసేందుకు ఇప్పటికే డిఇఓలు ఆర్డర్లు తయారు చేశారు.

**జిల్లాలో విద్యాశాఖ పరిస్థితి ఇది : జిల్లాలో 1079** బడులున్నాయి. చాలా బడుల్లో మౌళిక సదుపాయాలు కరువే. జిల్లాలో ఇంకా 707 ఉపాధ్యా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పది మంది కంటే తక్కువ విద్యార్థులున్న బడులు 97, ఒకే విద్యార్థి, ఒకేఒక్కటీచర్ ఉన్నవి 9, 384 బుడల్లో వంట షెడ్లే లేవు. ఆట స్థలాలు చాలా వరకు లేవు, కనీసం మరుగుదొడ్లు లేని పాఠశాలలు 37 ఉ ండగా చాలా బడుల్లో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. మౌళిక సదుపాయా కల్పనకు కలెక్టర్ ఈ మధ్య కాలంలో 19 లక్షల 50 వేల నిధులు విడుదల చేశారు. ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ప్రహరీ గోడలు లేని బడులు 237, సగం ప్రహరీ కోడ ఉన్నవి 136 ఉన్నాయి.

# అమలు పర్చండి

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బిఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తీసుకున్న నిర్ణయాలు వేగంగా అమలై, మెట్రో ఫేజ్1 స్వాధీనం ప్రక్రియ పూర్తికావడంతో పాటు మెట్రో ఫేజ్2 విస్తరణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు వీలు కలుగుతుందని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి ఈ ఇద్దరు మంత్రులకు వేర్వేరుగా లేఖలు రాశారు. ఇటీవల జూన్ 23, 24 తేదీలలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి లేఖలలో గుర్తు చేశారు. ఆ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం మెట్రో ఫేజ్1 ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్ వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, ఫేజ్2 విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బిఐ క్యాప్స్‌ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు రాసిన లేఖలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఫేజ్1పై ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే (రిఫైనాన్సింగ్) అవకాశాలను కూడా ఎస్‌బిఐ క్యాప్స్ పరిశీలించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఓఆర్) ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బిఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌బిఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని, ఒక వేళ ఆలస్యమైతే, ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే ప్రమాదముందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఫేజ్1 ప్రాజెక్టు విలువ నిర్ధారణ, రుణాల పునర్వ్యవస్థీకరణ, ఫేజ్2 నిధుల సమీకరణ వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించే విధంగా టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఓఆర్) రూపొందించాలని కేంద్రాన్ని సిఎం కోరారు. ఈ ప్రక్రియ సమన్వయం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించిందని కూడా లేఖలో తెలిపారు. ఫలితంగా మెట్రో ఫేజ్1ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో అనిశ్చితి నెలకొనడంతో పాటు మెట్రో రోజువారీ నిర్వహణలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిఎం వివరించారు. ఎస్‌బిఐ క్యాప్స్ నియామకం ఆలస్యం కావడం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు (డిపిఆర్) కేంద్ర అనుమతులు రావడం మరింత ఆలస్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ముందుకు సాగడం లేదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దీంతో ప్రాజెక్టు అమలు వాయిదా పడుతుండగా, కాలయాపన కారణంగా నిర్మాణ వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ విషయంపై వెంటనే దృష్టి సారించాలని విన్నవించారు.

**వ్యక్తిగతంగా జోక్యం చేసుకోండి**

'హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలి. హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. కేంద్ర పెద్దలతో మాట్లాడండి. ఫేజ్2కు వెంటనే ఆమోదం ఇవ్వాడానికి సహకరించండి. ఫేజ్1ను తెలంగాణకు అప్పగించే ప్రక్రియ వేగవంతానికి కృషి చేయండి' అని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టు ఇకపై మరింత ఆలస్యం కాకుండా చూడాలని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రైల్వే శాఖలతో స్వయంగా మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగర అభివృద్ధికి మెట్రో రైలు విస్తరణ అత్యంత కీలకమని, కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని సిఎం తన లేఖలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రత్యేకంగా అభ్యర్థించారు.

# ముక్కోణపు వన్డే సిరీస్ విజేత భారత-'ఎ'

పది వికెట్లతో చెలరేగిన బ్రార్..
అనధికారిక టెస్టు సిరీస్
కొల్లగొట్టిన ఇండియా-ఎ




అనధికారికి టెస్టు సిరీస్‌ను భారత్– 'ఎ' కొల్లగొట్టింది. శ్రీలంక–ఎతో జరిగిన రెండో అనధికారిక టెస్టులో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(168) భారీ శతకంతో చెలరేగగా.. గుర్నూర్ బ్రార్(4–77, 6–68) పది వికెట్లతో రెచ్చిపోయాడు. లోయరార్డర్ రాణించగా నాలుగో రోజు భారత్– 'ఎ' అదిరే విక్టరీ కొట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో 541 రన్స్‌చేసిన భారత్ నాలుగో రోజు విజేతగా ప్రకటించారు. దాంతో, ఆతిథ్య జట్టు మరో ట్రోఫీని కోల్పోయింది. శ్రీలంక పర్యటనలో జోరు చూపించిన భారత్– 'ఎ' జట్టు అనధికారిక టెస్టు సిరీస్‌ను పట్టేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్(168) వరసగా రెండో శతకంతో కదం తొక్కగా గుర్నూర్ బ్రార్(4–77, 6–68) వికెట్ల వేటతో లంక–ఎ టీమ్‌ను భయపెట్టాడు. ఓవర్ నైట్ స్కోర్ 541/8తో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మరో రెండు పరుగులకే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం ఆట మొదలెట్టిన లంకను గుర్నూర్ ఆదిలోనే దెబ్బకొట్టాడు. గుర్నూర్ విజృంభణతో టాపార్డర్ కుప్పకూలింది. ఓపెనర్ సోహన్ డె లివెరా(2)ను వెనక్కి పంపిన బ్రార్.. నువనిందు ఫెర్నాండో(5), అషెన్ బండార(5)లను పెవిలియన్ చేర్చి లంకను చావుదెబ్బ తీశాడు. సరాన్ష్ జైన్ రెండు వికెట్లతో రాణించగా 209పరుగులకే ఆతిథ్యజట్టు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్లో అజేయంగా 39 రన్స్ చేసిన భారత్– 'ఎ' 10 వికెట్ల విజయంతో ట్రోఫీని అందుకుంది. తొలి ఇన్నింగ్స్లో శ్రీలంకఏ బ్యాటర్లను భారత్–'ఎ' బౌలర్లు గొప్పగా కట్టి చేశారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగా(127) శతకం బాదినా.. మిగతా బ్యా టర్లను క్రీజులో నిలవనీయలేదు. గుర్నూర్‌బ్రార్(4–77), సరాన్ష్ జైన్ నాలుగేసి వికెట్లు తీయగా.. ఆతిథ్య లంక 366 పరుగులకే ఆలౌటైంది. భారత్–'ఎ' బౌలర్లలో యశ్ ఠాకూర్ రెండు వికెట్లతో రాణించాడు.

## పరాగ్వేపై ఫ్రాన్స్, కెనడాపై మొరాకో ఘనవిజయం





ఫిఫా వరల్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించిన ఫ్రాన్స్, మొరాకో జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లోకి అధికారికంగా అడుగుపెట్టాయి. అమెరికాలోని ఫాక్స్బరో స్టేడియంలో జరగబోయే ఈ ప్రతిష్టాత్మక పోరులో ఈ రెండు జట్లు సెమీఫైనల్ బెర్త్ కోసం తలపడనున్నాయి. రౌండ్ ఆఫ్ 16 ఉత్కంఠభరిత పోరులో పరాగ్వేపై ఫ్రాన్స్ 1–0 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ 70వ నిమిషంలో ఫ్రాన్స్ జట్టు కెప్టెన్ కైలియన్ ఎంబాపే పెనాల్టీ ద్వారా అందించిన ఏకైక గోల్ ఆ జట్టును క్వార్టర్స్ చేర్చింది. మరోవైపు టోర్నమెంట్ సహఆతిథ్య దేశమైన కెనడాను మొరాకో పూర్తిగా ఏకపక్షంగా ఓడించింది. మొరాకో ఆటగాడు ఉనాహి రెండు అద్భుతమైన గోల్స్ చేయగా, రహిమి మరో గోల్ జోడించి 3–0తో జట్టుకు ఘన విజయాన్ని అందించారు.

## కేన్స్‌లో మెరిసిన జిమ్నాస్ట్ అంజన రిబ్బన్ విభాగంలో స్వర్ణం

ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరుగుతున్న 4వ లిటిల్ స్టార్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్ 2026లో భారత జిమ్నాస్ట్ అంజన గునుకుల స్వర్ణ పతకం సాధించింది. హైదరాబాద్ మణికొండలోని జోయ్ జిమ్నాస్టిక్స్ అకాడమీకి చెందిన అంజనా రిబ్బన్ ఈవెంట్లో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. అంతర్జాతీయ వేదికపై పసిడి వెలుగులు విరజిమ్మిన అంజన మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. కేన్స్‌లో జులై 3వ తేదీ నుంచి జరుగుతున్న 4వ లిటిల్ స్టార్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్ 2026లో అంజన గునుకుల సత్తా చాటింది. రిబ్బన్ ఈవెంట్‌లో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి పసిడి పతకం కొల్లగొట్టింది. ఈ పోటీల్లో జోయ్ జిమ్నాస్టిక్స్ అకాడమీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.




# ఆరోగ్యం



## 'బి 7' తొలిగిస్తే..

బయోటిన్‌గా ప్రసిద్ధి చెందిన విటమిన్ 'బి 7'ను తొలగిస్తే, కేన్సర్ కణాల వృద్ధి తగ్గుతుందా? ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఈ విషయంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. 'బి 7' నీటిలో కరిగే విటమిన్. శరీరంలో శక్తి ఉత్పత్తి, కొవ్వులు, కార్బోహైడ్రేట్ల జీవక్రియ, అలాగే అనేక కీలక ఎంజైమ్‌ల పనితీరులో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సరళంగా చెప్పాలంటే, శరీరం ఆహారాన్ని శక్తిగా మార్చుకునే ప్రక్రియలో బయోటిన్ ఒక అవసరమైన భాగం. ఇటీవల జరిగిన ప్రయోగశాల పరిశోధనలు బయోటిన్‌కు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెలుగులోకి తెచ్చాయి. కేన్సర్ కణాలు సాధారణ కణాల కంటే భిన్నంగా ప్రవర్తిస్తాయి. తక్కువ ఆక్సిజన్, పరిమిత పోషకాలు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా అవి తమ జీవక్రియను మార్చుకుని జీవించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ అనుకూలతే వాటి మనుగడకు ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ నేపథ్యంలో బయోటిన్ అందుబాటు తగ్గితే కొన్ని రకాల కేన్సర్ కణాలు శక్తిని సమర్థంగా ఉత్పత్తి చేయలేకపోవడం, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించడంలో విఫలమవడం వంటి లక్షణాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఫలితంగా ఆ కణాలు బలహీనపడే అవకాశం కనిపించింది. అయితే ఈ ఫలితాలను అతిగా అర్థం చేసుకోవడం సరికాదు. ఇవన్నీ ఇప్పటివరకు ప్రయోగశాల స్థాయిలో మాత్రమే గమనించిన విషయాలు. ఇది కేన్సర్‌కు నిరూపితమైన చికిత్స కాదు. అలాగే ఆహారంలో బయోటిన్‌ను తగ్గిస్తే కేన్సర్ తగ్గుతుందనే భావన పూర్తిగా తప్పు. బయోటిన్ శరీరానికి అవసరమైన పోషక పదార్థం కావడంతో, వైద్యుల సలహా లేకుండా దానిని తగ్గించడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఈ పరిశోధన ప్రాధాన్యం మరో అంశంలో ఉంది. కేన్సర్ కణాలను నేరుగా నాశనం చేయడం మాత్రమే కాకుండా, అవి జీవించడానికి అవసరమైన జీవరసాయన ప్రక్రియలను లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆలోచనకు ఇది బలం చేకూరుస్తోంది.

## మెదడుపై గట్ మైక్రోబయోటా ప్రభావం?



గట్ మైక్రోబయోటాగా పేర్కొనే మన పేగుల్లో నివసించే సూక్ష్మ జీవులు మెదడు నేర్చుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేయగలవా? అనే ప్రశ్నపై ఇప్పుడు విస్తృత చర్చ జరుగుతున్నది. శాస్త్రవేత్తలు ఎలుకలపై చేసిన అధ్యయనంలో చిన్న వయస్సు ఎలుకల గట్ మైక్రోబయోటాను పెద్ద వయస్సు ఎలుకలకు బదిలీ చేశారు. ఆశ్చర్యకరంగా, పెద్ద ఎలుకల మెదడులో సాధారణంగా బాల్యంలో మాత్రమే కనిపించే ఒక ప్రత్యేకమైన న్యూరోప్లాస్టిసిటీ (మెదడు తనను తాను మార్చుకునే, కొత్త అనుభవాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకునే సామర్థ్యం) మళ్లీ చురుకుగా మారింది. ఈ సామర్థ్యాన్ని ఒక్యులర్ డామినెన్స్ ప్లాస్టిసిటీ (ఓడిపి) అంటారు. ఇది ముఖ్యంగా మెదడులోని దృశ్య ప్రాసెసింగ్ కేంద్రంలో కనిపిస్తుంది. చిన్న పిల్లలలో ఈ ప్లాస్టిసిటీ చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు కొత్త విషయాలను వేగంగా నేర్చుకోగలుగుతారు. కానీ వయస్సు పెరిగే కొద్దీ ఈ లెర్నింగ్ విండో క్రమంగా మూసుకుపోతుంది. ఈ అధ్యయనం ప్రకారం, చిన్న వయస్సు ఎలుకల గట్ సూక్ష్మ జీవులు పెద్ద ఎలుకల మెదడులో ఈ నేర్చుకునే సామర్థ్యాన్ని కొంతవరకు తిరిగి తెరవగలిగాయి. అంతేకాకుండా, చిన్న వయస్సులో గట్ మైక్రోబయోటాను దెబ్బతీసినపుడు దృశ్యకేంద్రం అభివృద్ధి కూడా సరిగా జరగలేదని పరిశోధకులు గుర్తించారు. అంటే, పేగులలోని సూక్ష్మ జీవులు మెదడు అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని సూచిస్తోంది. అయితే దీనిని అతిశయోక్తిగా అర్థం చేసుకోవద్దు. ఈ పరిశోధన మనుషులపై కాదు, ఎలుకలపై మాత్రమే జరిగింది. అలాగే ఇది ఇంకా ప్రీప్రింట్ అధ్యయనం మాత్రమే. అంటే ఇతర శాస్త్రవేత్తల సమీక్ష పూర్తికాలేదు. అయినప్పటికీ, ఈ ఫలితాలు గట్ బ్రెయిన్ యాక్సిస్ అనే భావనకు మరింత బలం చేకూరుస్తున్నాయి. పేగుల సూక్ష్మ జీవులు రోగనిరోధక వ్యవస్థ, జీవక్రియలు, జన్యు కార్యకలాపాలు, అలాగే మెదడు పునర్నిర్మాణ సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేయవచ్చని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ ఫలితాలు ధృవీకరించబడితే, ప్రత్యేక ప్రోబయోటిక్స్, ఆహార మార్పులు లేదా నియంత్రిత మైక్రోబయోమ్ చికిత్సల ద్వారా కొన్ని నాడీ సంబంధిత వ్యాధులలో మెదడు ప్లాస్టిసిటీని మెరుగుపరచే అవకాశాలు తెరుచుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇది ఒక ఆశాజనకమైన శాస్త్రీయ సంకేతం మాత్ర మే, వైద్యపరంగా నిర్ధారిత చికిత్స కాదు.

## 'డాండెలియన్'తో కేన్సర్‌కు చెక్!

డాండెలియన్ రూట్ గురించి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వెబ్‌సైట్లలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ సాధారణ అడవి మొక్క కేన్సర్‌కు అద్భుతమైన పరిష్కారమని, భవిష్యత్తులో చికిత్సా విధానాన్ని పూర్తిగా మార్చేస్తుందని కొందరు పేర్కొంటున్నారు. అయితే, ఇలాంటి వార్తలను వాస్తవ శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించడం అవసరం. డాండెలియన్ అనేది పసుపు రంగు పువ్వులు పూసే సాధారణ మొక్క. అనేక ప్రాంతాల్లో దీనిని కలుపు మొక్కగా భావించినప్పటికీ, సాంప్రదాయ మూలికా వైద్యంలో దీని వేరును చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రయోగశాల పరిశోధనల్లో డాండెలియన్ రూట్ ఎక్స్‌ట్రాక్ట్‌ను కొన్ని రకాల కేన్సర్ కణాలపై పరీక్షించగా, 48 గంటల్లోనే అనేక కేన్సర్ కణాలు ప్రభావితమైనట్లు గుర్తించారు. అదే సమయంలో ఆరోగ్యకరమైన కణాలు పెద్దగా దెబ్బతినకపోవడం పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా కీమోథెరపీ వంటి చికిత్సలు కేన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో డాండెలియన్ రూట్‌లో కనిపించిన ఎంపికాత్మక ప్రభావం కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. అయితే ఈ



ఫలితాలను అంతిమ విజయంగా పేర్కోవడం లేదా ఊహించడం సరికాదు. ఇప్పటివరకు జరిగిన ప్రయోగాలన్నింటినీ ప్రయోగశాలలోని పెట్రి డిష్‌లలో మాత్రమే నిర్వహించారు. మానవ శరీరంలో ఇవే ఫలితాలు వస్తాయనే హామీ లేదు. శాస్త్రీయ పరిశోధనలో ఇది తొలి దశ మాత్రమే.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్




**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఎఐటియుసి ఆటో యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మున్నూరు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగాఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మున్నూరు కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో కార్మికునికి రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై ఆర్టీవో పోలీసు వేధింపులను అరికట్టాలని డిమాండు చేశారు. ప్రతి చౌరస్తాలో ఆటో స్టాండ్స్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు మీది దొడ్డి నరసింహ, మంచాల శ్రీనివాసులు, పరుశురాములు, దేశం సైదులు, రాజేష్, శివ, రాములు, అమీర్ పాల్గొన్నారు.

## విద్యారంగం పట్ల సర్కార్ నిర్లక్ష్యం

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలో విద్యారంగం పట్ల సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రఘురాం ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిఇఒ, టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.అషూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం నియంత్రించటంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయటం కాకుండా వాటిని బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 25 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు కర్క గణేష్, దీపిక, అనిల్, వినోద్, కుశాల్, కిషోర్, పవన్‌కుమార్, మనోజ్, గౌరవ్ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** ప్రజల సమస్యలు ప్రజా పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని,కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితంగానే ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛలు ప్రజలకు లభించాయని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదబక్షిపల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం ఎర్రజాల సుజాత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని నిలిపివేయాలని, ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని నెల్లికంటి సత్యం కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షంరెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, బి.సురేష్, మేదరి యాదయ్య, విస్కీల మహేందర్, సత్యం, పున్నం లక్ష్మయ్య, విరజాల మహేందర్, యాట గిరి, పొట్ట గిరి, పొట్ట అశోక్, తానేదారుపల్లి ఈశ్వర్, అయితేగొని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాల కోసం ఉద్యమించాలి

ఎఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాల్సిన సమయం అసన్నమైందని ఎఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన ఎఐవైఎఫ్ పట్టణ, మండల మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగ సమస్యలు మరింతగా పెంచారన్నారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తాయని, ఈ విషయాన్ని యువత గమనంలో ఉంచుకుని సరైన సమయంలో సరైన రీతిలో గుణపాఠం చెప్పాలన్నారు. మహాసభలో పరికె భరత్, కొమర్రాజు వెంకట్, వాడాల భాస్కర్, ఎస్‌కె ఇంద్ర, భాష, బత్తిని శ్రీనివాసగౌడ్, హజరత్, శ్రీనివాస్, సలీం పాల్గొన్నారు.




# యూరియా 'యాప్' ఎత్తివేయాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి
ముత్యాల విశ్వనాథం డిమాండ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, యూరియా యాప్‌ను ఎత్తివేయాలని తదితర రైతాంగ సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఎఐకెఎస్ ) ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు రైతులు, వ్యవసాయ కూలీలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు చంద్రా నరేంద్ర కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఆరోపించారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తూ రైతాంగానికి గొడ్డలి పెట్టులా వ్యవహరిస్తున్నదని, రైతాంగానికి కావలసిన విత్తనాలు, డిఏపి తదితర కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచి రైతుల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించటంలోను అన్యాయం చేస్తుందని విమర్శించారు. దీనితో రైతాంగం తీవ్ర నష్టాల భారిన పడుతూ అప్పుల భారిన పడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక రైతాంగాన్ని అయోమయానికి గురిచేస్తున్నదని, ఎకరాకు 15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని చెప్పి తీరా రూ.6 వేలకు కుదించారన్నారు. రైతు భరోసాను సకాలంలో అందించక పోవటంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. రెండు లక్షల రుణమాఫి పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతులకు గుదిబండగా మారిన యూరియా యాప్‌ను ఎత్తివేసి బహిరంగ మార్కెట్‌లో యూరియా విక్రయాలకు అనుమతివ్వాలన్నారు. పండించిన పంటలకు మద్దతు ధరలను కల్పించి రైతాంగాన్ని అప్పుల భారి నుండి కాపాడాలన్నారు. అన్ని రకాల వరి పంటలను కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రాంమూర్తి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, హనుమంతరావు, గుగులోత్ రామచంద్రు, ఉప్పుశెట్టి సునీల్, నిమ్మల రాంబాబు, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు వైఎస్. గిరి, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు వాడె లక్ష్మి, సపావత్ రవి, బానోత్ రవి, నాగేశ్వరరావు, బానోత్ విజయ్‌కుమార్, గుగులోత్ భద్రు, ఇమ్మానుయేల్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, పాండవుల భిక్షం తదితర జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి
ఎస్‌కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు పోరాటాలు కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం, పేదల ఇండ్ల కూల్చివేతలకు నిరసనగా అదేవిధంగా పేదలు నిర్మించుకున్న ఇండ్లకు విద్యుత్ సౌకర్యంతోపాటు ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలం ప్రశాంత్ నగర్‌లో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దశాబ్ధాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న నిరుపేదల గుడిసెల కూల్చివేత చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు తమ సొంత శ్రమతో నిర్మించుకున్న ఇండ్లకు తక్షణమే ఇంటి నెంబర్లు కేటాయించాలని, అలాగే విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలతో పేదల ఇండ్లను కూల్చివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిరుపేదల సొంతింటి కల నెరవేరే వరకు, ప్రతి గుడిసెకు పట్టా ఇచ్చే వరకు వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఈ రాజధాని ముట్టడి పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సాబీర్ పాషా కోరారు. సమావేశంలో సిపిఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు రామవరం ఏరియా కార్యదర్శి గోపికృష్ణ, సర్పంచ్ వాడె రాములు, కార్పోరేటర్ కూరపాటి సుధాకర్, నాయకులు భూక్యా శ్రీనివాస్, తూముల శ్రీనివాస్, రాజు, దార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## హుజూర్‌నగర్‌లో భారీ కార్డెన్ సెర్చ్

అంబేద్కర్ కాలనీని చుట్టుముట్టిన 100 మంది పోలీసులు

51 వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించినట్లు కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున భారీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, ఎస్ఐ నరేష్ నేతృత్వంలో ఉదయం 4 గంటలకు హుజూర్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఈ తనిఖీలు ప్రారంభమయ్యాయి. సుమారు 100 మంది పోలీస్ సిబ్బందితో కాలనీని చుట్టుముట్టి ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేని 51 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు మోటార్ సైకిళ్లు 42, ఆటోలు 8, టాటా ఏస్ 1 మొత్తం 51 వాహనాలను సీజ్ చేశారు. అనుమానాస్పద వివరాలను సేకరించి రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానిత వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు నేరాలను అరికట్టేందుకు ఈ కార్డెన్ సెర్చ్ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం : ఎమ్మెల్సీ పింగిలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఉపాధ్యాయులకు త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని ఉపాధ్యాయ ఎంఎల్‌సి పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి కళాశాల ఆడిటోరియంలో జరిగిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తూము శ్రీనివాస్ రావు ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల ముఖ్యమంత్రి, అధికారులతో సర్వీస్ రూల్స్ విషయమై చర్చించామన్నారు. సర్వీస్ రూల్స్ లేకపోవడంతో విద్యాశాఖలో పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీని ద్వారా విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయన్నారు. డిప్యూటి డిఈఓ, డైట్ లెక్చరర్స్, మండల విద్యాశాఖ అధికారులు, తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. లోకల్ బాడీలు అనగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు పూర్తి కాగానే సర్వీస్ రూల్స్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. అనంతరం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సూరేపల్లి స్వరూపారాణి ఉద్యోగ విరమణ అభినందన సభకు హాజరై సన్మానించారు. ఈ సమావేశంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్ రావు, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, దేవరశెట్టి జనార్ధన్, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తంగెళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్, బొల్లికొండ కోటయ్య, కందుకూరి శివశంకర్ పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా నియోజక వర్గానికి చెందిన 41 మంది లబ్ధిదారులకు రూ.19,50,750 విలువైన చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య చికిత్స కోసం ఈ సహాయాన్ని మంజూరి చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి అవసరమైన కుటుంబానికి సకాలంలో సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తానన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం మా బాధ్యతని స్పష్టం చేశారు. గత 28 నెలల కాలంలో ఇప్పటి వరకు సూర్యాపేట నియోజక వర్గంలోని 208 మంది లబ్ధిదారులకు రూ.98,81,750 విలువైన ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణా రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల రమేష్ నాయుడు, జ్యోతి కరుణాకర్, మేఘ్యతండ సర్పంచ్ రాజు నాయక్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/దేవరకొండ:** హైదరాబాద్ ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ కలిసి దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం, పెండింగ్ పనులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల విస్తరణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఎల్‌ఏ బాలునాయక్ విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎంఎల్‌ఏ బాలునాయక్‌కు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన కర్తవ్యం అని దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తానని ఎంఎల్‌ఏ బాలునాయక్ తెలిపారు.

# మేర (దర్జీ)లకు ప్రభుత్వం అండ

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్టలో మేరు కుల సంక్షేమ భవనం, బ్యాంకెట్ హాల్ భవనం వద్ద సిసిరోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** రాష్ట్రంలోని మేర (దర్జీ) కులస్థుల సంక్షేమానికి ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో తన గెలుపులో మేర కులస్థుల పాత్ర ఎంతో కీలకమని ఆయన కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా నిర్మించిన 'మేర కుల సంక్షేమ భవనాన్ని', అందులోని బ్యాంకెట్ హాల్‌ను మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్ రాజం గారితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. సంక్షేమ భవనం ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం, ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు, కార్పొరేషన్ చైర్మన్‌కు స్వాగతం పలికారు.

**గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు..**
**ఈ ప్రభుత్వంలోనే పెద్దపీట!**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ..మేరకుల సోదరులు ఎంతో శ్రమించి, కష్టపడి స్వశక్తితో ఈ సంక్షేమ భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు మేర కులాన్ని పూర్తిగా విస్మరించాయి. కానీ మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే మేర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్ను నియమించడం ఈ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్ ట్రస్టు సభ్యుల విజ్ఞప్తి మేరకు భవనం సమీపంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల నిధుల తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. భవిష్యత్తులో మేర కార్పొరేషన్ ప్రభుత్వం నుండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఆధునిక రంగంలోనే యువత, మహిళలు రాణాలి. మన సంస్కృతి, సాంప్రదాయాలు, వస్త్రధారణను కాపాడుతున్న గొప్ప వృత్తి దర్జీ వృత్తి అని బీర్ల అయిలయ్య కొనియాడారు. ప్రతి పండుగ, పెళ్లి, శుభకార్యాల్లో దర్జీల సేవలు అనివార్యమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మేర సంఘం నాయకులు, ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ఖాజీరామారంలో విషాదం -కన్నీరుమున్నీరైన కుటుంబాలు



**ప్రజాపక్షం/తిప్పర్తి:** సెలవు రోజున సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోవడంతో తిప్పర్తి మండలం ఖాజీరామారం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ హృదయవిదారక ఘటనతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. మృతులు మని భార్గవ్ (14),వినయ్ (12)గా పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం సుమారు 4.30 గంటలకు గ్రామానికి చెందిన మేడబోయిన పాపయ్య పొలం సమీపంలోని బావి వద్ద గాలంతో చేపలు పట్టేందుకు ఇద్దరూ వెళ్లారు.ఈక్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడిపోవడంతో ఇద్దరూ నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.రాత్రి వరకు పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, గ్రామస్తులతో కలిసి ఆందోళనగా గాలింపు చేపట్టారు. చివరకు బావి వద్ద వారి చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి వెంటనే గజ ఈతగాళ్ల సహాయంతో బావిలో వెతకగా ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి.ఈ దృశ్యం చూసిన తల్లిదండ్రులు,కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్థుల హృదయాలను కలచివేశాయి.ఈ ఘటనపై బాలుడు వినయ్ తండ్రి బోలుగురు నరేష్ ఫిర్యాదు మేరకు తిప్పర్తి ఎస్ఐ వి. శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.ఈ విషాద ఘటన మరోసారి బహిరంగ బావుల వద్ద పిల్లలు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన వ్యక్తిత్వం, మానవత్వం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. 'తెలంగాణలో ఏ నాయకుడికి లేనంత సమయాన్ని రాహుల్ గాంధీ నాకు ఇచ్చారు. ఆయనతో పార్టీ నిర్ణయాలతో పాటు వ్యక్తిగత, కుటుంబ విషయాలను కూడా చర్చించాను. పార్టీలో నాకు ఆ స్థాయి గుర్తింపు ఉంది' అని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. రాబోయే ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగేలా, ప్రజల నాడిని పట్టుకుని పనిచేస్తామని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడం తన ప్రాథమిక బాధ్యతని, పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. తాను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాననే ప్రచారంలో వాస్తవం లేదని రాజగోపాల్ రెడ్డి కొట్టిపారేశారు. 'నేను ఎప్పుడూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నాను. కొన్ని సందర్భాల్లో పార్టీ తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టినంత మాత్రాన, పార్టీని వ్యతిరేకించినట్లు కాదు. యాదగిరిగుట్ట విషయంలో నేను చేసిన వ్యాఖ్యలు తప్పని సరి పరిస్థితుల్లో చేసినవే తప్ప, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు' అని స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేయడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ కార్యకర్తలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని ఆయన పునరుద్ఘాటించారు.

**నియోజకవర్గంలో ఒక్కరికీ కూడా కంటి సమస్య ఉండొద్దు**

'మునుగోడు నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఏ ఒక్కరూ బాధపడకూడదు. ప్రతి మనిషికి చూపును అందించే బాధ్యత నాది. ఆపరేషన్ అంటే భయం వద్దు.. మీకు నేనున్నాను, ధైర్యంగా వెళ్లి చికిత్స చేయించుకుని రండి' అని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ వేదికగా ఆదివారం ఏర్పాటు చేసిన 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, శిబిరాన్ని ప్రారంభించారు. 15వ విడత శిబిరంలో 1,210 మందికి పరీక్షలు నిర్వహించగా, 208 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.


## కరాటే, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు ప్రశంసలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కరాటే వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,ధైర్యం,ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక 34వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ ప్రదానోత్సవం,సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ప్రతి విద్యార్థి,ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ వీరబాబు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు వ్యక్తిగత క్రమశిక్షణ కూడా పెంచే ఇటువంటి క్రీడలను నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. నాగార్జున కరాటే అకాడమీ మాస్టర్ నాగార్జున,మెట్ల నాగార్జున, సోములు,కుశాల్, రాము, వెంకట్, అవినాష్, స్వాతి, పావని, రేణుక, వివేక్ రెడ్డి పాల్గొన్నారు.

## నాసిరకం రోడ్లు..!

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా... అధికారుల పర్యవేక్షణ లోపమా..



**ప్రజాపక్షం/చింతలపాలెం :** ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారులు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు రూ. 14కోట్ల వ్యయంతో నిర్మించిన చింతలపాలెం రేవూరు డబుల్ బీటి రోడ్డు ప్రారంభం కాకముందే పలుచోట్ల పై పొర పెచ్చులుగా ఊడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. కొత్తగా నిర్మించిన రోడ్డు ఈ దుస్థితికి చేరుకోవడంతో పనుల నాణ్యతపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నాసిరకం మెటీరియల్ వినియోగం, నిబంధనల ప్రకారం వారు పనులు చేపట్టకపోవడం ఇందుకు కారణమని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే కాంట్రాక్టర్ నిర్మించిన మేళ్లచెరువుచింతలపాలెం రహదారి కూడా ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే పెచ్చులుగా ఊడిపోవడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులతో అధికారులు మరమ్మత్తులు చేయించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అదే కాంట్రాక్టర్‌కు మరోసారి భారీ పనులు అప్పగించడం, మరలా అదే తరహా లోపాలు బయటపడటం పట్ల ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడంపై విమర్శలకు తావిస్తుంది. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, రహదారి నిర్మాణ నాణ్యతపై సాంకేతిక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ముగిసిన పద్మశాలి సహకార సంఘ ఎన్నికల నామినేషన్ల పర్వం

సిరిపురం,వెల్లంకి గ్రామాల్లో పోటాపోటీగా నామినేషన్లు

ఇంద్రపాలనగరం,జనంపల్లిలో ఏకగ్రీవానికి ఓటర్ల మొగ్గు

సోమవారం తుది జాబితా విడుదల : 10న పోలింగ్




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పద్మశాలి సహకార సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. సంఘ పరిధిలోని వివిధ గ్రామాల నుండి అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు.కొన్ని గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండగా, మరికొన్ని గ్రామాల్లో ఏకగ్రీవ దిశగా అడుగులు పడుతున్నాయి.రామన్నపేట మండల కేంద్రంలో మొత్తం 12 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 8 మంది పురుషులు, 4 మహిళా అభ్యర్థులు ఉన్నారు. సిరిపురం గ్రామంలో అత్యధికంగా పోటీ నెలకొంది. మొత్తం 41నామినేషన్లు రాగా అందులో 36 మంది పురుషులు, 5 గురు మహిళలు బరిలో నిలిచారు. వెల్లంకి గ్రామంలో కూడా గట్టి పోటీ కనిపిస్తోంది. మొత్తం 31 నామినేషన్లు దాఖలు కాగా, 26 మంది పురుషులు,5 గురు మహిళలు ఉన్నారు. మునిపంపుల గ్రామం నుండి మొత్తం 13 నామినేషన్లు రాగా, అందులో 9 మంది పురుషులు,4 గురు మహిళలు పోటీ పడుతున్నారు.బోగారం గ్రామంలో 17మంది పురుషులు,5మహిళలు పోటీలోఉన్నారు.ఇంద్రపాల నగరం,జనంపల్లి గ్రామాల్లో ఓటర్లు ఏకగ్రీవానికి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.ఇక్కడ ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవం చేసేందుకు స్థానిక ఓటర్లు, పెద్దలు ఆసక్తి కనబరుస్తున్నారు.సోమవారం మధ్యాహ్నం లోపు ఎన్నికల అధికారులు తుది అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది.ఈ జాబితా వెలువడితేనే ఏయే స్థానాల్లో ఎవరెవరు బరిలో ఉంటారనే దానిపై పూర్తి స్పష్టత రానుంది. కాగా,ఈ సహకార సంఘ ఎన్నికల పోలింగ్ ఈ నెల 10న జరగనుంది.

## భద్రతే లక్ష్యం... నేరాలపై ఉక్కుపాదం


కోదాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి కె.నర్సింహ

**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి కె.నర్సింహా ఆదివారం కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం సమర్పించగా ఎస్‌పి పోలీస్ కవాతును పరిశీలించి సిబ్బంది సామాగ్రి ఆయుధాలు, స్టేషన్ నిర్వహణ తీరును తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నమోదు విదానం, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, స్వాధీనంలో ఉన్న వాహనాలను పరిశీలించి పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వేగవంతమైన పోలీస్ సేవలందించాలని, డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్ విధానాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్‌పి కె. నర్సింహా మాట్లాడుతూ కోదాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణమని, ప్రజల భద్రత కోసం ఆధునిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. హైద్రాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ ఉండటంతో రోడ్డు ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, సమాజాన్ని డ్రగ్స్ బారీన పడకుండా కాపాడేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ మగ్దుం అలీ, ఎస్ఐ లు అంజిరెడ్డి, సుధీర్, ఉపేందర్‌రెడ్డి, మల్సూర్, ఆర్‌ఎస్ఐ అశోక్, డిసిఆర్‌బి సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సిసి సందీప్, ఐటికోర్ కానిస్టేబుల్ అబేద్‌తో పాటు పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యాపేటలో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యం

ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్‌లో నూతనంగా ఎన్నికైన నియోజక వర్గంలోని పట్టణ, మండల పార్టీ అధ్యక్షుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ (యుపిఏ) ప్రభుత్వం కృషి మరువలేనిదన్నారు. కానీ సూర్యాపేట నియోజక వర్గంలో మూడు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన తన తండ్రి, మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల ఓటమి చెందారని, నేడు వర్గపోరంటూ పార్టీలో లేదన్నారు. పత్రికల్లో వస్తున్న వార్తలు తప్ప వాస్తవంగా ఎక్కడా లేవన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తులసి వనంలో గంజాయి మొక్కలా ఉన్నారని సిఎం రేవంత్ రెడ్డి ఇటీవల నల్లగొండలో నిర్వహించిన సభలో చెప్పిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. ఈ గంజాయి మొక్కను రానున్న ఎన్నికల్లో పీకివేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సూర్యాపేట పట్టణ పార్టీ అధ్యక్షులు వెలుగు వెంకన్న, సూర్యాపేట రూరల్, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్) మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, తూము సురేష్ రావు, ముస్కు రాంచంద్రారెడ్డిలను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. యువ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, చకిలం రాజేశ్వర్ రావు, మొరిశెట్టి లక్షాది, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ ఓట్లను ఉపేక్షించొద్దు: అధికారులకు సూచన

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో భాగంగా ఆదివారం యాదగిరిపల్లిలో కొనసాగుతున్న ఓటర్ల సర్వే, నమోదు కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ స్థాయి అధికారులతో (బిఎల్ఓ) మాట్లాడి, ప్రక్రియ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అధికారులను కోరారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరుకు ఫారాలు అందేలా చూడాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ఏ ఒక్క అర్హుడూ ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మందోజు నరేష్, కార్యదర్శి సురేష్, నాయకులు విజయ్, శ్యామ్, అజయ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 54వ డివిజన్‌లో 'సర్' ఫారాల పంపిణీ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా, తప్పుల్లేకుండా పూర్తి చేయాలనే లక్ష్యంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ 9వ బూత్‌లో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు సరైన విధంగా నింపించే విధానం, ఓటర్ల వివరాలను పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేసే విధానంపై సిపిఐ రాష్ట్ర నాయకులు ఎల్ వెంకట్రామయ్య నగర్ కాలనీ వ్యవస్థాపకులు సిరబోయిన కరుణాకర్ సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంబంధిత 9వ బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ)రాపాక లలిత, బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్ఏ)సిరబోయిన సతీష్, సీనియర్ నాయకులు సిరబోయిన సదానందం,రమ,ప్రణీత్,హరీష్,సతీష్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/గీసుకొండ :** ఆదివారం గీసుగొండ మండలం కొమ్మాల గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన నూతన ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.అంతకముందు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నూతన ధ్వజస్థంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని వేదపండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కొమ్మాల శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, పరకాల నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదివారం కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శన సందర్భంగా హన్మకొండలోని బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ నిర్బంధాలు ప్రజాస్వామ్యంలో మంచివి కావు అని ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నా తమను అక్రమంగా నిర్బంధించడం ఏంటి అని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పులి రజనీకాంత్, 29వ డివిజన్ అధ్యక్షుడు కొడగండ్ల సదాంతు, బైరపాక ప్రశాంత్, పులి విక్రమ్, పస్తం అనిల్, వడిచర్ల ప్రసాద్, రాచర్ల రామ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'కార్యక్రమంలో ప్రజలు బాధ్యతగా భాగస్వాములవ్వాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** ప్రభుత్వం చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలందరూ బాధ్యతాయుతంగా భాగస్వాములై తమ వివరాలు నమోదు చేసుకుని ప్రతీఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా అధికారులకు సహకరించాలని బ్లాక్ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు,10,6 వార్డుల సభ్యులు అస్రార్ ఖురేషి,నయ్యుమొద్దీన్ పేర్కొన్నారు.ఆదివారం మండలకేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాస్, బాలరాజు,బిఎల్ఒలు రాజమణి,బిఎల్ఎలు ముస్తాక్‌తో కలిసి ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.దీనికి వార్డు సభ్యులు,బిఎల్ఎలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఇంటింటికి తిరిగి అర్హులైన ఓటర్లను గుర్తించి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజలు,బిఎల్ఓ,బిల్ఏలతో పాటు అధికారరులు పాల్గొన్నారు.

## మూసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ తెరిపించాలి

ఎపిఎం నిర్లక్ష్యం వీడి క్యాంటిన్ తెరిపించాలి
సిపిఐ మండల కార్యదర్శి బాలకృష్ణ

**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ మండల మహిళ సమఖ్యకు కూత వేటు దూరంలో ఉన్న ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ గత కొద్ది నెలలుగా మూసి ఉన్న ఎపిఎం నిర్లక్ష్యంతో తిరిగి తెరుచుకోవడం లేదనీ సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అరోపించారు.ఆదివారం సిపిఐ శ్రేణులతో కలసి క్యాంటీన్ ముందు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం,వారి అభివృద్ధి కోసం మహిళ సమఖ్యల ద్వారా ఎంపిక చేసిన మహిళాసంఘ గ్రూపులకు బ్యాంకు లింకేజీల ద్వారా వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నిర్లక్ష్యంతో నీరుగారుస్తున్నారనీ ఆయన ఆరోపించారు.మరిపెడ మండల మహిళ సమఖ్య నిధులతో మంజూరైన ఇందిర మహిళ శక్తి క్యాంటిన్ గత కొన్ని నెలలుగా మూత పడిన ఎపిఎం తిరిగి తెరిపించుటలో విఫలం అయ్యారనీ,ఇప్పటికైన నిర్లక్ష్యం వీడి వెంటనే తెరిపించాలనీ ప్రజలకు అందుబాటులోకి తేవాలనీ సిపిఐ పార్టీ మండల సమితి తరుపున ప్రజాప్రతినిధులను,అధికారులను ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షంలో క్యాంటిన్ తెరిచే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న,లింగయ్య,రాములు, లచ్చు, తదితరులు పాల్గొన్నారు.

**ఎపిఎం అలివేలు మంగమ్మ వివరణ...**

గత ఎపిఎం పీరియడ్‌లో ఈ క్యాంటిన్ మంజూరు అయ్యిందనీ,గతంలోనే అది మూత పడి ఉందని,తను బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఆ క్యాంటిన్ తెరిపించాటనీ కృషి చేస్తూనే ఉన్నానని,ఇప్పటికే పలు మార్లు నిర్వాహకులకు నోటీసులు ఇచ్చానని,జూన్ నెలలోనే విఒ మీటింగ్ పెట్టి సమస్య పరిష్కరిస్తామని అన్నారు.

# ప్రజల కోసం ప్రభుత్వం గ్రామబాట



మంత్రి సీతక్క ఆలోచనతో తెలంగాణలోనే తొలి గ్రామస్థాయి ప్రత్యేక ప్రజాదర్బార్

**ప్రజాపక్షం/ములుగు:** ప్రజలే ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితికి భిన్నంగా, ప్రభుత్వమే గ్రామాలకు వెళ్ళి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే వినూత్న పరిపాలనకు ములుగు జిల్లా వేదికైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆలోచనతో ప్రారంభమైన ప్రత్యేక ప్రజాదర్బార్ రాష్ట్రంలోనే తొలిసారిగా గ్రామస్థాయిలో నిర్వహించబడింది. అడవులు, గిరిజన తండాలు అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాలో మారుమూల గ్రామాల ప్రజలు చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలకు పలుమార్లు వెళ్ళాల్సి వస్తున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి సీతక్క, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనితో ప్రజల వద్దకే ప్రభుత్వం చేరి సమస్యలు వినడం వెంటనే పరిష్కార చర్యలు ప్రారంభించడం సాధ్యమైంది.

**63 గ్రామ పంచాయతీల్లో ప్రజాదర్బార్....**

వెంకటాపురం, మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, ములుగు, తాడ్వాయి, వెంకటాపూర్, మల్లంపల్లి మండలాల పరిధిలోని మొత్తం 63 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మంత్రి సీతక్కతో పాటు అప్పటి జిల్లా కలెక్టర్ ప్రస్తుతం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ప్రస్తుత ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు స్వయంగా గ్రామాల్లో పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా వినతిపత్రాలను స్వీకరించారు.

**ప్రతి సమస్యపై తక్షణ స్పందన**

ప్రజాదర్బార్‌లో భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు, తాగునీటి సమస్యలు, అంతర్గత రహదారులు, విద్యుత్, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక సమస్యలపై వేలాది వినతులు అందాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే పంపించి చర్యలు తీసుకోవాలని మంత్రి, జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలు, సంక్షేమ శాఖలతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాయి.

**ప్రత్యేక సెల్‌తో నిరంతర పర్యవేక్షణ**

ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక నమోదు వ్యవస్థను ఏర్పాటు చేసి, జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి అర్జీ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దరఖాస్తుదారులకు పరిష్కార స్థితిని తెలియజేసే విధానాన్ని అమలు చేశారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, నూతన పెన్షన్లకు సంబంధించిన వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి అర్హుల జాబితాలను సిద్ధం చేస్తూ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చారు.

**మహిళల జీవితాల్లో ఉపాధి వెలుగులు**

ప్రత్యేక ప్రజాదర్బార్ కేవలం సమస్యల స్వీకరణకే పరిమితం కాకుండా జీవనోపాధికి మార్గం చూపిన వేదికగా నిలిచింది. ములుగు మండలం రాయినిగూడెం గ్రామం, మంగపేట మండలానికి చెందిన మహిళలు తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజాదర్బార్‌లో మంత్రి సీతక్కకు వినతిపత్రాలు సమర్పించారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క రోటరీ క్లబ్ సహకారంతో కేవలం 48 గంటల్లోనే మంగపేటకు చెందిన 10 మంది, రాయినిగూడెంకు చెందిన 15 మంది మహిళలకు మొత్తం 25 ఉచిత కుట్టు మిషన్లు అందేలా చర్యలు తీసుకున్నారు. ఆ మహిళలు కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

**ఇతర జిల్లాలకు ఆదర్శంగా ములుగు మోడల్....**

ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం గణనీయంగా తగ్గింది. గ్రామస్థాయిలోనే సమస్యల నమోదు, పరిశీలన, పరిష్కారం వేగవంతమైంది. శాఖల మధ్య సమన్వయం పెరగడంతో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేశాయి. ఏజెన్సీ ప్రాంతంలో ప్రారంభమైన ఈ ప్రజాకేంద్రీకృత పరిపాలన విధానం ప్రస్తుతం రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్ళి, సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధి అవకాశాలు కల్పించిన ములుగు ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమం, ప్రజా పాలన....ప్రగతి ప్రణాళిక విజయవంతమైనఅమలుకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.

## నిబంధనల మేరకు పారదర్శకంగా 'సర్' : కలెక్టర్

బిఎల్ఒలకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదుకు బిఎల్ఒలకు శిక్షణ



**ప్రజాపక్షం / వరంగల్ :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఒలు) సూచించారు. ఆదివారం మూడు నియోజక వర్గాల బిఎల్ఒ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌లో వర్ధన్నపేట నియోజక వర్గం, వరంగల్ ఐఎంఇ హాలులో తూర్పు నియోజక వర్గం, నర్సంపేట బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని అధికారులకు, బిఎల్ఒలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ ఎన్యూమరేషన్ ఫారమ్స్ ఇంటింటికి పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా మిగిలి ఉన్న ఫారాలను త్వరగా పంపిణీ చేయాలని, పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఓటర్‌కు రెండు ఫారంలు అందిస్తారని, అందించిన ఫారంలలో ఓటరు వివరాల నమోదుకు చేసే క్రమంలో కాలనీలోని విద్యావంతులు, యువతి యువకులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, వివిధ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్‌లు ఎన్యూమరేషన్ ఫారమ్స్ నింపడంలో సహకరించినట్లయితే ఓటర్ జాబితా ఆన్‌లైన్ చేయడం సులభతరంగా పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు వివరాలు పూరించిన రెండు ఫారాలలో ఒక ఫారంను బిఎల్ఒలకు అందించినట్లయితే అట్టి వివరాలను యాప్‌లో ఎంటర్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే నిర్వహించే సమయంలో ప్రతీ ఓటరును వ్యక్తిగతంగా కలిసి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతీ ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించి, అవసరమైన ధ్రువీకరణ అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పని చేయాలని ఆదేశించారు.బిఎల్ఒలు సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమ ంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్ ఆర్‌డిఒ సుమ,నర్సంపేట ఆర్‌డిఒ ఉమారాణి, వివిధ మండలాల తహసీల్దార్లు ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు,బిఎల్ఒలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే 'సర్' ఉద్దేశ్యం

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, చురుకుగా జరుగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లను చేర్చడం, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం, ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు మార్పులు, చేర్పులు చేపట్టడం జరుగుతుందనివివరించారు.

**ఫారాల పంపిణీ , స్వీకరణ**

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 98 శాతం ఎన్యుమరేషన్ ఫా రాల పంపిణీ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పం పిణీ చేసిన ఎన్యూమ రేషన్ ఫారాలను పూర్తి చేసి, తిరిగి స్వీకరించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందని తెలిపారు.

**డిజిటలైజేషన్ ప్రక్రియ**

సేకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సమాంతరంగా పకడ్బందీగా సాగుతోందని, ఇప్పటివరకు 9 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 317 మంది బూత్ లెవల్ అధికారులు ఈ ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఓటర్లకు, ప్రజలు ఏదేని సలహాలు, సూచనలకు బూతు స్థాయి సిబ్బందిని కానీ మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించొచ్చని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో తగిన సహాయం అందిస్తారని తెలిపారు.ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇది పూర్తిగా నిబంధనలకు లోబడి, అత్యంత పారదర్శకంగా జరుగుతున్న ప్రక్రియ అని, అర్హులైన వారందరూ తమ వివరాలను సకాలంలో అందించి, ఓటు హక్కు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నమోదు, సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా భా గస్వాములుకావాలనిఆయనసూచించారు.

## నడికూడ మండల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల కేంద్రంలో మండల జర్నలిస్టుల సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో జర్నలిస్టు మిత్రుల సూచన మేరకు అభిప్రాయాల మేరకు సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నడికూడ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నారగాని రమేష్ ,ప్రధాన కార్య దర్శిగా పంచనేని భాస్కరరావు లను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. మండల ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా గ డ్డం బాలరాజు,ఉపాధ్యక్షుడిగా ముక్కెర చిరంజీవి ,ఐలి విజయ్, సహాయ కార్యదర్శిగా బొమ్మ అశోక్,భైరి సుధీర్ కుమార్, కోశాధికారిగా ఎండి జమాలుద్దీన్, కార్యవర్గ సభ్యులుగా తాళ్ళ రవి,బెజ్జంకి రాజేందర్,తోంబురపు రజనీకాంత్, చుక్క సతీష్ లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేం ద్రంలో పనిచేయుచు న్న జర్నలిస్టు మిత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల కేంద్రంలోని అధికారులు,రాజకీయ నాయకులు ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి సహకరించాలని కోరారు.

## పోలీసుల తీరుపై ఎమ్మెల్యే పల్లా ఫైర్

అడ్డుకునేందుకు ఆర్డర్ చూపించాలని ఆగ్రహం



**ప్రజాపక్షం/జనగామ :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కన్నెపల్లి పర్యటన నేపథ్యంలో కాన్వాయ్‌ను అడ్డుకోవడంపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలీసుల తీరుపై ఫైర్ అయ్యారు. అడ్డుకోవడానికి ఎలాంటి అర్డర్ ఉన్నా చేపించాలని మండిపడ్డారు. కెటిఆర్‌ను జనగామలోని పెంబర్తి, రఘునాథపల్లిలోని కోమల్లా టోల్ ఫ్లాజా వద్ద పోటీసులు అడ్డుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలీసుల తీరును తప్పుపట్టారు. ఒక ప్రతిపక్ష నాయకుడిగా పర్యటిస్తే అడ్డుకుంటారని అని ప్రశ్నించారు. గోదావరి నుండి లక్ష క్యూసెక్కుల నీరు వృధాగా పోతుంటే కన్నెపల్లి వద్ద పంప్‌హౌస్ వద్ద మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని కోరుతున్నారన్నారు. దీనికి ఎందుకు కాన్వాయ్‌ని అడ్డగించడం అని డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి నర్సయ్యను ప్రశ్నించారు. బారికేట్లు, లారీలు అడ్డుపెట్టి కాన్వాయ్‌ను అడ్డుకోవడం సరియైంది కాదన్నారు. బిఆర్ఎస్ అంటే ప్రభుత్వానికి భయం పట్టుకుందని, ఇచ్చిన హామీలు అమలు చేయకలేక ప్రజల చేత చీత్కరించబడుతుందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు సుఖంగా ఉంటే కాంగ్రెస్ 30 నెలల పాలనలోనే రైతులు కన్నీరు పెడుతున్నారని, నీరు, కరెంట్ లేక నాట్లు వేయని పరిస్థితి ఉందన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మండిపడ్డారు.

## మాంసం విక్రయ కేంద్రాలపై మున్సిపల్ అధికారులు దాడులు

రూ. లక్షల విలువచేసే 120 కిలోల మాంసం పూడ్చివేత



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ పట్టణంలోని మాంసం విక్రయ కేంద్రాలపై కమీషనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు దాడులు నిర్వయించారు. లక్ష రూపాయల విలువైన 120 కిలోల చెడు మాంసాన్ని గుర్తించి శాస్త్రీయ పద్దతిలో జెసిబి సహాయంతో పూడ్చి పెట్టారు. చనిపోయిన, వ్యాధిగ్రస్తమైన గొర్రెలు, మేకల్ని వధిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు ఆదివారం తనిఖీలు నిర్వయించడం జరిగిందని కమీషనర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా స్వాధీనం చేసుకున్న మాంసాన్ని జనగామ పట్టణంలోని జంతు వదలశాల ఆవరణలో జెసిబి సహాయంతో పూడ్చిపెట్టడం జరిగిందనానరు. కొంత మంది వ్యాపారులు ప్రభుత్వ అనుమతితో నిర్వయిస్తున్న స్లాటర్ హౌస్‌కు జంతువులను తీసుకురాకుండా తమ సొంత ప్రాంగణాల్లోనే అక్రమంగా జంతువులును వధ చేసి మాంసాన్ని విక్రహిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని కమీషనర్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాంసం అందించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని, ఇకపై కూడా అక్రమ మాంసం వధశాలలు, నాణ్యతలేని మాంసం విక్రయాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సైతం అనుమానాస్పద మాంసం విక్రయాలు, అక్రమ వధశాల గురించి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ దాడుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ గోపయ్య, వార్డు అధికారులు, కుమార్, నిఖిల్, బొట్ల శేఖర్, జవాన్లు తిరుమల, రాజు, కృష్ణ, లక్ష్మ న్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/కాజీపేట :** కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే బోర్డు చైర్మన్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్‌ను ఆదివారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి జిల్లా యంత్రా ంగం తరఫున ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట ప్రాంతంలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల ప్రగతి, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆర్‌డిఒ వెంకటేష్, పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమంలో ప్రభుత్వం రాజీపడదు

వారి అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..
* వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ముఖ్య నాయకులతో జిల్లా మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడునాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మైనారిటీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ముస్లిం మైనారిటీ సోదరుల కోసం కబరస్థాన్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు గుర్తు చేశారు. అలాగే శాదీఖానా నిర్మాణం కోసం కూడా ప్రభుత్వ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే కేటాయించిన స్థలంపై సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించడంతో ఆ స్థల కేటాయింపు రద్దయిందని చెప్పారు.ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానికి అనువైన ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి శాదీఖానా నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టామని, మైనారిటీలకు ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను చూసి కొందరు రాజకీయంగా జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల్లో అపోహలు సృష్టించి ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలను మైనారిటీ సోదరులు విశ్వసించవద్దని కోరారు.మైనారిటీల విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు, మతపరమైన అవసరాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆయన అన్నారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రతి సమస్యను సానుకూలంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.మైనారిటీలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తుండటాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. మైనారిటీల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో టిపిసిసి మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ మీర్జా ఆజిజ్ ఉల్లా బేగ్,జిల్లా మైనారిటీ సెల్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
06-07-2026
www.prajapaksham.in

'జన నాయగన్', 'టాక్సిక్' మరియు 'మెగా158' వంటి బిగ్ చిత్రాలను నిర్మిస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ కొద్ది రోజుల క్రితం తమ రెండవ టాలీవుడ్ 'ఎన్.హెచ్.5' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. నార్నే నితిన్ ప్రధాన పాత్రలో నటించనున్న ఈ చిత్రానికి రాధాకృష్ణ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు.

రీల్

## సుకుమారి ప్రేమ ప్రేమిస్తున్న తిరువీర్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన విలేజ్ ఎంటర్‌టైనర్ 'ఓ. సుకుమారి'. భరత్ దర్శన్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. జూలై 17న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఈ క్రమంలో చిత్రం నుంచి 'ప్రేమ.. ప్రేమిస్తున్నా' అనే రొమాంటిక్, మెలోడీ పాటను విడుదల చేశారు. ఈ పాటను జేమ్స్ టకారా ఆలపించారు. పూర్ణాచారి లిరిక్స్ ఎంతో చక్కగా ఉన్నాయి. ఈ పాటకు సంబంధించిన లిరికల్ వీడియో అందరినీ ఆకట్టుకునేలా ఉంది. విలేజ్ వాతావరణం, హీరో హీరోయిన్ ట్రాక్, సింపుల్ కొరియోగ్రాఫీ పాటను అందంగా మలిచింది.రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణాచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రానికి డీవోపీ: కుషేందర్,సంగీతం: భరత్ మంచిరాజు, ఆర్ట్ డైరెక్టర్: తిరుమల ఎం తిరుపతి, ఎడిటర్: శ్రీ వరప్రసాద్, కాస్ట్యూమ్ డిజైనర్: అను రెడ్డి అక్కటి, లిరిక్స్: పూర్ణాచారి, ఫైట్స్ : అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.

## 10న తెలుగులో 'ఐ నోబడీ' విడుదల



మలయాళ టాప్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కి తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్లో రూపొందుతున్న ప్రఖ్యాత చిత్రం ' వారణాసి' లో కూడా పృథ్వీరాజ్ ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా నటించిన చిత్రం 'ఐ, నోబడీ'. దర్శకుడు నిస్సాం బషీర్ దర్శకత్వంలో జాతీయ అవార్డు గ్రహీత పార్వతి తిరువోతు తో కలిసి పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన అత్యంత ఆసక్తికరమైన యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ' జూలై 9న మలయాళంలోనూ, జూలై 10న తెలుగులోనూ థియేటర్లలో విడుదల కానుంది. శ్రీ స్రవంతి మూవీస్, మైత్రీ మూవీస్ వారు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఉత్కంఠభరితమైన కథ, వేగవంతమైన స్క్రీన్‌ప్లే, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించనుంది. ఒక సాధారణ బ్యాంకు ఉద్యోగి రాజు జీవితంలో అనూహ్యంగా జరిగిన సంఘటనలతో కథ ప్రారంభమవుతుంది. భారీ బ్యాంకు దోపిడీకి పాల్పడ్డాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజు, తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అనివార్య పరిస్థితుల్లో హింసాత్మక మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది. అసలు అతను నేరస్థుడేనా? లేక పరిస్థితుల బారిన పడిన అమాయకుడా? ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నిజం ఏమిటి? అనే ఉత్కంఠభరితమైన ప్రశ్నలకు సమాధానమే 'ఐ, నోబడీ'. పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు తమ కెరీర్‌లో మరో గుర్తుండిపోయే పాత్రల్లో కనిపించనుండగా, దర్శకుడు నిస్సాం బషీర్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల 9 న పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: నిస్సాం బషీర్, కథ స్క్రీన్‌ప్లే సంభాషణలు: సమీర్ అబ్దుల్, ఛాయాగ్రహణం: దినేష్ పురుషోత్తమన్ , సంగీతం: జేక్స్ బిజాయ్, నిర్మాతలు: ముకేష్ ఆర్ మెహతా, సుప్రియా మీనన్, సి.వి.సారథి.

## 17న థియేటర్లలో 'ఆపరేషన్ అరుణారెడ్డి' రిలీజ్



ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు పోసాని కృష్ణ మురళి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్రం అధికారిక ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 17న థియేటర్లలో 'ఆపరేషన్ అరుణారెడ్డి' ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ సందర్భంగా పోసాని కృష్ణ మురళి మాట్లాడుతూ, ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా థియేటర్లలో వచ్చి సినిమాను వీక్షించి ఆదరించాలని కోరుకుంటున్నాను అని పోసాని కృష్ణ మురళి తెలిపారు. ఈ చిత్రంలో హిందోళ చక్రవర్తి, ఆయేషా భాను, కాజల్ కథానాయికలుగా నటించగా, సుధాకర్ అక్కినపల్లి ఛాయాగ్రహణం అందించారు. మహవీర్ సంగీతం సమకూర్చారు.ఆపరేషన్ అరుణారెడ్డి' ఒక విభిన్నమైన కథతో రూపొందుతున్న చిత్రమని, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపింది. త్వరలోనే సినిమా విడుదలకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడిస్తామని పోసాని చెప్పారు.

## చాలా వరకు నిరాశే ఎదురైంది

'రావు బహదూర్' హీరో సత్యదేవ్



సత్య దేవ్, దీపా థామస్ జంటగా నటించిన రావు బహదూర్. ఈ చిత్రాన్ని జులై 3న రిలీజ్ చేశారు. సినిమా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుండటంతో ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈమేరకు విజయోత్సవ వేడుకలో సత్య దేవ్ మాట్లాడుతూ 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' తర్వాత మా 'రావు బహదూర్' తెలుగు సినిమాకు ప్రతినిధిగా ఉంటుందని చెప్పాను. ఇప్పుడు ఆడియెన్స్ కూడా అదే అంటున్నారు. నేను ప్రతీ సినిమాకి ఇంతే కష్టపడ్డాను. కానీ చాలా వరకు నిరాశే ఎదురైంది. సక్సెస్ అనేది నాకు కొత్త. 'రావు బహదూర్'తో నాకు సక్సెస్ వచ్చింది అని వినడం కంటే ఈ మూవీని చూడకపోతే ఆడియెన్స్ ఏదో కోల్పోతారని అనుకున్నాను. ఇలాంటి సినిమా ఆడాలని నేను కోరుకున్నాను అని అన్నారు.దర్శకుడు వెంకటేష్ మహా మాట్లాడుతూ 'రావు బహదూర్' కథను సత్య దేవ్ నమ్మాడు. ఈ సినిమాని అనురాగ్, శరత్‌లు నమ్మడం వల్లే ఇంత వరకు వచ్చింది. వారి వల్లే మూవీ ఈ స్థాయికి వచ్చింది. నమ్రత మేడంకి నెరేషన్ ఇచ్చాం. ఆమెకు మేం చెప్పిన కథ చాలా నచ్చింది. నా డైరెక్షన్ టీంకు థాంక్స్. నాకు సమస్య వస్తే ధినేష్ దగ్గరకే వెళ్తాను. నా డిఒపి కార్తీక్‌తో వర్క్‌ని మిస్ అవుతుంటాను. శిల్పా చేసిన కాస్ట్యూమ్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు అని అన్నారు. నిర్మాత రాజశేఖర్ మాట్లాడారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి, శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి, దీపా థామస్, మధు శాలిని పాల్గొన్నారు.

## 'ఎన్.హెచ్.5' షూటింగ్ షురూ

జన నాయగన్', 'టాక్సిక్' మరియు 'మెగా158' వంటి బిగ్ చిత్రాలను నిర్మిస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ కొద్ది రోజుల క్రితం తమ రెండవ టాలీవుడ్ 'ఎన్.హెచ్.5' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. నార్నే నితిన్ ప్రధాన పాత్రలో నటించనున్న ఈ చిత్రానికి రాధాకృష్ణ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ఇందులో అనిఖా సురేంద్రన్ మేఘా శెట్టి కథానాయికలుగా ఖరారయ్యారు. ఈ కార్యక్రమంలో, నిర్మాత వెంకట్ కె. నారాయణ ప్రారంభ క్లాప్‌బోర్డ్ కొట్టగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరాను ఆన్ చేశారు. ఈ ఉత్సాహభరితమైన సందర్భంలో, దర్శకుడు కళ్యాణ్ శంకర్ సినిమాలోని మొదటి షాట్‌ను స్వయంగా చిత్రీకరించారు. వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ యూత్‌సెంట్రిక్ ఎంటర్‌టైనర్‌కు, ప్రతిభావంతులైన తమిళ సంగీత ద్వయం వివేక్‌మెర్విన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్ర సాంకేతిక బృందంలో ఎడిటర్ నిరంజన్ దేవరమనే మరియు సినిమాటోగ్రాఫర్ రామ మారుతి కూడా ఉన్నారు.ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ మరియు ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను నిర్మాణ సంస్థ రాబోయే రోజుల్లో వెల్లడించనుంది.



## సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న 'RKదీక్ష'

### దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్



ఆర్.కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌పై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం RKదీక్ష. డి.ఎస్.రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్‌లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో సక్సెస్ ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ సప్తగిరి థియేటర్‌ను సందర్శించి అక్కడే మీడియా సమావేశం నిర్వహించారు. దర్శక నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ సప్తగిరి థియేటర్‌లో RKదీక్ష సినిమాను చూశాం. సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సప్తగిరిలో ఆల్మోస్ట్ హౌస్ ఫుల్ అయ్యింది. ఇంకా కలెక్షన్స్ పికప్ అవుతాయని ఆశిస్తున్నాం. మూడు ప్రధాన కథలను కలిపి ఈ సినిమాను రూపొందించాన్నారు. హీరో కిరణ్, హీరోయిన్ అక్సాఖాన్ మాట్లాడుతూ RKదీక్ష సినిమాను ప్రేక్షకులతో కలిసి చూశాం. ఆడియెన్స్ రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. నటి తులసి మాట్లాడుతూ ఈ చిత్రంలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్ చేశాను. అలేఖ్య రెడ్డి, అక్సఖాన్ కాంబినేషన్‌లో నేను చేసిన సీన్స్‌ను ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు అన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి

### పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలపై కఠిన చర్యలు తప్పవు: మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ నేతలంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య ఉద్యమం కోసం పుట్టిన పార్టీ అని, ఆర్ఎస్ఎస్ మాత్రం కుల, మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. 'కాంగ్రెస్ స్వయం సేవక్ సంఘం ఆర్ఎస్ఎస్ కంటే గొప్పదన్నారు. అయోధ్య రామమందిరంలో ఇటీవల జరిగిన ఘటన దేశ ప్రతిష్ఠను పూర్తిగా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలో ఏర్పాటైన కమిటీ సభ్యులే ఇందులో ఉన్నారని,చివరికి రాముడిని కూడ బిజెపిమోసం చేసిందని పేర్కొన్నారు. . భవిష్యత్ ఎన్నికలు కాంగ్రెస్ (రాముడి), బిజెపి( రావణాసురుడి)కి మధ్య జరిగే పోరులా ఉంటాయని, బిజెపికి ఇవే చివరి ఎన్నికలని మల్లు రవి జోస్యం చెప్పారు.

**గీత దాటితే చర్యలు తప్పవు :**

కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా వ్యాఖ్యలు చేసే నాయకులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి హెచ్చరించారు. గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన క్రమశిక్షణ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీ అంతర్గత విభేదాలను మీడియా ముందు ప్రస్తావిస్తే సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుపై కత్తి వెంకటస్వామిని విచారించినట్లు తెలిపారు. తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆయన వివరణ ఇచ్చారని చెప్పారు. అలాగే అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడారంటూ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు అమరేందర్ రెడ్డిపై వంశీకృష్ణ ఫిర్యాదు చేయడంతో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు వెల్లడించారు.

## తక్షణమే తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యాన్ని సహించబోమని తేల్చిచెప్పింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలకు అసలు ఎలా ఆమోదం లభించిందని కేంద్రం ప్రశ్నించింది. ప్రకటనల పరిశీలన, ఆమోద ప్రక్రియలో ఎక్కడ లోపాలు జరిగాయో వివరించాలని మెటాను కోరింది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో కూడా తెలియజేయాలని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి సాంకేతిక, భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా చిన్నారులకు హాని కలిగించే కంటెంట్‌ను గుర్తించడం, తొలగించడం, సంబంధిత ఖాతాలు, ప్రకటనదారులపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఓ మీడియా సంస్థ దర్యాప్తు కథనం నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మెటాకు చెందిన రికమెండేషన్ అల్గారిథమ్ చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను ప్రోత్సహిస్తోందని ఆ కథనంలో ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలు కూడా కనిపించినట్లు పేర్కొంది.

### కేంద్ర ప్రభుత్వం మహిళా వ్యతిరేకి

## దేశవ్యాప్తం ఉద్యమాలకు మహిళ కాంగ్రెస్ సిద్ధం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో గత మూడు నెలలుగా 19 జిల్లాల్లో నిర్వహించిన సమావేశాలకు మహిళల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన పట్ల మహిళలు సంతృప్తిగా ఉన్నారని, మహిళా సాధికారతకు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.16 లక్షలకు పైగా మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు నమోదు అయ్యాయని, సెప్టెంబర్‌లో రెండు రోజులపాటు మహిళా నాయకులకు శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ధర్నా చేపడతామని, జూలై 20 నుంచి ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబిసి మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని అల్కా లంబా డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అలాగే, 'ఆపరేషన్ సింధూర్' అంశంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంట్‌లో అసత్యాలు చెప్పారని ఆరోపించారు. అయోధ్య రామాలయంలో జరిగిన దొంగతనం ఘటనపై ప్రధాని స్పందించకపోవడాన్ని ప్రశ్నిస్తూ, బిజెపిని 'చందా చోర్ సర్కార్', 'ఓటు చోర్ సర్కార్'గా అభివర్ణించారు. తెలంగాణ మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమంతో పాటు 9133400200 నంబర్‌కు మిస్‌కాల్ ఇచ్చే నిరసన కార్యక్రమాన్ని కూడా చేపట్టినట్లు ఆమె తెలిపారు. న్యాయవ్యవస్థకు చెందిన పలువురు కూడా కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తున్నారని అల్కా లంబా పేర్కొన్నారు.

## కర్ణాటక తరహాలో పాల పరిశ్రమ మరింత బలోపేతం

- పెండింగ్ బిల్లుల పరిష్కారనికి త్వరితగతిన చర్యలు
- టిఎస్‌డిడిసిఎఫ్ 60వ వార్షికోత్సవ వేడుకలలో మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/రంగారెడ్డి/షాద్‌నగర్:** విజయ డైరీ రైతుల పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారనికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంద నీ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య,పాలాభివృద్ధి, క్రీడ లు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.ఆదివారం షాద్‌నగర్‌లో విజయ డైరీ పాల ఉత్పత్తిదారుల రైతులతో నిర్వహించిన "తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (టిఎస్‌డిడిసిఎఫ్) 60వ వార్షికోత్సవ వేడుకలకు మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. రైతుల కష్టార్జిత శ్రమతో విజయ డైరీ దేశవ్యాప్తంగా ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు.పాల ఉత్పత్తిదారులకు ప్రస్తుతం అందుతున్న ధరను మరింత మెరుగుపరిచేందుకు, ప్రోత్సాహకాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.రైతుల ప్రధాన సమస్యగా ఉన్న బిల్లుల చెల్లింపుల అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నామని, దీనిపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు.ఈ విషయంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌లతో చర్చించినట్లు స్పష్టం చేశారు. అవసరమైతే ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమై బిల్లుల సమస్యకు త్వరితగతిన పరిష్కారం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల పాలను కొనుగోలు చేస్తున్నామని,భవిష్యత్తులో ఈ పరిమాణాన్ని 22 లక్షల లీటర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. ముందుగా స్థానిక రైతుల పాలకే ప్రాధాన్యం కల్పించి, అవసరమైన మేరకు ఇతర రాష్ట్రాల నుంచి పాల కొనుగోళ్లను తగ్గించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

### కర్ణాటక తరహాలోబలోపేతం

కర్ణాటక తరహాలో పాల పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర అధ్యయనం జరుగుతోందని, బ్యాంకులతో కలిసి రైతులకు అనుకూలమైన కొత్త పథకాన్ని రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు. రైతు భాగస్వామ్యం, బ్యాంకు రుణం, ప్రభుత్వ సబ్సిడీ అంశాలతో కూడిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్) సిద్ధమవుతోందని, అది పూర్తయిన వెంటనే షాద్‌నగర్ విజయ డైరీ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్త పథకాన్ని ప్రకటిస్తామని తెలిపారు.విజయ డైరీ అభివృద్ధి,పాల ఉత్పత్తిదారుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించి తెలంగాణలో పాల పరిశ్రమను మరింత బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్,వివిధ సంస్థల చైర్మన్లు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక శోభ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు కోటిలింగాల లోని కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గానికి పుష్కర పనుల కోసం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో కోటిలింగాలలో పుష్కర ఘాట్ నిర్మాణానికి రూపాయలు 8 కోట్లు కోటిలింగాల నుండి పాశీగాం వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్లు కేటాయించినట్లు వివరించారు.ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయించగా వెల్గటూర్ నుండి కోటిలింగాల వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ కొరకు రూ. 20 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.కోటిలింగాలతోపాటు రాజక్క పల్లి వద్ద మిని ట్యాంక్ బండ్ మాదిరిగా నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. అనంతరంకోటిలింగాల గ్రామానికి చెందిన మంచి కట్ల మణి తేజ ఇటీవల కుక్క కాటుకు గురై మరణించగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఈ సందర్భంగా మణితేజ కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు.అలాగేవెల్గటూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన సింగం రాజేశ్వరి తిరుపతి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ తదితరులు ఉన్నారు.

## 150 దేశాలకు చైనా రోబోల ఎగుమతి

**బీజింగ్:** ఈ ఏడాది మొదటి ఐదునెలల కాలంలో వివిధ కేటగిరీలకు చెందిన రోబోలను చైనా భారీ ఎత్తున ఎగుమతి చేసి రికార్డు సృష్టించింది. మొత్తం 150 దేశాలకు ఈ ఎగుమతులు జరిగాయి. ఈ ఎగుమతులకు ఎక్కువగా యూరప్,ఆసియా దేశాలే అత్యధిక గమ్యస్థానాలు. పారిశ్రామిక రంగాలకు ఉపయోగపడే 70,000 రోబోలను ఈ ఏడాదిలో చైనా ఎగుమతి చేసింది. గత ఏడాదిలో పారిశ్రామిక రోబోల ఎగుమతులు చైనా నుండి 48.7 శాతం పెరిగాయి. పారిశ్రామిక రోబోల ఉత్పత్తి ఈ ఏడాదిలో 28 శాతం పెరిగాయి. గత ఏడాదిలో చైనాలో 140కి పైగా పూర్తిస్థాయి రోబో తయారీ సంస్థలు ఉండగా, 330 హ్యూమనాయిడ్ రోబో ఉత్పత్తులు విడుదలయ్యాయి. రోబో టెక్నాలజీలో అమెరికాను సవాలు చేసి ఆ దేశాన్ని తలదన్నేరీతిలో ముందుకు దూసుకువెళుతున్న చైనా ఈ ఏడాది జనవరి నుండి మే నెల వరకూ 10.377 మిలియన్ల రోబోలను అనేక దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా 2.98 మిలియన్ డాలర్లు లేదా 20 బిలియన్ యువాన్ల ఎగుమతులను సాధించింది.ఇప్పటికే చైనా ప్రభుత్వం స్కూలు నుండి యూనివర్సిటీ స్థాయి వరకూ వందల రకాల రోబో కోర్సులను విద్యార్థులకోసం ప్రవేశపెట్టి ప్రపంచదేశాల్లో అగ్రస్థానంలో నిలబడింది. ఈ ఏడాది చైనా రోబో ఎగుమతులు శరవేగంగా ప్రపంచమంతటా విస్తరించాయి. ఈ ఎగుమతులతో చైనా రోబో రంగానికి వినూత్నమైన కొత్త ఊపు వచ్చింది. చైనా నుండి చాలా వైవిధ్యభరితమైన రోబోల ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుత దశలో క్లీనింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే రోబోలనే యూరప్,ఆసియా దేశాలు అత్యధికంగా కొనుగోలు చేస్తున్నాయి.

## బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని అధికార బిజెపి ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం ఖర్గే కర్నాటకలోని చిక్కబల్లాపూర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకుంటూనే, ఎన్నికల ప్రక్రియలో అక్రమాల ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని ఖర్గే ఆరోపించారు. దేవుడి పేరుతో ఎంత దోపిడీ జరుగుతోందో అందరూ చూశారని, అయోధ్యలో ఏం జరిగింది? పేదలు చేశారా? దళితులు చేశారా? రైతులు చేశారా? వీరెవరూ కాదుగా అని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపికి సంబంధించిన వ్యక్తులే దానికి పాల్పడ్డారని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. అయోధ్య రామమందిరం విషయంలో సుమారు రూ. 20,000 కోట్ల విలువైన ఆస్తులు దోపిడీకి గురయ్యాయని ఆయన ఆరోపించారు. రామమందిరం పేరుతో విరాళంగా ఇచ్చిన బంగారం, వెండి, ఇటుకలు కూడా దోపిడీకి గురయ్యాయని, ప్రతిరోజూ వారు దేవుడి నామాన్ని జపిస్తారు, కానీ అదే దేవుడి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, అసోం వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణల ద్వారా బిజెపి ఓట్ల దొంగతనానికి పాల్పడిందని, అధికారంలో కొనసాగడానికి రాజ్యాంగ ప్రక్రియలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. త్వరలో జరగనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల గురించి ప్రస్తావిస్తూ, ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన, ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లుతో సహా తమ రాజకీయ స్థానాన్ని బలోపేతం చేసుకునే చర్యలను కేంద్రం ముందుకు తీసుకురావాలని భావిస్తోందని ఖర్గే ఆరోపించారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆహార భద్రతా చట్టం వంటి సంక్షేమ చర్యలను బలహీనపరచడంపై ఆయన బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పరిపాలనపై కాకుండా కేవలం ఎన్నికలపైనే దృష్టి సారిస్తోందని ఆరోపించారు. ఏ పేదవాడూ ఆకలితో ఉండకూడదనేది తమ లక్ష్యం కావాలని, ప్రజలకు పని, ఆహారం, గౌరవం ఇవ్వాలని, కానీ బిజెపి కేవలం ఓట్ల గురించే ఆలోచిస్తోందని మండిపడ్డారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com